# కర్తవ్యనిష్ఠ

## వ్యక్తిత్వ నిర్మాణానికి అతి చేరువైన మార్గం


***రచన***

అమిరపు నటరాజన్


***సలహా మండలి***

అమిరపు సురేష్

సి. శ్రీధర్

డా. టి.జి.కె. మూర్తి

ఆచార్య పి. శ్యామసుందరమూర్తి

డా. (శ్రీమతి) సి.హెచ్. చిరంజీవి

డా. నెమ్మాని రామగోపాల్

కె.వి. రామగోపాల శర్మ


***ప్రకాశకులు***

శ్రీరామకృష్ణ సేవా సమితి

బాపట్ల – 522 101

ప్రకాశకులు
శ్రీరామకృష్ణ సేవా సమితి
బాపట్ల - 522 101

© సర్వహక్కులూ ప్రకాశకులవి

ప్రథమ ముద్రణ - డిసెంబరు, 2009 ప్రతులు - 3000

ప్రతులకు
శ్రీరామకృష్ణ సేవా సమితి
విజయలక్ష్మీపురం
బాపట్ల - 522 101

# ప్రకాశకుల మనవి

దైనందిన జీవితంలో పని చేసే పద్ధతిపట్ల శ్రద్ధ తీసుకోవడం ద్వారా గొప్ప ప్రావీణ్యాన్ని సాధించవచ్చు. దానివల్ల మన ఆంతరిక ప్రకృతిని మన స్వాధీనంలోకి తెచ్చుకోగలుగుతాము.అటువంటి వాడికి బాహ్యప్రకృతి కూడా దాసోహమంటుంది. కాబట్టి జీవితపు ప్రారంభదశలలో ఉన్నవారు తమ చేతిలో ఉన్న పనిని శ్రద్ధతో, నిష్ఠగా చేయడం ద్వారా తమ వ్యక్తిత్వాన్ని మహత్తరంగా నిర్మించుకోవచ్చు. అక్కడితో ఆగక మోక్షాన్ని కూడా పొందవచ్చు. కర్మయోగంలో చెప్పబడిన ఈ మార్గం మనకు అతి సన్నిహితంగా ఉంటుంది. కనుకనే కర్తవ్యనిష్ఠను వ్యక్తిత్వనిర్మాణానికి దగ్గరిదారిగా చెప్పుకోవచ్చు. మరొకప్రక్క సమసమాజ నిర్మాణానికి కూడా కర్తవ్యనిష్ఠ గొప్పగా దోహదం చెయ్యగలదు.

సంక్లిష్టమైన ఈ మార్గాన్ని, దానిలోని అనేక అంశాలను, అది ప్రభావం చెయ్యగల అనేక జీవనరంగాలను, ఈ చిన్న పుస్తకంలో, సులభమైన విధంగా, వివేకానంద స్వామి బోధనల నేపథ్యంలో వివరించడానికి ప్రయత్నించాము.

ఈ పుస్తకంలో భావాలన్నీ వివేకానంద స్వామి బోధనల స్ఫూర్తితో వ్రాయబడ్డాయి. ఈ పుస్తకంలో తరచుగా వాడబడిన 'స్వామీజీ' అన్న పదం వివేకానంద స్వామిని సూచిస్తుంది. ఆయన బోధనలను ఎత్తి వ్రాసినప్పుడు వాటిని ఇటాలిక్కులలో ఇచ్చాము.

ఈ పుస్తక రచయిత అమిరపు నటరాజన్‌కు మా కృతజ్ఞతలు. ఈ పుస్తకాన్ని మరింత చక్కగా తీర్చిదిద్దడానికి తమ అమూల్యమైన సలహాలను అందించిన శ్రీ అమిరపు సురేష్, శ్రీ సి. శ్రీధర్ ఐ.ఏ.ఎస్., డా. టి.జి.కె. మూర్తి, ఆచార్య పన్నాల శ్యామసుందర మూర్తి, డాక్టర్ నెమ్మాని రామగోపాల్, డాక్టర్ (శ్రీమతి) చిరంజీవి, కె.వి.రామగోపాల శర్మ ప్రభృతులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఆధునిక యువతకు కలిగే అనేక సందేహాలకు ఈ పుస్తకం సమాధానాలు అందించి, వారిని మరింతగా ఆలోచింపజేస్తుందని మా నమ్మకం.

– ప్రకాశకులు

SRI RAMAKRISHNA MATH
RAMAKRISHNA VIVEKANANDA NAGAR
SWAMI VIVEKANANDA ROAD
RAJAHMUNDRY 533 105
Phone : 473112

# ముందుమాట

వివేకానంద స్వామి ఇచ్చిన సందేశాన్ని కొందరు 'యువతకు పిలుపు' అని అంటే, మరి కొందరు 'దేశానికే హితవు' అని అంటారు. ఎవరు ఎలా పేర్కొన్నా, దాని సారాంశం మాత్రం 'కర్మ'ను గురించే బోధిస్తుంది. పని చేయకుండా ఏదీ సాధించలేము. మన దేశపు యువతరం తమను తాము మెరుగుపరచుకోవాలనీ, ఏదో సాధించాలనీ, దేశానికి తాము సైతం సేవ అందించాలనీ ఆతురపడుతున్న ఈ తరుణంలో పని చేయడంలోని రహస్యమేమిటో వారికి చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఎలా పడితే అలా చేసే పని మన అభివృద్ధికి దోహదం చెయ్యదు. కొన్ని ధర్మసూత్రాలను ప్రాతిపదికగా చేసుకుని, పట్టుదలతో, ఒక ఖచ్చితమైన గమ్యం దిశగా చేసే పని మాత్రమే మన యొక్క సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తుంది.

పనిలో పరిపూర్ణత్వాన్ని సాధించడానికి పట్టువదలకుండా కృషి చెయ్యడమే మార్గమని చెప్పే అనేక పుస్తకాలను ఇప్పటికే పాశ్చాత్యులు రచించారు. అయితే మన సనాతన ఋషులు చెప్పిన 'కర్తవ్యనిష్ఠ' అనే భావన ఆ పాశ్చాత్యభావనల కంటే మరింత లోతైనది. ఎందుకంటే ఈ నిష్ఠ అనే మాట, వారు వాడిన అనేక ఆంగ్లపదాల కంటే లోతైన అర్థాన్ని కలిగివుంది. పైగా, కేవలం పనికి అంటిపెట్టుకోవడమనేదాని కన్నా విభిన్నమైన పరమార్థం అందులో ఇమిడి వుంది.

నిష్ఠ అనే మాటలో పని పట్ల ఒక విధమైన ఆరాధనాభావం, విశ్వాసం కలగలిసి ఉన్నాయి. వ్యక్తి తన పనిని ప్రేమించగలిగినప్పుడే ఈ ఆరాధనాభావం, భక్తివిశ్వాసాలు కలుగుతాయి. కానీ దైనందిన జీవితంలో ప్రతిసారీ మనకు ఇష్టమైన పని, నచ్చిన ఉద్యోగం దొరకడం కష్టం. మరి అటువంటి పరిస్థితిలో ఏమి చెయ్యాలి? మనకు ఇవ్వబడిన పనిని

ప్రేమించడం నేర్చుకోవాలి! పనిచేసేవాడు తాను చేసే పనిలో పూర్తిగా నిమగ్నమైపోవడాన్ని ఈ 'నిష్ఠ' అనే పదం సూచిస్తుంది.

**స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।**
**స్వకర్మ నిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥ గీత 18.45**

"తమతమ పనులను అధికమైన, అవిచ్ఛిన్నమైన ఆసక్తితో, చేసేవారు పరమసిద్ధిని పొందుతారు" అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు.

పై శ్లోకంలో 'నిరతః' అనే పదాన్ని అర్థం చేసుకోవాలంటే, కొందరు గొప్ప శాస్త్రజ్ఞుల జీవితాలను గమనించాలి. వారిలో కొందరికి భోజనం వేళ దాటిపోయినా తెలిసేది కాదు. ఎవరైనా స్నేహితుడు తమ కోసం వేచి ఉన్నాడేమో గమనించేవారు కారు. ఇదంతా పనిలో మునిగిపోయినందువల్లనే జరుగుతుంది.

చేసే పని మన వ్యక్తిత్వం మీద చూపే ప్రభావాన్ని వివరిస్తూ, వివేకానంద స్వామి, *"మనం చేసే ప్రతి పని, అది శారీరికమైనది అయినా, మానసికమైనది అయినా, తనదైన ముద్రను (సంస్కారాన్ని) మన స్వభావం మీద వేస్తుంది. మనిషి వ్యక్తిత్వం మీద, శీలం మీద, కర్మ చూపే ప్రభావమే అతడు ఎదుర్కోవలసిన శక్తులన్నింటిలోకీ అత్యంత శక్తిమంతమైనది"* అని చెప్పారు. మనిషి తాను చేసే పని కేవలం ఏదోవొక వస్తువునో, సేవనో ఉత్పత్తి చేయడానికి మాత్రమే కాదనీ, అది తన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదం చేస్తుందనీ గమనించి పనిచేస్తే, మనిషి తాను చేసే పనిలో లీనమై పనిచేయగలుగుతాడు.

చాలామంది ఈ భావనలన్నీ కేవలం సిద్ధాంతాలేననీ, నిత్యజీవితంలో అవి ఉపయోగపడవనీ అనుకుంటారు. కానీ వివేకానంద స్వామి అవి ఎంత ఆచరణాత్మకమైనవో నొక్కి వక్కాణించారు. *"ఈ వేదాంతసూత్రాలు కేవలం అడవులలోనే ఉండిపోకుండా బయటకు రావాలి. గుహలలో దాగి ఉండకుండా న్యాయస్థానాలలోకీ, మతబోధనలలోనికీ రావాలి. పేదవాడి కుటీరంలోకీ, చేపలు పట్టే జాలరుల వద్దకూ, చదువుకునే విద్యార్థుల వద్దకూ చేరుకుని వారి దైనిక జీవితంలో ఉపయోగపడి, వారి బ్రతుకులలో వెలుగు నింపాలి."* కాబట్టి ఈ అత్యున్నత సత్యాలు అత్యంత

ఆచరణీయమైనవని గ్రహించి, వాటిని పూర్తి విశ్వాసంతో మన జీవితంలో ఆచరణలో పెట్టాలి.

పని మొదలు పెట్టడం సులభమే కానీ దాన్ని పూర్తయ్యే వరకూ వదలకుండా చేయడమే కష్టం. భర్తృహరి ఇలా చెప్పాడు.

**ప్రారభ్యతే న ఖలు విఘ్న భయేన నీచైః ప్రారభ్య విఘ్ననిహతా విరమంతి మధ్యాః ।**
**విఘ్నైః ముహుర్ముహు రపి ప్రతిహన్యమానాః ప్రారబ్ధ ముత్తమగుణా న పరిత్యజంతి ॥**

ఆటంకాలు కలుగుతాయనీ, శ్రమపడవలసి వస్తుందనీ భయపడి అధములైనవారు అసలు ఏ పనినీ మొదలు పెట్టరు. పని మొదలు పెట్టిన తర్వాత ఏ చిన్న అడ్డంకి వచ్చినా, పనిని మానుకునేవారు మధ్యములు. ఉత్తములైనవారు ధీరులు, ఎన్ని అడ్డంకులు ఎదురైనా, గొప్ప ధైర్యంతో, ఉత్సాహాన్ని వీడకుండా మొదలు పెట్టిన పనులను పూర్తి చేస్తారే కానీ మధ్యలో ఆపివెయ్యరు. దీనినే నిష్ఠ అనవచ్చు.

దేశం, ప్రత్యేకించి యువతరం, ఏది చెయ్యాలి, ఎలా చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అన్న మీమాంసను ఎదుర్కొంటున్న తరుణం ఇది. ఈ పుస్తకంలో బాపట్ల శ్రీరామకృష్ణ సేవా సమితికి చెందిన శ్రీ అమిరపు నటరాజన్, పనికి సంబంధించిన ఈ విషయాలను లోతుగానూ, విశాలంగానూ చర్చించారు. ఈ అధ్యయనం 'కర్మమార్గాన్ని' తెలుసుకోవాలనే వారందరికీ తప్పక సహాయపడగలదు.



స్వామి అక్షరాత్మానంద
అధ్యక్షులు
రామకృష్ణ మఠం, రాజమండ్రి

20 నవంబరు, 2009.

# విషయసూచిక

1. అమ్మ పెట్టే చీవాట్లు, ఉపాధ్యాయుల మందలింపులు 11
2. కోరి తలకెత్తుకున్న బరువుబాధ్యతలు 12
3. జీవితమంటే కాలక్షేపమా? 13
4. తాళం వేశాను, గొళ్ళెం పెట్టడం మర్చిపోయాను! 14
5. మన జీవితం అలా ఉంటే బాగుండేది! 15
6. కాలిపోయిన కాకి, కొంగ 16
7. అసలు రహస్యం పనిచేసే పద్ధతిలో ఉంది 21
8. పగటి కలలతో ప్రయోజనం లేదు 23
9. నిష్ఠతో పనిచేయడం ఎలా? 25
10. అభ్యాసం కొనసాగకపోవడమే అసలు సమస్య 29
11. మానవ నైజం – మానవ జీవితలక్ష్యం 31
12. పరిపూర్ణతను సాధించేందుకు దగ్గరిదారి కర్తవ్యనిష్ఠ 33
13. కర్తవ్యనిష్ఠతో వ్యక్తిత్వ నిర్మాణాన్ని సాధించడమే సామాజిక జీవనపు ఉద్దేశ్యం 34
14. ఏది నిజమైన కర్తవ్యం? 35
15. 'నేను! నాది!' – మన విజయానికి ప్రథమ శత్రువులు 37

16. స్వార్థంతో ఎందుకు జీవించకూడదు? 38
17. కర్తవ్యనిష్ఠకు నిజమైన ఊతం ప్రేమే! 40
18. పరమానందమే సృష్టి యొక్క పరమగమ్యం 42
19. ప్రతి కర్తవ్యం గౌరవప్రదమైనదే 44
20. పొరుగింటి పుల్లకూర రుచి! 45
21. వ్యక్తిస్థాయిలో కర్తవ్యనిష్ఠను అభ్యాసం చెయ్యడం కోసం
నాలుగు ఆశ్రమాలు 48
22. సామాజిక స్థాయిలో కర్తవ్యనిష్ఠను అభ్యాసం చెయ్యడం కోసం
నాలుగు వర్ణాలు 50
23. ఈ వర్ణాల సమగ్ర సమ్మేళనమే సమసమాజానికి పునాది! 53
24. నాలుగు పురుషార్థాలనే ఆదర్శం 54
25. ఏకత్వానికి భిన్నత్వాన్ని కలిగించడమే సృష్టి ప్రణాళిక 54
26. కర్తవ్య భావన - స్త్రీ పురుష సమానత్వం 57
27. ప్రత్యేకతను సాధించడమే విజయరహస్యం 59
28. మీరొక విశిష్టమైన వ్యక్తి అని నమ్మండి! 61
29. చిన్న పనులలోని గొప్పతనాన్ని తెలుసుకోవాలి 63
30. సమాజం మనల్ని గౌరవించాలంటే ఏమి చెయ్యాలి? 64
31. కర్తవ్యనిష్ఠ వల్ల సమాజంలో శాంతి, సమన్వయాలు 65
32. చేసే పనిపట్ల ఆరాధనాభావం అత్యవసరం 67

33. 'మనం ఈ ప్రపంచానికి ఋణపడి ఉన్నాం!' 68
34. దురభిమానమే దుర్మార్గానికి మూలం! 70
35. భారత సమాజాన్ని చిరకాలంగా నిలబెట్టిన కర్తవ్యభావం 72
36. భారతదేశ చరిత్రలో కర్తవ్యనిష్ఠ – మంచి, చెడు 73
37. సంకల్పశక్తి, సంస్కృతి లేని కర్తవ్యనిష్ఠ వ్యర్థం 75
38. కర్తవ్యనిష్ఠను సఫలీకృతం చేసే విద్య 76
39. పాశ్చాత్య నాగరికత ప్రబలడంవల్ల కలిగిన దుష్ఫలితాలు 79
40. అసలు పోటీతత్త్వం అవసరమా? 80
41. పోటీతత్వం మానవపరిణామానికి అవరోధం 86
42. బలమైన శరీరం లేనిదే కర్తవ్యనిష్ఠ సాధ్యం కాదు 87
43. మానవ పరిణామంలో త్యాగబుద్ధి పాత్ర 92
44. ఇతర జీవజాతులలో కర్తవ్యం అనే భావన ఉన్నదా? 96
45. ఇతర జీవజాతులలో త్యాగబుద్ధి ఉన్నదా? 99
46. జంతువులకూ మనుష్యులకూ తేడా ఏమిటి? 101
47. ఆత్మనిగ్రహమే మనిషి పరిణామానికి కొలబద్ద 103
48. మన పూర్వీకులు మనకు నిర్దేశించిన ఆదర్శం 104
49. కర్తవ్యనిష్ఠతో పరిణతి సాధించిన
కొందరు మహనీయుల జీవితకథలు 108
50. ఉపసంహారం 117

## ముఖచిత్ర వివరణ

కర్తవ్యాన్ని గొప్ప నైపుణ్యంతో, శ్రద్ధతో చేసే పక్షిగా బంగారువన్నె పిచ్చుక పేరొందింది. చాలా సంక్లిష్టమైన నిర్మాణం కల తన గూటిని అది గడ్డిపరకలతో అల్లి, నిర్మిస్తుంది. కేవలం తన ముక్కును మాత్రమే పనిముట్టుగా ఉపయోగించే ఈ గిజిగాడు ఎంత నైపుణ్యంతో తన గూటిని అల్లుతుందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. మరొక విచిత్రం ఏమిటంటే, ఈ పక్షి మొదటి ప్రయత్నంలోనే తన గూటిని సరిగ్గా కట్టలేకపోయినా, అనేకసార్లు ప్రయత్నించి, నేర్చుకుని, చివరకు సాధిస్తుంది. ఆ విధంగా తన కర్తవ్యాన్ని ఎలా పట్టువదలకుండా నిర్వహించాలో మనకు చూపిస్తుంది.

# కర్తవ్యనిష్ఠ

## వ్యక్తిత్వ నిర్మాణానికి అతి చేరువైన మార్గం

### 1. అమ్మ పెట్టే చీవాట్లు, ఉపాధ్యాయుల మందలింపులు

పిల్లలు చెయ్యవలసిన పనుల్ని వారికి గుర్తు చేస్తూ అమ్మ చీవాట్లు పెడుతుంది. పాలు త్రాగమనో, చదవమనో మాటిమాటికీ గుర్తు చేస్తుంది. అది నువ్వు "చెయ్యవలసిన పని" అని నొక్కిచెపుతుంది. 'కనీసం అదైనా చెయ్యకపోతే ఎలా?' అని నిలేస్తుంది. మాటిమాటికీ చెప్పించుకోకూడదనీ, గుర్తు పెట్టుకోమనీ మందలిస్తుంది. కానీ ఆ చిన్న పిల్లవాడికి 'ఎందుకో' ఇదంతా నచ్చదు. అతడికి తెలియనిదేదో అతడి మనస్సు లోతులలో నుంచి ఎదురు తిరగమని చెపుతూ ఉంటుంది. 'ఎందుకు చెయ్యాలి?' అని ప్రశ్నిస్తుంది.

బిడ్డ కొంత ఎదిగాక, ఏదో గొంతెమ్మ కోరిక కోరితే, అమ్మ మందలిస్తూ, 'ముందు శ్రద్ధగా చదువుకో! వాటి సంగతి తర్వాత చూసుకోవచ్చు' అనో లేకపోతే 'నువ్వు చేసే పని సక్రమంగా చేస్తే అవన్నీ వాటంతట అవే వస్తాయి!' అనో చెపుతుంది. పిల్లవాడి 'వేషాలు' ఇంకా ఎక్కువైతే "ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగిరిందట!" అని మందలిస్తుంది. "నువ్వు బాగా చదివితే నాన్న దాన్ని కొని తెస్తాడులే" అంటుంది.

"బాగా చదవండి! ఇదే చదివే వయస్సు. ఇప్పుడు చక్కగా చదివితే జీవితమంతా సుఖపడతారు!" అని చెప్పని ఉపాధ్యాయుడు ఉండడు. "మిగిలిన ఆలోచనలు కట్టిపెట్టి ముందు చదవండి!" అనీ, 'చదవడమే మీ కర్తవ్యం! మీ బాధ్యత!' అనీ, అందరూ చెపుతూనే ఉంటారు.

# 2. కోరి తలకెత్తుకున్న బరువుబాధ్యతలు

మనం చేయవలసిన పనిని గుర్తు చేయించుకోవడం మనకి ఇష్టం ఉండదు. అలా గుర్తు చేయించుకున్నప్పుడు మన మనస్సులో ఏదో తెలియని నొప్పి మొదలవుతుంది. ఆ పనిని చెయ్యడానికి మన మనస్సు ఇష్టపడదు. ఇలా జరిగినప్పుడు మన తల్లిదండ్రులో, గురువులో, స్నేహితులో మనకు ఆ పనిని కొనసాగించవలసిన అవసరాన్ని గుర్తు చేస్తారు. బహుశా వారితో మనం ఆ లక్ష్యాన్ని సాధించడం గురించి ఇంతకు ముందు గొప్పలు చెప్పి ఉండవచ్చు. వాటిని వాళ్ళు మనకు గుర్తుచేసి, హితవు చెపుతారు.

చదువులోనూ, ఉద్యోగంలోనూ, కుటుంబ విషయాలలోనూ – అన్ని విషయాలలోనూ, సాధారణంగా మనకు తటస్థించే పరిస్థితులు మనం కోరి తెచ్చుకున్నవే. 'ఫలానా చదువు నాకు చాలా ఇష్టం' అని ఆ కాలేజీలో చేరతాము. ఫలానా ఉద్యోగం మంచిదని ఎంతో కష్టపడి పోటీ పరీక్షలలో నెగ్గి అందులో చేరతాము. కానీ కొన్నిరోజులు గడిచేసరికి ముందున్న ఆసక్తి సన్నగిల్లిపోతుంది. 'దీనికంటే అది అయితే బాగుండేది!' అని వేరే విషయాల మీదకు మనస్సు మరలుతుంది.

ఇంకొక విషయం చూడండి. జీవితంలో అప్పుడప్పుడు హఠాత్తుగా మనకు కొన్ని పనులు చెయ్యాలనిపిస్తుంది. దానికి ప్రేరణ ఎలాగైనా రావచ్చు. ఇలాంటి ఆలోచన మన మనస్సులలోనే పుట్టనవసరం లేదు. ఎవరో చేస్తుంటే చూసి అలా చెయ్యవచ్చున్న ఆలోచన మనకు కూడా కలుగుతుంది. ముఖ్యంగా సంగీతం, చిత్రలేఖనం మొదలైన కళల విషయంలో ఇలా జరుగుతుంది. ఎంతో పట్టుదలతో వాటిని నేర్చుకొని మన ప్రావీణ్యతను చూపాలని అనుకుంటాము. కొద్దిరోజులలోనే మనకు ఆ కళ అంత సులభంగా పట్టుబడేది కాదని తెలిసి వస్తుంది. దానితో అసలు చెయ్యడమే మానివేస్తాము. అయితే మనకు కావలసింది సాధించడమే కానీ మానివెయ్యడం కాదు కదా!

ఇలా చేపట్టిన ఒకే పనిమీద మనస్సు పెట్టి, దీర్ఘకాలం వదలకుండా చెయ్యడాన్నే నిష్ఠ అంటారు.

## 3. జీవితమంటే కాలక్షేపమా?

ఇద్దరు మిత్రులు తమ ఊరి పక్కనే ఉన్న కొండను ఎక్కడానికి బయలుదేరారు. మరి అంత గొప్ప పని చెయ్యబోతున్నారు కదా అని పత్రికలలో ప్రకటన కూడా ఇవ్వడానికి సిద్ధమయ్యారు. విలేఖరి, 'మీరు ఈ కొండను ఎందుకు ఎక్కాలనుకుంటున్నారు?' అని వారిని ప్రశ్నించాడు. దానికి ఆ మిత్రద్వయంలోని మొదటివాడు దర్పంగా, "ఎందుకేమిటి? అక్కడ కొండ ఉంది కాబట్టి!" అని గొప్పగా సమాధానం చెప్పాడు. అయితే రెండవవాడు, "మాకు వేరే పని కూడా లేదులేండి!" అని చల్లగా గుట్టువిప్పాడు.

'రోజంతా నిద్రపోవడం సాధ్యం కాదు కదా! అందుకని ఏదోవొకటి చెయ్యాలి!' మనుష్యులు పనిచెయ్యడానికి ఇది కూడా ఒక కారణం. ఎంత కష్టపడి కూర్చుని కాలక్షేపం చేసినా చివరకు ఏదోవొక పని చెయ్యడం మొదలుపెట్టవలసిందే. ఎల్లకాలం కూర్చోవడమో, నిద్రపోవడమో సాధ్యం కాదు. ఇక కొంతమంది నిష్ప్రయోజకమైన పనులు చేస్తూ ఉంటారు. ఉదాహరణకు, 'ఈ పిల్లిని చూడండి! దీనికి అన్నీ నేనే చేసిపెట్టాలి! నేను లేకుండా ఇది ఒక్క క్షణం కూడా బ్రతకలేదు!' అంటారు.

మనం జీవించడం లేదు. జీవితకాలాన్ని ఎలాగో గడుపుతున్నాం. అనుక్షణం, 'ఈ క్షణం ఎలాగో గడిస్తే అంతే చాలు!' అని అనుకుంటూ ఉంటాం. 'రాత్రి ఎప్పుడు అవుతుందా, ఎప్పుడు నిద్రపోదామా?' అని ఆలోచిస్తాం. విద్యార్థి తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పే పాఠాన్ని మనస్సు పెట్టి వినకుండా, 'ఎప్పుడు ఈ గంట గడుస్తుంది? ఎప్పుడు బయటకు పోతాం!' అని ఆలోచిస్తూ ఉంటాడు. ధ్యానానికి

కూర్చుంటే మనం అనుకున్న పావుగంట సమయం ఎప్పుడు అయిపోతుందా అని ఎదురు చూస్తాం. ఇదే విధంగా ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు, అందరూ కూడా, ఏకంగా తమ జీవితాలనే ఇలా గడుపుతూ ఉంటారు.

రాత్రింబవళ్ళూ ఏదోవొకటి జరగబోతుందని వేచి చూడడంతోనే సగటు మానవులందరికీ జీవితం గడిచిపోతుంది. జీవితంలో సాధారణంగా మనం చెయ్యవలసిన పనులకు కొంత సమయం పడుతుంది. అయితే, మన ప్రయత్నమంతా ఆ సమయం ఎప్పుడు గడచిపోతుందోనని వేచిచూడడంలోనే తప్ప నిజంగా ఆ పనిని చక్కగా చేస్తున్నామా అని శ్రద్ధపెట్టడం మీద ఉండదు. చివరికి ఏదోవొక విధంగా సమయం గడిచిపోతుంది, ఆ పని ఎలాగో ఒక విధంగా జరిగిపోతుంది. ఇలా యాంత్రికంగా జీవించడం ప్రయోజనకరమేనా?

## 4. తాళం వేశాను, గొళ్ళెం పెట్టడం మర్చిపోయాను!

పని చేస్తూనే ఉంటాము కానీ మన మనస్సును పని మీద లగ్నం చెయ్యక, అన్యమనస్కంగా పనిచేస్తూ ఉంటాము. బయటకు చేస్తున్నట్టు కనపడినా లోపల ఆ పనిని ఎంత బాగా చేస్తున్నామోనని కనిపెట్టి చూసుకునే 'ఆత్మపరిశీలన' ఉండదు. చేతులు పని చేస్తున్నా మనస్సు పని మీద ఉండదు. అందువలన చేసే పని సక్రమంగా జరగదు. ఇల్లు ఊడ్చడం, అంట్లుతోమడం, బూజు దులపడం, పూలదండ కట్టడం, ఇంటికి తాళం వెయ్యడం మొదలైన పనులను చూడండి. వీటి కంటే ఇంకొంచెం కష్టమైన – వ్రాయడం, చదవడం, కంప్యూటర్‌లో భాగాలు కలపడం, మోటారు సైకిలు మీద ప్రయాణం చెయ్యడం, ఇంట్లోకి అవసరమైన సామాన్లు కొనితేవడం వంటి పనుల్ని చూడండి. ఇవన్నీ చిన్నచిన్న పనులే. ఇటువంటి పనులలో మనం ఎంత 'చక్కగా' మనస్సుపెట్టి పనిచేస్తామో మనకే తెలుసు. చిన్నచిన్న విషయాలలో చూపే ఈ అశ్రద్ధ

పెద్ద విషయాలలో కూడా ప్రతిఫలిస్తుంది. ఇక ఒక ఓడను నడిపేవాడు, ఒక విమానాన్ని, రైలును నడిపేవాడు మనస్సు ఎక్కడో పెట్టి పనిచేస్తే దాని ఫలితాలు ఎంత వినాశకరంగా ఉంటాయో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

మాటిమాటికీ మన మనస్సు పని మీదనుంచి తొలిగిపోతూ ఉంటుంది. మాటిమాటికీ తప్పులు దొర్లుతూ ఉంటాయి. వీటివల్ల బోలెడంత సమయం వృథా అవుతూ ఉంటుంది. ఇలా పనిచేయడం వల్ల తోటి మనుష్యులు మనకు గౌరవాన్ని ఇవ్వరు. ఎందుకంటే మనకు అప్పగించిన పని సరిగా జరగదని వారికి క్రమంగా నమ్మకం ఏర్పడుతుంది. సమాజంలో మనుష్యులు అభివృద్ధి సాధించలేకపోవడానికి ఇదే ముఖ్యమైన కారణం. దీనివల్ల వ్యక్తిగతంగా సమాజంలో గౌరవం లభించడం అటుంచి, కనీసం మనశ్శాంతి కూడా లభించదు. మనలో మనకే అసంతృప్తి కలుగుతుంది. మరి ఇలాంటి తప్పును చేయకుండా ఉండడం ఎలా?

## 5. మన జీవితం అలా ఉంటే బాగుండేది!

*వివేకానంద స్వామి (స్వామీజీ), "దేనిమీదైనా మీరు ఆధిపత్యం సంపాదించి, దాన్ని మీ స్వాధీనంలో ఉంచుకుంటే, అది మీకు ఔన్నత్యాన్ని కలిగిస్తుంది. దేనికైనా మీరు లొంగిపోతే, అది మిమ్మల్ని మరింత దిగజారుస్తుంది" అని చెప్పారు.* వ్యవహారాలు, శరీరం, మనస్సు, మొదలైన అశాశ్వతమైన వస్తువులు, విషయాలు – అన్నీ మన వశంలో ఉండాలి. అప్పుడే మనం చెయ్యాలనుకున్నది సాధించగలుగుతాము. కానీ వాటిని మన చెప్పుచేతలలో పెట్టుకోవడానికి బదులు, మనమే వాటికి లొంగిపోతే, క్రమక్రమంగా అవి మనల్ని దిగజారుస్తాయి.

నిజానికి జీవితంలో గొప్పతనాన్ని సాధించాలని మనందరం అనుకుంటాం. కొన్ని సార్లు అలా సాధించలేకపోతున్నందుకు మన హృదయాలను పిండివేస్తున్న బాధ

కలుగుతుంది కూడా. చాలాసార్లు మన జీవితాలు ఎందుకు విఫలమవుతున్నాయో మనకు అర్థం కాదు. మనం జీవితంలో మాటిమాటికీ దొర్లే తప్పులు చేయకుండా ఉండడానికి, శ్రద్ధను అలవరచుకోవడానికి ఏదైనా పద్ధతి ఉంటే ఎంత బాగుండును అని అనిపిస్తుంది. దానిని ఎవరైనా బోధిస్తే నేర్చుకోవడానికి మనం ఎంతైనా ఇష్టపడతాము!

*విజయానికి మార్గాన్ని, "పవిత్రత, ఓరిమి, పట్టుదల విజయానికి ఆయువుపట్టులు. వీటన్నింటికీ మించి ప్రేమ!" అని నాలుగు మాటల్లో స్వామీజీ మనకు తెలియజెప్పారు.* ఆ నాలుగు సుగుణాలను ఎలా అలవరచుకోవాలో కూడా స్వామీజీ ఎంతో చక్కగా వివరించారు. మన స్వభావంలో, పుట్టుకతో వచ్చే లక్షణాలు ఏయేవి మనకు అడ్డంకులుగా నిలుస్తాయో, అంతేకాక తప్పులు చేయకుండా ఉండాలంటే ఏమి చెయ్యాలో మనకు బోధించారు. ఎలా పనిచేస్తే గొప్పతనాన్ని సాధించవచ్చో సూచించారు. ఈ సమస్యల్ని పరిష్కరించడానికి మన ప్రాచీన సంస్కృతిలో ఎటువంటి అద్భుతమైన పరిష్కారాలు బోధించబడ్డాయో వివరించారు. వ్యక్తిగతస్థాయిలోనే కాక కుటుంబ, సామాజిక, నాగరిక స్థాయులలో ఎలా పనిచేస్తే వ్యక్తి, కుటుంబం, సమాజం, నాగరికత అభివృద్ధి సాధిస్తాయో చక్కగా బోధించారు. దీనికి కావలసినది **కర్తవ్యనిష్ఠ** అని చెప్పారు. దీన్ని అర్థం చేసుకోవడానికి స్వామీజీ ఒక కథను మనకి చెప్పారు.

## 6. కాలిపోయిన కాకి, కొంగ

ఈ కథ మహాభారతంలో చెప్పబడింది. పూర్వం కౌశికుడు అనే ఒక యువ సన్న్యాసి అడవికి వెళ్ళాడు. అక్కడ ధ్యానం చేస్తూ యోగసాధనలో మునిగిపోయి చాలా సంవత్సరాలపాటు కఠోరమైన సాధన చేశాడు. ఒక రోజు ఆ అడవిలో ఒక చెట్టు క్రింద కూర్చొని ఉండగా కొన్ని ఎండుటాకులు అతని తలమీద పడ్డాయి. పైకి చూస్తే ఒక కాకి, కొంగ ఆ చెట్టు కొమ్మల మీద పోరాడుతూ కనిపించాయి. వాటివలననే ఆ

ఎండుటాకులు అతని తలమీద పడ్డాయి. అతనికి చాలా కోపం వచ్చింది. నిప్పులు క్రక్కే కళ్ళతో వాటిని చూస్తూ, "మీ కెంత ధైర్యం? నా మీదే ఆకులు పడవేస్తారా?" అన్నాడు. అంతే! అతని కళ్ళలో నుంచి గొప్ప శక్తి బయటికి వెలువడి ఆ పక్షులు రెండూ అక్కడికక్కడే కాలి బూడిదై నేలరాలాయి. ఆ సన్న్యాసి సాధించిన యోగశక్తి అంత గొప్పది. అతడికి చాలా సంతోషం కలిగింది. ఒక్క చూపుతోనే ఆ పక్షుల్ని కాల్చివేయ గలిగాను కదా అనుకున్నాడు. తన యోగసాధన ద్వారా అటువంటి శక్తిని పెంపొందించుకోగలిగినందుకు చాలా ఆనందపడ్డాడు.

తర్వాత కౌశికుడు భిక్ష కోసం ప్రక్కనున్న గ్రామంలోకి వెళ్ళాడు. ఒక ఇంటి ముందు నిలబడి, "అమ్మా! అన్నం పెట్టమ్మా!" అని కేకపెట్టాడు. ఇంటిలో నుంచి, "వస్తున్నాను! కాసేపు ఆగు నాయనా!" అని ఒక స్త్రీ బదులు పలికింది. అది విని, "ఓసీ! దుర్మార్గురాలా! నన్నే ఆగమంటావా? నీకెంత ధైర్యం! నా శక్తి ఇంకా నీకు తెలియదు!" అని అతడు తన మనస్సులో అనుకున్నాడు.

అయితే అతడు తన మనస్సులో అలా అనుకున్నాడో లేదో ఇంటిలో నుండి ఆ స్త్రీ మళ్ళీ మాట్లాడింది. "చూడు నాయనా! నీ గురించి నువ్వు ఎక్కువగా ఊహించుకోకు! ఇక్కడ కాకీ లేదు, కొంగా లేదు!" అని పలికింది. అతడి శక్తిని చూసి భయపడిపోయే వారెవరూ అక్కడ లేరని ఆ స్త్రీ ఉద్దేశ్యం. ఆమె కంఠస్వరంలో ఏ భయమూ, బెరుకూ ధ్వనించలేదు. ఆ మాటలు పలుకుతున్నప్పుడు ఆమె మనస్సు ప్రశాంతంగా ఉందని వినేవారికి చక్కగా తెలుస్తోంది. ఆ మాటలు విని ఆ సన్న్యాసి నిర్ఘాంతపోయాడు. "తానెక్కడో అడవిలో చేసిన పని ఈ ఇంటిలో వున్న సామాన్య గృహిణికి ఎలా తెలిసింది?" అని ఆశ్చర్యపోయాడు. ఆమెకు తన విషయం ఎలా తెలిసిందో తెలుసుకోవాలన్న బలమైన కోరిక కలిగింది. కానీ అందుకోసం ఆమె బయటకు వచ్చేవరకూ అక్కడే నిలబడడం కంటే అతడికి గత్యంతరం లేకపోయింది.

కొంతసేపటి తర్వాత ఆ స్త్రీ అతడికి భిక్ష వెయ్యడానికి బయటకు వచ్చింది. అతడి మనస్సులో మాటల్ని తెలుసుకోగలిగినా, ఆమె కోపగించలేదని ఆమె ప్రసన్నమైన ముఖం స్పష్టంగా చెపుతోంది. ఆ సన్న్యాసి ఆమె పాదాల మీద పడి నమస్కారం చేశాడు. "అమ్మా! అడవిలో ఎక్కడో నేను చేసిన పని మీకు ఎలా తెలిసింది?" అని అడిగాడు.

ఆమె, "నాయనా! నీవు చేసే యోగసాధనల లాంటివేవీ నాకు తెలియవు. నేను ఒక సాధారణమైన గృహిణిని. నా ఇంట్లో పనులు చేసుకుంటూ ఉంటాను. నా భర్త ఆరోగ్యం సరిగా లేదు. ఆయనకు సేవ చెయ్యవలసిన అవసరం ఉంది. అందుచేతనే నిన్ను ఇంతసేపు వేచి ఉండేలా చెయ్యవలసి వచ్చింది. నా జీవితమంతా నేను నా కర్తవ్యాన్ని శ్రద్ధగా నిర్వర్తించాను. నేను చెయ్యవలసిన పనిని పూర్తిగా మనస్సు పెట్టి, శ్రద్ధగా, ఏ లోటు లేకుండా చేస్తూ, చేస్తున్న పనినే ఆరాధనగా భావిస్తూ వచ్చాను. నాకు వివాహం కాకముందు నా తల్లిదండ్రులకు సేవచేస్తూ వారిపట్ల నా కర్తవ్యాన్ని నిర్వర్తించాను. ఇప్పుడు నాకు వివాహమైంది కదా! కాబట్టి గృహిణిగా మెట్టినింట నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను. నేను చేసే యోగసాధన అంతా ఇదే. నా కర్తవ్యాన్ని నిర్వర్తించడం ద్వారానే జ్ఞానోదయాన్ని పొందాను. ఆ శక్తితోనే నీ మనస్సులోని ఆలోచనలను చదువగలిగాను. ఆ శక్తితోనే అడవిలో నువ్వేమి చేశావో తెలుసుకోగలిగాను," అని చెప్పింది.

ఆ గృహిణి ఇంకా మాట్లాడుతూ, "ఇలా జీవించడం ద్వారా ఇటువంటి శక్తిని సంపాదించడాన్ని గురించి ఇంతకంటే ఎక్కువ తెలుసుకోదలచుకుంటే మిథిలానగరంలో, సంతలో ఒక 'వ్యాధుడు' (బోయవాడు, కసాయివాడు, మాంసం విక్రయించేవాడు) ఉంటాడు. నీవు ఆయన దగ్గరకు వెళ్ళు. ఈ విషయంలో ఆయన దగ్గర నువ్వు నేర్చుకోగలిగినది చాలా ఉంది. ఆయన చెప్పే బోధలు వింటే చాలా సంతోషపడతావు," అని చెప్పింది.

ఆ సన్న్యాసి ఆ గృహిణి మాటలు విని ఆమె వద్ద సెలవు తీసుకున్నాడు. అతడి మనస్సు ఆశ్చర్యంతో నిండిపోయింది. అయినా మనస్సులో పొగరు చావక, "ఆ మాంసం అమ్ముకునే వాడెవడో! వాడి దగ్గరకు నేను వెళ్ళేదేమిటి? పైగా అంత దూరంలో ఉన్న మిథిలానగరానికి వెళ్ళాలి కదా!" అనుకున్నాడు.

కానీ ఆ గృహిణి దగ్గర అయిన పరాభవం మళ్ళీమళ్ళీ గుర్తుకురావడంతో అతడికి కళ్ళు తెరుచుకున్నాయి. తాను చులకనగా చూసే పనులు చేస్తున్నవారు తన కంటే గొప్ప శక్తియుక్తులు కలిగివుండడం చూసి అతడికి బుద్ధి వచ్చింది. ఆ కసాయివాడిని కూడా చూడవలసిందేనన్న నిశ్చయానికి వచ్చి ఆ నగరానికి ప్రయాణం కట్టాడు.

మిథిలానగరానికి చేరి, ఆ సంతలోకి వెళ్ళాడు. దూరం నుంచే కొద్దిగా లావుగా, కొవ్వుపట్టి ఉన్న కసాయివాడు కనిపించాడు. అతడు పెద్ద కత్తితో మాంసం నరుకుతూ, రకరకాలవారితో బేరసారాలు సాగిస్తూ కనిపించాడు. ఈ యువసన్న్యాసి, "ఓరి భగవంతుడా! ఈ మనిషి దగ్గర నేను పాఠాలు నేర్చుకోవాలా!" చూడడానికే ఒక పెద్ద భూతంలా ఉన్నాడే!" అనుకున్నాడు. ఇంతలో ఆ కసాయివాడు కౌశికుడి వైపు చూసి, "రండి స్వామీ, రండి! ఆ గృహిణి మిమ్మల్ని పంపించింది కదా! రండి! ఇక్కడ కూర్చోండి! నా పని పూర్తయ్యే వరకూ కూర్చోండి!" అని మర్యాదగా చెప్పాడు. ఇది విని ఆ సన్న్యాసి మరొకసారి నిర్ఘాంతపోయాడు. ఇతడికి కూడా తన సంగతి ముందే తెలిసిపోయిందే అని అనుకున్నాడు. ఏమి చేయాలో తెలియక సంభ్రమాశ్చర్యాలతో అతడు చెప్పిన చోట కూర్చున్నాడు.

ఆ కసాయివాడు తన వ్యాపారాన్ని కొనసాగించాడు. చివరకు డబ్బు లెక్కవేసుకుని ఆ సన్న్యాసితో, "అయ్యా! దయచేసి నాతో మా ఇంటికి రండి!" అని తనతో తీసుకువెళ్ళాడు.

ఒక పీట వేసి ఆ సన్న్యాసిని కూర్చోపెట్టాడు. “దయచేసి కొంచెం సేపు వేచి ఉండండి!” అని చెప్పి ఇంటిలోకి వెళ్ళాడు. వృద్ధులైన తన తల్లిదండ్రులకు స్నానం చేయించి, అన్నం తినిపించి, వారు సుఖంగా ఉండేందుకు తాను చేయగలిగినదంతా చేసి, ఆ తర్వాత సన్న్యాసి దగ్గరకు వచ్చాడు. ఆ సన్న్యాసితో, “అయ్యా! ఎంతో దూరం నుంచి తమరు వచ్చారు. మీకు నేను ఏమి సహాయం చెయ్యగలనో చెప్పండి?” అన్నాడు. ఆ సన్న్యాసి ఆత్మను గురించి, భగవంతుణ్ణి గురించి కొన్ని ప్రశ్నలు వేశాడు. వాటికి ఆ కసాయివాడైన ధర్మవ్యాధుడు చక్కటి సమాధానాలు ఇచ్చాడు. అలా ధర్మవ్యాధుడు చెప్పిన విషయాలు మహాభారతంలో ‘వ్యాధగీత’ అనే పేరుతో పొందుపరచబడ్డాయి. దానిలో అతడు అత్యున్నత వేదాంతసత్యాలను అద్భుతంగా వివరించాడు. అతడి బోధనలను విన్న ఆ సన్న్యాసి ఎంతో ఆశ్చర్యపోయాడు.

ఇప్పుడు ఆ సన్న్యాసికి ఒక సందేహం కలిగింది. ‘ఇంత గొప్ప జ్ఞాని ఇటువంటి హీనమైన వృత్తిచేస్తూ ఎందుకు ఉన్నాడు?’ అనుకున్నాడు. ఆయనను, “అయ్యా! మీరు ఇంత గొప్ప జ్ఞాని. మరి ఈ మాంసం అమ్మే వృత్తిలో ఎందుకు ఉన్నారు? ఇటువంటి అసహ్యకరమైన పని ఎందుకు చేస్తున్నారు?” అని అడిగాడు.

ఆ కసాయివాడు, “నాయనా! ఏ పనీ అసహ్యకరమైనది కాదు, ఏ పనీ అపవిత్రమైనది కాదు! నేను నా పుట్టుక చేత ఇటువంటి పరిస్థితులలోకీ, వాతావరణంలోకీ వచ్చాను. నా చిన్నతనంలోనే ఈ వ్యాపారాన్ని నేర్చుకున్నాను. దానిపట్ల నాకు ద్వేషం, అసహ్యం లేవు. అంతేకాక, నాకు దాని మీద ఎటువంటి మమకారం కూడా లేదు. దాన్ని నా కర్తవ్యంగా భావించి, శ్రద్ధగా చేయడానికి ప్రయత్నిస్తాను. ఒక గృహస్థుగా నా కర్తవ్యాన్ని శ్రద్ధతో నిర్వర్తిస్తాను. నా శాయశక్తులా కృషిచేసి నా తల్లిదండ్రులను సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తాను. మీరు ఆచరించే యోగసాధనలేవీ నాకు తెలియవు. జపధ్యానాలు తెలియవు. అలాంటి వాటిని సాధన

చెయ్యడం కోసం అడవులలోకి పోదలచుకోలేదు కూడా. అయితే మరి మీరు నాలో చూసిన జ్ఞానం, వేదవేదాంతాలను వివరించి చెప్పగలిగే శక్తి, ఎక్కడ నుంచి వచ్చాయి? నేను ఉన్న పరిస్థితులలో, అహంకారం, మమకారం లేకుండా, ఒళ్ళు దాచుకోకుండా పనిచేస్తూ, నేను చెయ్యవలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించడం ద్వారా అటువంటి అమోఘమైన శక్తి నాకు కలిగింది" అని సమాధానమిచ్చాడు.

పై కథలో నేర్చుకునేది ఏమిటంటే మనం ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మన కర్తవ్యాన్ని (మనం "చెయ్యవలసిన పనిని") చక్కగా చెయ్యడం ద్వారా అమోఘమైన గొప్పతనాన్ని సాధించవచ్చు అన్న విషయం. స్వామీజీ, "*మనకు అత్యంత సమీపంలో ఉన్న కర్తవ్యాన్ని చక్కగా చేయడం ద్వారా మనల్ని మనమే శక్తిమంతులుగా చేసుకుంటాము. ఇలా మెట్టుమెట్టుగా మన శక్తిని పెంపొందించుకోవడం ద్వారా మనం ఎంత ఎత్తుకు ఎదగవచ్చునంటే, జీవితంలోనూ, సమాజంలోనూ అత్యున్నతమైనవి అనుకునే కర్తవ్యాలు కూడా మనకు అప్పగించబడే స్థితికి చేరుకుంటాము*" అని వివరిస్తూ కర్తవ్యనిష్ఠనే వ్యక్తిత్వ నిర్మాణానికి దగ్గరిదారిగా అభివర్ణించారు.

మన విద్యాభ్యాసంలోనూ, వృత్తి వ్యాపారాలలోనూ, దేనిలో అభివృద్ధిని సాధించాలన్నా కూడా ఇదొక్కటే మార్గం. అయితే కథలో చూసినట్టు గొప్పతనం అంటే అవతలి మనిషి గురించి, అతడి మనస్సులోని విషయాల గురించి, ముందుగా తెలుసుకోగలగడమే కానక్కరలేదు. మన దైనందిన జీవితంలో చేసే పనులలో పరిపూర్ణతను, విజయాన్ని సాధించగలగడమే మనకు కావలసినది.

## 7. అసలు రహస్యం పనిచేసే పద్ధతిలో ఉంది

పై కథలో ఆ గృహిణి చాలా ఆనందంగా, సంతృప్తిగా, నిర్భయంగా ఉన్నట్టు మనం గమనించవచ్చు. ధర్మవ్యాధుడు తన పనిని సంతోషంగా చేస్తున్నట్టు గమనించవచ్చు.

వారి మాటలలోని ధైర్యం, నిర్భయత్వం వారి మనస్సులలో ఆనందం నిండి ఉందని చెప్పకనే చెపుతున్నాయి. వారికి కలిగిన గొప్ప శక్తుల సంగతి పక్కన పెడితే కనీసం వారు పొందుతున్న ఆనందం, నిర్భయత్వం మనకు కలిగినా చాలు గదా అని మనకు అనిపిస్తుంది.

ఆ కథలో చూసినవారు ఎంత పని చేస్తున్నారో మనం కూడా అంత పని చెయ్యడం లేదా? న్యాయంగా ఆలోచిస్తే మనలో అధికభాగం, వాళ్ళు ఎంత పని చేస్తున్నారో అంత పనినీ పొద్దున్న నుంచీ రాత్రిదాకా చేస్తూనే ఉంటాము! క్షణం తీరిక లేకుండా ఉన్నామని తోటి వారందరికీ చెపుతాము. బాధ్యత అంతా నా మీదే ఉందనీ, అంతా నేనొక్కడినే చేస్తాననీ చెపుతాము. ఉద్యోగస్థులు తమ ఉద్యోగం గురించి మాట్లాడుతూ ఇదే చెపుతారు. గృహిణులు తమ ఇంట్లో పరిస్థితులను గురించి ఇదే విధంగా వివరిస్తారు. అయితే ఇలా మాట్లాడేవారెవరూ తమ రోజువారీ జీవితంలో ఎంతోకొంతైనా విజయవంతంగా జీవిస్తున్నట్టు, సంతోషంగా గడుపుతున్నట్టు కనిపించరు. వారి జీవితాలలో ఏదో వెలితి, బాధ ఉందని మనకు స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. మన జీవితాలలో మన అనుభవం కూడా మనకు అదే చెపుతూ ఉంటుంది. ఇలాంటి జీవితం ద్వారా మనం గొప్పతనాన్ని సాధించడం దేవుడెరుగు, కనీసం సంతోషంగా, సంతృప్తిగా కూడా జీవించలేకుండా ఉన్నాం. కాబట్టి పని ఎంత చేస్తున్నామన్నది ముఖ్యమైన విషయం కాదు.

“ఏ పని చేస్తున్నాము?” “ఎంత పని చేస్తున్నాము?” అన్న ప్రశ్నలు రెండూ ముఖ్యమైనవి కానప్పుడు మిగిలినదేమిటి? మనం “ఎలా” పనిచేస్తున్నామన్నదే. “జీవితమంతా నేను నా కర్తవ్యాన్ని శ్రద్ధగా నిర్వర్తించాను” అని ఆ గృహిణి చెప్పింది కదా!

# 8. పగటి కలలతో ప్రయోజనం లేదు

వివేకానంద స్వామి ధర్మవ్యాధుడి కథను వివరించిన తర్వాత, *"పని చెయ్యడంలోని రహస్యం ఏమిటంటే, కోరుకున్న లక్ష్యాన్నీ, దాన్ని చేరుకొనేందుకు మనం ఉపయోగించే విధానాన్నీ ఒకటిగా చెయ్యడమే!"* అని చెప్పారు. అంటే కోరుకున్న లక్ష్యాన్నీ, దాన్ని పొందేందుకు కావలసిన విధివిధానాలనూ వేర్వేరుగా చూడకూడదు. లక్ష్యానికి ఎంత ప్రాముఖ్యతను ఇస్తామో అంతే ప్రాముఖ్యతని ఆ లక్ష్యాన్ని సాధించే పద్ధతులకు కూడా ఇవ్వాలి. ఒక విద్యార్థి తనకు ఎన్ని మార్కులు వస్తాయో ఆలోచించడం మాని తాను చదవవలసింది ఎంత బాగా చదివాడో చూసుకోవాలి. ఒక న్యాయవాది ముందే వ్యాజ్యాన్ని గెలిచినట్లు కలలు కనకుండా, ఆ వ్యాజ్యం గురించి అధ్యయనం చేయడం మీద మనసు పెట్టాలి. ఇదే అన్ని రంగాలకూ వర్తిస్తుంది. *''ఒకసారి మీరు కోరుకున్న లక్ష్యాన్ని నిర్ణయించుకున్న తర్వాత దాన్ని గురించి మర్చిపోవచ్చు. దాన్ని సాధించవలసిన పద్ధతుల మీదే మీ మనస్సును కేంద్రీకరించండి"* అని కూడా స్వామీజీ చెప్పారు.

అనుసరించవలసిన పద్ధతులకు సానపెట్టకుండా ఫలితాల గురించి పగటికలలు కంటే, కలిగే పరిణామాలు ఎలా ఉంటాయో తెలిపే ఒక కథ ఉంది. పూర్వం ఒక ఊరిలో ఒక పేద బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు మహా బద్ధకస్తుడు. అతడి వద్ద ఒక చెంబు తప్ప వేరే ఆస్తి ఏమీ లేదు. అతడు ఒకరోజు ఎన్నో అవస్థలుపడి ఆ చెంబు నిండా పేలాల పిండిని సంపాదించాడు. ఆ చెంబును తన ప్రక్కనే ఉంచుకుని ఒక చెట్టుకింద నిద్రపోయాడు. ఆ నిద్రలో భయంకరమైన కరవు వచ్చినట్లు కలగన్నాడు. ఆ కరవు సమయంలో ఆ పేలాల పిండిని అమ్మి చాలా ధనం సంపాదించినట్లు, ఆ ధనంతో ఒక ఆవును కొని, మేపి, దానితో చాలా పెద్ద ఆవులమందను తయారుచేసినట్లు, ఆ ఆవులను అమ్మి గుర్రాలను కొన్నట్లు, అలా అలా ఒక మేడ కట్టినట్లు, ఒక చక్కని అమ్మాయిని

వివాహం చేసుకున్నట్లు, ఒక కొడుకు పుట్టినట్లు, ఆ పిల్లవాడికి సోమలింగం అనే పేరు పెట్టినట్లు, హాయిగా కాలం గడుపుతున్నట్లు కలగన్నాడు. ఒకరోజు ఆ పిల్లవాడు అల్లరి చేస్తుంటే వాణ్ణి సముదాయించమని భార్యను ఆజ్ఞాపించాడు. ఆమె పట్టించుకోలేదు. అతడికి భార్య మీద చాలా కోపం వచ్చి, ఆమెను తన్నాలని గట్టిగా కాలు జాడించాడు. ఆ కాలు తగిలి చెంబులో పేలాల పిండి మొత్తం నేలపాలయిపోయింది! కల చెదిరి ఆ బ్రాహ్మణుడు ఏడుస్తూ కూర్చున్నాడు!! నిజానికి అక్కడ భార్య లేదు, కొడుకు సోమలింగం కూడా లేడు! అన్నీ పగటి కలలే. ఈ పంచతంత్రకథలోని నీతి ఏమిటంటే, **“పూనుకుని పనిచేసేవాడు గొప్పవాడవుతాడు గానీ పగటికలలు కనేవాడు కాదు!”**

‘ఎందుకురా పిల్లాడా ఏడుస్తున్నావు అని అడిగితే, ఎల్లుండి పొద్దున్న మా అమ్మ కొడుతుంది అన్నాడట!’ ఏదో ఉపద్రవం రాబోతోందని ఏమీ చెయ్యకుండా కూర్చోవడం, అసలు ఆలోచించకుండా పనిచెయ్యడం, లేకపోతే పై కథలో లాగా కొంచెం పనైనా చెయ్యకుండానే ఫలితాన్ని ముందే ఊహిస్తూ మరీ ఎక్కువగా ఆలోచించడం, పగటి కలలతో కాలాన్ని గడుపుతూ ఏమీ చెయ్యలేకపోతున్నామని వాపోవడం, మనం చేసే తప్పులు.

**నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హి అకర్మణః ।**
**శరీర యాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేత్ అకర్మణః ॥ (భగవద్గీత 3.8)**

భగవద్గీతలో, “ఎల్లకాలం చేయవలసిన పనిని చేస్తూ ఉండాలి. పని చెయ్యకుండా కూర్చోవడం కంటే పని చెయ్యడమే మేలు. పని చెయ్యకుండా కూర్చునేవాడికి దైనందిన జీవితం కూడా జరగదు” అని చెప్పబడింది. స్వామీజీ, “*సోమరితనాన్ని అన్ని విధాలుగానూ వదిలించుకోవాలి. పని అంటే అవరోధాలను అధిగమించడమే! మనస్సులోనూ, శారీరికంగానూ అవరోధాలుగా తలెత్తుతున్న చెడునంతా నిరోధించాలి. అలా చేయడంలో మనం విజయం సాధించినపుడే శాంతి లభిస్తుంది*” అని కూడా చెప్పారు.

మన దృష్టి అంతా చేసిన పనివల్ల రాబోయే ఫలితాల మీదే ఉంటుందన్న విషయాన్ని గురించి తమ కర్మయోగ ఉపన్యాసాలలో వివేకానంద స్వామి వివరించారు. *"మనం ఏదైనా పనిని మొదలు పెట్టినప్పుడు మన దృష్టి అంతా ఫలితాల మీదనే ఉంటుంది. ఆ ఫలితాన్ని పొందిన తర్వాత మన స్థితిని మన మనస్సు గోరంతని కొండంతగా ఊహించి దానిని మన మనస్సులోని ఊహల తెరమీద అద్భుతమైన రంగుల దృశ్యంగా చూపుతుంది. ఆ దృశ్యం మనోహరంగా ఉంటుంది. ఆ రంగుల కలలో మనం తేలియాడతాము. దాన్ని పొందాలని అనుకుంటాము. ఆ లక్ష్యాన్ని పొందాలని మనకు ప్రేరణ కలిగించిన వారు దాన్ని చాలా సులభంగా సాధించినట్టు మనకు తోస్తుంది. ఎక్కువ కష్టించకుండానే వారు దాన్ని పొందివుంటారని మనం ఊహించుకుంటాము. మన ధ్యాస అంతా ఆ లక్ష్యాన్ని సాధించిన తర్వాత మన జీవితంలో కలిగే అద్భుతమైన మార్పుల్ని ఊహించుకోవడంలో నిమగ్నమయిపోతుంది"* అని చెప్పారు. కాబట్టి, భవిష్యత్తును గురించి ఊహించుకోవడం మాని, శ్రద్ధగా పనిచేయడం మొదలుపెట్టాలి. మరొకవైపు, భవిష్యత్తును గురించి భయపడే వారికి స్వామీజీ సలహా ఇస్తూ, *"భవిష్యత్తు గురించి తర్జనభర్జన పడేవాడు ఏమీ సాధించలేడు. నీవు దేనినైతే సత్యమని, మంచిదని అర్థం చేసుకున్నావో దానిని తక్షణమే అమలు చెయ్యి!"* అని చెప్పారు.

## 9. నిష్ఠతో పనిచేయడం ఎలా?

జీవితంలో ప్రారంభదశలలో ఉన్నవారు అనుసరించవలసిన మార్గమేమిటో స్వామీజీ బోధించారు. *"మీ నైజాన్ని అర్థం చేసుకుని, ఆ నైజానికి సరిపోయే కర్తవ్యాన్ని ఎంచుకుని, దానికే అంటిపెట్టుకుని పనిచేయండి. తొలిదశలలో ఉన్నవారికి నిష్ఠ ఒక్కటే మార్గం. చేసే పనిమీద ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే అన్నింటినీ సాధించవచ్చు"* అని బోధించారు. *"నిష్ఠ లేనిదే పురోభివృద్ధి సాధ్యం కాదు"* అని స్పష్టం చేశారు.

**అనగననగరాగ మతిశయిల్లుచునుండు**
**తినగతినగ వేము తియ్యనుండు**
**సాధనమున పనులు సమకూరు ధరలోన,**
**విశ్వదాభిరామ వినురవేమ!**

పాడగా పాడగా రాగం పట్టుబడుతుంది. తినగా తినగా వేపాకు కూడా తియ్యగా తోస్తుంది. అంటే కష్టమైన పనిలో కూడా చెయ్యగాచెయ్యగా నైపుణ్యత వస్తుంది. అలా, ఈ ప్రపంచంలో సాధన ద్వారా సాధించలేని పనిలేదు. దీనినే అభ్యాసం అంటారు. మరొక ముఖ్యమైన విషయాన్ని కూడా ఇక్కడ గుర్తుంచుకోవాలి. సాధన చేసేటప్పుడు మిగిలిన అన్ని ఆలోచనలనూ తప్పనిసరిగా ప్రక్కన పెట్టాలి. దీనినే వైరాగ్యం అంటారు. ఈ విధంగా అభ్యాస–వైరాగ్యాలతో ఒక పని చెయ్యడంలో నిష్ఠ చూపించి, అందులో మనం ప్రావీణ్యత సాధిస్తే మిగిలిన పనులు చెయ్యడంలో కూడా చాలా సులభంగా ప్రావీణ్యత సాధించగలుగుతాము. నిష్ఠ ఉన్నవాణ్ణి, లేనివాణ్ణి పోల్చి చెప్పే గీతాశ్లోకం ఒకటుంది.

**వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన ।**
**బహుశాఖా హి అనంతాశ్చ బుద్ధయో అవ్యవసాయినామ్ ॥ (గీత 2.41)**

“దృఢనిశ్చయంగల బుద్ధితో పని చేసేవాడి మనస్సు ఒకే విషయం మీద పట్టుసడలకుండా లగ్నమయి వుంటుంది. కానీ అటువంటి దృఢనిశ్చయం లేనివాడి మనస్సు పరిపరివిధాల పరుగులు తీస్తూ ఉంటుంది.”

అయితే, మనం కోరుకునే లక్ష్యం అంగట్లో అమ్మే సరుకంత సులభంగా దొరకదు. దాన్ని పొందడానికి మనకు ఎంత అర్హత ఉందో, ఇంకా ఎంత నేర్చుకోవడం వల్ల పూర్తి అర్హతను పొందుతామో కాలక్రమేణా మనకే చూచాయగా తెలిసివస్తుంది. అసలైన పరీక్ష ప్రారంభమయ్యేది ఇక్కడే. దీనికోసం అమితమైన ప్రయాసతో మనస్సును సమీకరించి

చెయ్యాలనుకున్న పనిమీద లగ్నంచేసి దానిని మళ్ళీమళ్ళీ చెయ్యాలి. అలా చెయ్యడమే కాదు. చేస్తున్న పనిని ఎలా చేస్తున్నామో గమనించాలి. ఇంకా బాగా ఎలా చెయ్యాలో ఆలోచిస్తూ చెయ్యాలి. చేస్తున్న పని సక్రమంగా ఉందోలేదో చెప్పేందుకు ఒక గురువు ఎదురుగా ఉంటే మన పని కొంత సులభం అవుతుంది. ఒకవేళ గురువు లేకపోయినా ఫర్వాలేదు. మనం పట్టువిడువకుండా, శ్రద్ధతో పనిచేస్తున్నప్పుడు మన మనస్సే ఏమి చెయ్యాలో, ఏ మార్గంలో ముందుకు సాగాలో సూచిస్తుంది. ఏది ఏమైనా, మన వైపు నుంచి గొప్ప ప్రయత్నం లేకుండా మాత్రం అది అలవడదు.

ఉదాహరణకు మనం సంగీతం నేర్చుకుంటున్నామనుకోండి. స్వరాలతో మొదలుపెట్టి క్రమక్రమంగా సాధన చెయ్యాలి. ప్రతిస్వరం ఖచ్చితంగా మన గొంతులో పలుకుతున్నదో లేదో అనుక్షణం పరిశీలించుకుంటూ పాడుతూ ఉండాలి. ఆ స్వరాలు ఒకసారి పలుకుతాయి, మరొకసారి పలకవు. మొదటి స్వరం పలికితే రెండవ స్వరం సరిగా పలకదు. అవి రెండూ పలికితే ఆ తర్వాతి స్వరం తప్పుగా పలుకుతుంది. పోనీ మూడవ స్వరం సరిగ్గా పలికితే ముందు సరిగ్గా పలికిన స్వరాలలో అపస్వరాలు వినిపిస్తాయి.

ఇక మనం పాడే అయిదు నిమిషాల పాటలో కొన్ని వేల స్వరాలను పలకాలి. వాటన్నింటినీ సరిగ్గా పాడేందుకు ఎన్నిసార్లు సాధన చెయ్యాలి? పాడగా, పాడగా – నిజానికి కొన్ని వందలసార్లు – తప్పులు లేకుండా పాడగలిగే స్థితి వస్తుంది. సంగీత వాయిద్యాల విషయం కూడా అంతే.

ఇదే విధంగా నాట్యం, నటన, శిల్పం, ఉపన్యసించడం, క్రీడలు మొదలైనవన్నీ ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. నూరు మీటర్ల పరుగు పందెంలో నెగ్గాలనుకునేవాడు తన చుట్టూ వేలమంది నిలబడి చప్పట్లుకొడుతున్నారని ముందే ఊహించుకుంటే ప్రయోజనం ఏముంది? దానికోసం పరుగెత్తడం సాధన చెయ్యాలి. వ్యాయామం చేసి

శరీరాన్ని బలంగా చేసుకోవాలి. కాళ్ళు బలంగా తయారవడం కోసం వాటికి ప్రత్యేకమైన వ్యాయామం చెయ్యాలి. గెలిచేది వంద మీటర్ల పోటీలోనే అయినా కొన్ని వందల కిలోమీటర్లు పరుగెత్తి సాధన చెయ్యాలి!

చదువు కూడా ఇంతే. ఒకసారి చదివితే అర్థం కాని విషయం మరల మరల చదివితే అర్థమవుతుంది. బట్టీపట్టడమే కాదు, చక్కగా అర్థం చేసుకోవడాన్ని గురించి కూడా మనం చర్చిస్తున్నాం. చదవడానికి పరమార్థం పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం కానే కాదు. చదువంటే శాస్త్రాన్ని అర్థం చేసుకొని దానిలో నుంచి కొత్త విషయాలను, జీవితంలో దానికి కొత్త ఉపయోగాలను ఆవిష్కరించడమే. ఈ దృష్టితో చూసినప్పుడు చదువుకూ, విశ్వవిద్యాలయాలకూ ఏమీ సంబంధం లేదు కూడా. గొప్ప శాస్త్రజ్ఞులుగా రాణించిన వారి జీవితాలను పరిశీలించండి. వారి జీవితాలలో పాఠశాలలూ, పరీక్షగదుల కన్నా వారి కఠోర పరిశ్రమే వారికి ఎక్కువ విద్యను నేర్పింది.

'ఒక మేధావి తయారవ్వడానికి బయటనుండి అతనికి కలిగిన ప్రేరణ ఒక శాతం పనిచేస్తే అతడు చెమటోడ్చి చేసిన కఠోర పరిశ్రమ తొంభైతొమ్మిది శాతం పనిచేస్తుంది!' అని థామస్ ఆల్వా ఎడిసన్ చెప్పాడు. దీన్ని వివరించే సంస్కృత శ్లోకం కూడా ఒకటుంది.

**ఉద్యమేన హి సిద్ధ్యంతి కార్యాణి న మనోరథైః ।**
**న హి సుప్తస్య సింహస్య ప్రవిశన్తి ముఖే మృగాః ॥**

"ఉద్యమించి, మెలకువతో, ఒళ్ళు దాచుకోకుండా, శక్తికొద్దీ ప్రయత్నించి పనిచెయ్యడం ద్వారా మాత్రమే పనులు సాధించబడతాయి. మృగరాజే అయినా నోరు తెరుచుకుని నిద్రపోయే సింహం నోటిలోకి జింకలు వచ్చి దూరవు కదా!"

స్వామీజీ, "మీరు చిత్తశుద్ధితో నిష్ఠగా ఏ పని చేసినా సరే అది మీకు మేలు చేస్తుంది. చక్కగా చేసిన పని ఎంత చిన్నదైనా అద్భుతమైన ఫలితాలను భౌతిక, మానసిక,

ఆధ్యాత్మిక ప్రపంచాలు మూడింటిలోనూ ఇస్తుంది. కాబట్టి ప్రతివొక్కరూ తాము చేయగలిగినంత పనిని శక్తివంచన లేకుండా చెయ్యాలి" అని చెప్పారు. పై చర్చ తర్వాత లక్ష్యాన్ని సాధించడానికి కావలసినది కేవలం మన పరిశ్రమ మాత్రమే కానీ మరేదీ కాదని మనకు స్పష్టమవుతుంది. ఇందులో అర్థం చేసుకోలేనిది ఏదీ లేదు. అయినా మనం ఎక్కడో దారి తప్పిపోతున్నాము. ఎక్కడ?

## 10. అభ్యాసం కొనసాగకపోవడమే అసలు సమస్య

సాధారణంగా మనలో ఎవరికీ దీర్ఘకాలం వదలకుండా పనిచేసే శక్తి ఉండదు. "కుదరదండీ!" అని చెప్పడమే సులభంగా తోస్తుంది. ఇంతకు ముందు మనం చర్చించిన విద్య, ఉద్యోగం, కుటుంబం మొదలైన విషయాలలోనూ మనకు ఇటువంటి పరిస్థితే ఎదురుకావడాన్ని గమనించవచ్చు. అయితే వీటన్నింటిలోనూ ఆసక్తి సన్నగిల్లిపోవడానికి కారణం ఒకటే. అభ్యాసాన్ని కొనసాగించడానికి కావలసినంత స్ఫూర్తి లేకపోవడమే అసలు సమస్య. దీన్ని మరింత వివరంగా చర్చిద్దాము.

మనం ఇంతకు ముందు చర్చించిన కళలనే మరొకసారి చూద్దాము. బహుశా ఆ కళను నేర్పే గురువు మనల్ని మళ్ళీమళ్ళీ చేసి చూపమంటారు. కొత్తలో ఉత్సాహం వల్ల చేసినా రోజులు గడిచేకొద్దీ ఈ సాధన చాలా కష్టమైనదిగా తోస్తుంది. మెదడులో ఏదో తెలియని 'నొప్పి' మొదలవుతుంది. మనస్సును మాటిమాటికీ అదే విషయం మీద తెచ్చిపెట్టడం కష్టంగా తోస్తుంది. "నేను చేస్తున్నది బాగానే ఉంది కదా! అయినా మళ్ళీ సాధన చెయ్యమంటున్నారేమిటి?" అన్న ప్రశ్న మనస్సులో ఉదయిస్తుంది. మనల్ని మనమే అంచనా వేసుకునే శక్తి మనకు ఇంకా కలుగలేదని స్ఫురించదు.

త్వరలోనే ఈ 'అభ్యాసం' దుర్భరంగా తయారవుతుంది. నిజంగా మనం కోరుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు చేయవలసిన పని అంతులేనిదిగా కనిపించడం

మొదలుపెడుతుంది. ఆరంభశూరత్వంతో మనం మొదలుపెట్టిన పని, మన సంకల్పశక్తి నీరుకారిపోవడంతో, నెమ్మదినెమ్మదిగా కుంటడం మొదలుపెడుతుంది. త్వరలోనే ఆగిపోతుంది కూడా! అలా ఆగిపోయిన తర్వాత పోనీ మన మనస్సు ఊరుకుంటుందా? ఊరుకోదు. అలా మానివేసినదానినే మనకు గుర్తు చేస్తూ ఉంటుంది. దానిని కొనసాగిస్తేనే మంచిదంటుంది. ఆ మనస్సులోనే ఇంకొక భాగం, "లేదు లే! మనవల్ల కాదులే!" అని మన సోమరితనాన్ని సమర్థిస్తుంది.

*"...విషయాన్ని జీవితంలో ఆచరణలో పెట్టడానికి వచ్చేసరికే కష్టమంతా!"* అని చెపుతూ, అలా ఎందుకు జరుగుతుందో వివరిస్తూ, స్వామీజీ ఒక కథ చెప్పి, దానికి వివరణను కూడా ఇచ్చారు.

*"ఈసప్ కథలలో చెప్పిన జింక కథ మీకు గుర్తుండే ఉంటుంది. ఒక జింక నీటిలో తన ప్రతిబింబాన్ని చూసుకుని చాలా గర్వపడిపోతోంది. పక్కనే ఉన్న తన పిల్లతో, 'చూడు! నేనెంత బలంగా ఉన్నానో! నా తల ఎంత అందంగా ఉందో చూడు! నా కాళ్ళు ఎంత బలంగా, కండపట్టి ఉన్నాయో చూడు! నేనెంత వేగంగా పరుగెత్తగలనో చూడు!' అంటూ గొప్పలు చెపుతోంది. ఇంతలో అకస్మాత్తుగా దూరం నుంచి వేటకుక్కల మొరుగుళ్ళు వినపడ్డాయి. అప్పటిదాకా గొప్పలు చెప్పిన ఆ జింక మరుక్షణం కాళ్ళకు బుద్ధి చెప్పి, ఒక్కసారిగా పరుగు లంకించుకుంది. చాలా మైళ్ళు పరుగెత్తి చివరికి తిరిగివచ్చి, వగరుస్తూ నిలబడింది. దాని పిల్ల, 'అప్పటిదాకా నువ్వెంత బలం గలదానివో చెపుతున్నావు కదా! కానీ ఆ కుక్కల మొరుగుళ్ళు వినగానే పారిపోయావెందుకు?' అని అడిగింది. అప్పుడు ఆ జింక, 'ఔను నాయనా! ఎందుకో ఆ కుక్కల అరుపులు చెవినబడగానే నా ఆత్మవిశ్వాసమంతా మాయమయిపోతుంది!' అని చెప్పింది. మన సంగతి కూడా అలాగే ఉంటుంది. ...మనం చాలా బలవంతులమనీ, శౌర్యవంతులమనీ అనుకుంటాము. గొప్పగొప్ప నిశ్చయాలు చేస్తాము. కానీ ఎప్పుడైతే కష్టాల రూపంలో,*

*రకరకాల ఆకర్షణల రూపంలో కుక్కలు మొరుగుతాయో, అప్పుడు మన నిశ్చయాలన్నీ కరిగి ఆవిరైపోయి, పైన చెప్పుకున్న కథలోని జింకలాగా పారిపోతాము. మరి ఇలాగే జరిగేదయితే మనం ఈ శ్రద్ధ, నిష్ఠ మొదలైన విషయాలను గురించి నేర్చుకోవడంవల్ల ఏమీ ప్రయోజనం ఉండదా? ఉంటుంది! నిజానికి చాలా గొప్ప ప్రయోజనముంటుంది. పట్టుదలే చివరికి విజయం సాధిస్తుందన్న నిజాన్ని నేర్చుకోవడమే దాని ప్రయోజనం! మనం ఆ నిజాన్ని మరింత విస్పష్టంగా అర్థం చేసుకుని, పట్టుదలతో ముందుకు సాగుతాము! ఒక్క రోజులో దేనినీ సాధించలేము కదా!"*

అయితే, ఇలా పట్టుదలతో దేనినైనా సాధించవచ్చునన్న విషయం మనలో చాలామందికి తెలుసు. అయినా గొప్ప ఆర్భాటంతో మొదలుపెట్టిన పనులు, కారణం తెలియకుండా, నాలుగు రోజుల్లోనే ఎందుకు నీరుకారిపోతాయో తెలుసుకోవాలంటే, అసలు మనిషి ఒక పెద్ద లక్ష్యాన్ని సాధించే పనిని చెయ్యాలని ఎందుకు అనుకుంటాడో, ఆపైన ఎందుకు దానిని చెయ్యడం మానివేస్తాడో తెలుసుకోవాలి.

## 11. మానవ నైజం - మానవ జీవితలక్ష్యం

*'మనిషిలో దైవత్వం దాగివుంది. అతడు దాన్ని వెలికితీసి, తన ప్రవర్తనలో వ్యక్తపరచడం సాధ్యమే. అదే మానవజీవిత లక్ష్యం!'* అని చెపుతూ, స్వామీజీ మానవ జీవితానికి ఆదర్శాన్ని ఇలా స్పష్టీకరించారు. "నా ఆదర్శాన్ని కొద్దిమాటలలో చెప్పవచ్చు. *అదేమిటంటే - మానవాళికి తమలోని దివ్యత్వాన్ని గురించి బోధించడం, తమ జీవితం లోని ప్రతి కదలికలోనూ ఆ దివ్యత్వం ఉట్టిపడేలా ప్రవర్తించడం ఎలాగో నేర్పించడం."*

మనిషిలో స్వభావసిద్ధంగా, సూక్ష్మంగా దాగి వున్న దివ్యత్వం మనిషిని పరిపూర్ణతవైపు తన చూపుల్ని సాగించేలా చేస్తుంది. మనం కోరుకున్న లక్ష్యాన్ని సాధించడానికి కావలసిన ఉత్సాహాన్ని, పట్టుదలను మనకు అందించేది అదే. కానీ ఆ

దివ్యత్వపు స్ఫూర్తి నిలకడగా ఉండదు. మాటిమాటికీ అది 'మాయ'మయిపోతూ ఉంటుంది. దీనికి ముఖ్యమైన కారణం ఒకటుంది. అదే అనాది అయిన మాయ. ఆ మాయ మనల్ని ఒక పొరలాగా కమ్మివేసి ఆ దివ్యత్వాన్ని మరచిపోయేలా చేస్తుంది. దానివల్లనే మనం అపజయాల పాలవుతాం. అందుచేత మనం ఆ దివ్యత్వం కలిగించే స్ఫూర్తి నిలకడగా ఉండేలా చెయ్యడానికి నిరంతరం అభ్యాసం, సాధన చెయ్యాలి. ఆ మాయతో నిరంతరం పోరాడాలి. ఇదే మనం జీవితంలో చేసే పని. అలా, ఒకసారి నిలకడను సాధించిన దివ్యస్ఫూర్తి మనకు అన్ని రంగాలలోనూ ఉపయోగపడుతుంది, విజయాన్ని కలిగిస్తుంది, మన వ్యక్తిత్వాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దుతుంది, అంతిమంగా పరిపూర్ణతను సాధించేందుకు దోహదపడుతుంది. ఆ దివ్యత్వపు భావన ఎప్పుడు మన మనస్సులో స్థిరంగా నిలిచి ఉంటుందో అప్పుడు మనకు పరిపూర్ణత కలిగినట్టే.

అయితే, 'అసలు ఆ పరిపూర్ణత కోసం ఎందుకు ప్రయత్నించాలి?' అని కూడా అడుగవచ్చు. దీనికి సమాధానాన్ని తెలుసుకోవాలంటే మానవజన్మ గురించి రెండు మాటలు చెప్పుకోవాలి. చాలా గొప్ప అదృష్టం వల్ల (దేవుని అనుగ్రహం వల్ల) మానవజన్మ కలుగుతుందనీ, అటువంటి దాన్ని వృథా చెయ్యకూడదనీ శాస్త్రజ్ఞుల నుంచీ, మతప్రవక్తల వరకూ, అందరూ చెపుతూ ఉంటారు. మనిషి జన్మలో సాధించగలిగే మహోన్నత స్థితిని మరే జన్మలోనూ పొందడం సాధ్యం కాదనీ, చివరికి దేవతలు కూడా అటువంటి గొప్ప స్థితిని పొందలేరనీ శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఇలాంటి జన్మను పొందిన తర్వాత మనిషి పరిపూర్ణతను సాధించడానికి ప్రయత్నించాలి. అదే అతడి అంతిమలక్ష్యం. దాన్ని పొందడంలోనే నిజమైన ఆనందం ఉంది. దాన్ని సాధించే మార్గంలో ఒక అంశమే వ్యక్తిత్వ నిర్మాణం. కాబట్టి, దానికోసం ఎంత శ్రమపడినా అది వృథా కాదు.

# 12. పరిపూర్ణతను సాధించేందుకు దగ్గరిదారి కర్తవ్యనిష్ఠ

ముందుగా ఒక విషయాన్ని స్పష్టం చేసుకుందాం. ఈ పరిపూర్ణత అన్నదానిమీద ఎవరికీ గుత్తాధిపత్యం లేదు. దాన్ని సాధించడంలో పురుష, స్త్రీ తారతమ్యం లేదు. చదువుకున్న వాడు, చదువులేని వాడు, ధనికుడు, పేద అన్న తారతమ్యం లేదు. దేశకాలాలతో నిమిత్తం లేదు. ప్రపంచంలో మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరూ దాన్ని సాధించవచ్చు.

మనదేశంలో అనాది నుంచీ ఉన్న మతాన్ని సనాతనధర్మం అని వ్యవహరిస్తారు. అసంఖ్యాకులైన ప్రజలు సనాతనధర్మం బోధించిన వివిధమార్గాలను అనుసరించి పరిపూర్ణత సాధించారు. *"జంతువును మనిషి స్థాయికి, మనిషిని భగవంతుని స్థాయికి ఉద్ధరించే భావనయే మతం. ఇందుకోసం రకరకాల మతాలు రకరకాల మార్గాలను చూపాయి"* అని స్వామీజీ చెప్పారు. స్వామీజీ వాటిని నాలుగు యోగాలుగా, అంటే కర్మ, ధ్యాన, భక్తి, జ్ఞానయోగాలుగా అభివర్ణించారు. కర్మయోగం అంటే కర్తవ్యనిష్ఠ ద్వారా యోగస్థితికి చేరుకోవడమని స్థూలంగా చెప్పుకోవచ్చు. మనం చేయవలసిన పనులనే కర్తవ్యంగా భావించి, వాటిని నిష్ఠతో నెరవేర్చడాన్ని కర్తవ్యనిష్ఠ అంటారు. పై వర్గీకరణలో ఇచ్చిన కొన్ని మార్గాలు ఎక్కువ కష్టంతో కూడుకున్నవి. అందరికీ సాధ్యం కానివి. అధికశాతం జనాభా అటువంటి గొప్పగొప్ప సాధనలు చేసి ఆ పరిపూర్ణతను సాధించలేరు. అందుకని సమాజంలో సాధారణమైన జీవనాన్ని గడుపుతూ, మన బాధ్యతలను నెరవేరుస్తూనే ఆ పరిపూర్ణతను సాధించే విధానాన్ని కూడా మన సనాతన ఋషులు అందించారు. అతి సామాన్యమైన రోజువారీ జీవితంలో, అల్పమైనదిగా కనిపించేదయినా సరే – అటువంటి మన కర్తవ్యాన్ని, నిష్ఠతో నెరవేర్చడం ద్వారా ఆ పరిపూర్ణతను సాధించవచ్చునని వారు బోధించారు.

# 13. కర్తవ్యనిష్ఠ ద్వారా వ్యక్తిత్వ నిర్మాణాన్ని సాధించడమే సామాజికజీవనపు ఉద్దేశ్యం

మనిషి సంఘజీవి. అతడు సంఘంలో ఇతరులకు సేవ చేసి దానికి ప్రతిఫలంగా తన వ్యక్తిగత అవసరాలను కూడా సాధించుకోగలుగుతాడు. అయితే ఇలా జీవించడం కేవలం తన అవసరానికి ప్రపంచాన్ని వాడుకోవడం మాత్రమేనా? దీనినుంచి అంతకన్నా ఉన్నతమైన విషయాన్ని సాధించవచ్చునా? తప్పక సాధించవచ్చును. కర్తవ్యాన్ని నిష్ఠతో అనుష్ఠించడం ద్వారా ప్రాపంచిక జీవనాన్నే ఉపయోగించుకుని పరిపూర్ణతను సాధించడం కోసమే సామాజిక వ్యవస్థ అనే ఏర్పాటు ఉద్దేశించబడింది. స్వామీజీ ఇలా చెప్పారు:

*“కర్తవ్యం వెనుక దాగివున్న తత్త్వం ఏమిటి? జీవితంలో అన్ని రంగాలలోనూ కర్తవ్యం అనేది చెప్పబడింది. నీతి గురించి చెప్పినా, ప్రేమ గురించి చెప్పినా, ఏ ఇతర యోగం గురించి చెప్పినా వాటన్నింటికీ ఒకటే లక్ష్యం. మనలోని నీచస్వభావాన్ని, అంటే జంతువులలాగా తినడం కోసం, తాగడం కోసం, కామసుఖాల కోసం వెంపర్లాటను అణచుకుని, తద్వారా మనలోని ఉన్నతమైన ఆత్మస్వభావాన్ని మరింతగా వెలికితెచ్చి, అది మన ప్రవర్తనలో ప్రకాశించేలా చెయ్యడమే ఆ లక్ష్యం. ఇంద్రియాలు ప్రేరేపించే కోరికలను తీర్చుకుని, సుఖాలు పొందే తక్కువస్థాయి జీవితంలో మన శక్తిసామర్థ్యాలు వృథా అయిపోకుండా నిరోధించి, ఉన్నతస్థాయిలో అవి తమనుతాము వ్యక్తీకరించుకునేలా చెయ్యడమే ఆ లక్ష్యం.”*

*“మరి దీన్ని సాధించేది ఎలా? దీనికోసం కామసుఖాలను, రుచిగల పదార్థాలను తినాలన్న జిహ్వాచాపల్యం మొదలైన నీచమైన కోరికలన్నింటినీ నిరంతరం, అనుక్షణం, వద్దు వద్దు అని మనకు మనమే నచ్చచెప్పుకుంటూ, కోరికలన్నింటినీ మన స్వాధీనంలోకి తెచ్చుకోవడాన్ని నేర్చుకోవాలి. మనిషి తన కర్తవ్యాన్ని చక్కగా, నిష్ఠతో*

*నిర్వహించాలంటే ఇలా చెయ్యడం తప్పనిసరి. ఈ కోరికలన్నింటినీ విజ్ఞతతో నిరోధించడంలో, తన స్వాధీనంలోకి తెచ్చుకోవడంలో, మనిషి కఠినంగా వ్యవహరించి, ప్రవర్తించినప్పుడే తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వహించగలుగుతాడు."*

*"ఇలా పనిచెయ్యడాన్ని అభ్యసించడం కోసమే సమాజమనేది ఒకటి తయారయ్యింది. ఇలాంటి సామాజికవ్యవస్థను మనిషి ఉద్దేశ్యపూర్వకంగా తయారుచేసి ఉండవచ్చు, లేకపోవచ్చు. ఏదియేమైనా, ఈ ప్రపంచంలో పుట్టి, 'పనిచెయ్యడం, దాని ప్రతిఫలాన్ని పొందడం' అనే మార్గం ద్వారా తనలోని స్వార్థాన్ని చంపుకుంటూ, కోరికలను అదుపులో పెట్టుకుంటూ, సొంత లాభాన్ని మానుకుంటూ, క్రమక్రమంగా ముందుకు సాగుతూ, తన నిజస్వభావమైన అనంతత్వాన్ని పొందేందుకు దారిని సుగమం చేసుకుంటాడు. సమాజానికీ, కర్తవ్యానికీ గల నిజమైన ఉద్దేశ్యం ఇదే."*

ఈ విధంగా సమాజంలో గృహిణిలా, ధర్మవ్యాధుడిలా సాధారణమైన జీవితం గడుపుతూ కూడా పరిపూర్ణతను సాధించవచ్చునని స్వామీజీ బోధించారు. "***అందరి సంక్షేమం కోసం స్వార్థత్యాగం*** *అనే భావం ఏ సమాజంలో గొప్పగా పెంపొందుతుందో ఆ సమాజంలోని వ్యక్తులు అత్యున్నత సంస్కారవంతులు*" అని స్వామీజీ చెప్పారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మిగిలిన అందరి కోసం తమ జీవితాన్ని త్యాగం చెయ్యాలి. అలాంటి స్వార్థత్యాగంతో పనిచేసిన వ్యక్తులు గొప్ప శక్తినీ, పరిపూర్ణతనూ సాధిస్తారు. వారితో పాటు వారున్న సమాజం కూడా పురోభివృద్ధి సాధిస్తుంది.

## 14. ఏది నిజమైన కర్తవ్యం?

సమాజం సజావుగా, సక్రమంగా నడవడానికి జరగవలసిన పనులను ఆ సమాజంలోని వ్యక్తులు పంచుకుని పనిచేస్తారు. ఇలా పంచుకోవడం అనేది ఆదిమ మానవులలో చాలా సులభంగా జరిగివుండవచ్చు. ఎందుకంటే వారి అవసరాలే చాలా

తక్కువగా ఉండేవి కనుక. కానీ ఆధునిక మానవుని జీవితం, ఆధునిక సమాజం చాలా సంక్లిష్టంగా తయారయ్యాయి. మానవులకు కావలసిన లక్షల అవసరాలను తీర్చడానికి చేయవలసిన పనులను పంచుకోవడంలో గొప్ప చిక్కులు ఎదురవుతున్నాయి. మానవజీవిత లక్ష్యం తల్లక్రిందులై, కామకాంచనాలే జీవిత పరమార్థాలుగా తయారవుతున్నాయి. అందువల్ల తమ కర్తవ్యాన్ని విడిచి, ఏదో ఒక విధంగా వాటిని సంపాదించడానికి వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. దానికి తోడు, కొన్ని పనులే గొప్పవని భావించి వాటి కోసమే అందరూ ఎగబడుతున్నారు. అయితే గొప్పతనం చేసే పనులలో లేదనీ, పనిచేసే పద్ధతిలో ఉందనీ సమాజం గ్రహించాలి.

అంతేకాక, చేసే పనిని అత్యుత్తమంగా చేయడం ద్వారా, అందరూ చేయని పనిని చేయడం ద్వారా మన ప్రత్యేకతనూ, మనుగడనూ నిలుపుకోవడం సాధ్యమవుతుంది. అలా చేయడం ద్వారా మనం సమాజానికి విశిష్టమైన సేవను అందించగలుగుతాము కూడా! పైగా, ఇలా ప్రత్యేకత సాధించమని ప్రకృతి మనల్ని కోరుతోంది కూడా. ఈ ప్రత్యేకతను సాధించడం ద్వారా మనిషే కాక జీవకోటి కూడా పరిణామాన్ని సాధిస్తోంది. తర్వాత అధ్యాయాలలో ఈ పరిణామ భావనను మరింత వివరంగా చూద్దాము.

అసలు ఏ పని మన కర్తవ్యం కాగలదో వివరిస్తూ స్వామీజీ, *"ఏదయితే మనల్ని ఉన్నతంగా ఎదిగేలా చేస్తుందో అది మంచిది; అది మన కర్తవ్యం! ఏదయితే మనల్ని దిగజారుస్తుందో అది చెడ్డది; అది మన కర్తవ్యం కాదు!"* అని చెప్పారు. అతిగా సంపదలు కూడబెట్టిన వాడు, అతి దారిద్ర్యంలో ఉన్నవాడు – వీరిద్దరూ కూడా గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని సాధించలేరు. ఎందుకంటే వారి జీవితం పూర్తిగా భౌతికమైన విషయాలకు లోబడిపోతుంది. అలా కాక యుక్తమైన జీవితాన్ని గడుపుతూ, సేవాభావంతో జీవించేవాడు ఉన్నతంగా ఎదుగుతాడు. అతడు అలా ఎదగడానికి సహకరించేదే అతడి కర్తవ్యం.

## 15. 'నేను! నాది!' – మన విజయానికి ప్రథమ శత్రువులు

సగటు మనిషికి కలిగే ఆలోచనలన్నీ 'నేను–నాది' అనే మాటల పరిధిలోనే ఉంటాయి. ఎంతసేపూ మనిషి తన గురించే ఆలోచిస్తాడు. "నేను కష్టాలలో ఉన్నాను; నేను బాధపడుతున్నాను; నాది, ఫలానా వస్తువు పోయింది; నాది నాకు కాకుండా పోయింది!" మొదలైన ఆలోచనలతోపాటు, "ఇన్ని కష్టాలూ నాకే రావాలా! ఊళ్ళో ఇంతమంది ఉండగా!!" అన్న ఆలోచనలు మనిషి స్వభావంలో నిండి ఉంటాయి. మరొకప్రక్క పనిచేసేటప్పుడు కలిగే కష్టం – "నాకు కష్టంగా ఉంది. ఈ పని చెయ్యడం మానివేస్తాను. హాయిగా కూర్చుంటాను" – అనే బద్ధకాన్ని కలిగిస్తుంది. ఈ రెండు రకాల ఆలోచనలవల్ల మనిషి తాను చేసే పనిని నిష్ఠగా చెయ్యలేడు. వీటినే అహంకార మమకారాలంటారు. వీటివల్లనే 'స్వార్థం' కలుగుతుంది.

పుట్టుక నుంచి చావు వరకూ జరిగే జీవిత ప్రయాణంలో మనిషి చేసే ఒకేఒక్క పని ఏమిటి? మాటిమాటికీ పడగ ఎత్తుతూ ఉండే తన అహంకారాన్ని అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తూ ఉండడమే! అతడు సమర్థంగా పనిచెయ్యడానికి అతడి అహంకారం మాటిమాటికీ అడ్డుపడుతూ ఉంటుంది. దాన్ని చంపుకుని అతడు పనిచేయాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. ఇంకొంత ఔన్నత్యాన్ని సాధించిన మానవుడు మరింత నిస్వార్థంతో పనిచేస్తూ ఉంటాడు. మానవాళి సాధించిన ప్రగతి అంతా దీన్ని గురించినదే.

*"మనం ఈ జీవితంలో నేర్చుకోవలసిన గొప్ప పాఠం ఒకటి ఉంది. అది మనల్ని మనం మర్చిపోవడం. ఎల్లప్పుడూ ఇతరులకు మంచి చెయ్యడానికి ప్రయత్నించండి. దీని ద్వారా మనల్ని మనం మర్చిపోతాం. తనను తాను మర్చిపోకుండా, మనిషి ఏ పనినీ పరిపూర్ణతతో చెయ్యలేడు"* అని స్వామీజీ వివరించారు. ఏ చిన్న పని చెయ్యాలన్నా మనిషి తనను తాను మర్చిపోవాలి. అంటే అహంకారాన్ని అణచివేసుకోవాలి. అయితే,

తనను తాను మర్చిపోయిన వాడు కర్తవ్యనిర్వహణ ఎలా చేస్తాడు అన్న సందేహం కలుగవచ్చు. దీనికి అర్థం ఏమిటంటే ఒకసారి లక్ష్యాన్ని నిశ్చయించుకున్న తర్వాత, ఆ లక్ష్యాన్ని పొందినప్పుడు కలిగే గొప్పస్థితిని గురించి ఏవేవో ఊహాలోకాలలో తేలిపోవడాన్ని కట్టిపెట్టి, చేసే పని మీద దృష్టి పెట్టాలి. అప్పుడే మనిషి ఆ పనిని విజయవంతంగా, చక్కగా చెయ్యగలుగుతాడు. జీవితంలో ఔన్నత్యాన్ని పొందుతాడు.

స్వామీజీ ఇంకా ఇలా చెప్పారు. *"ఎప్పుడు మనం నేను, నాది అనే భావన లేకుండా పనిచేస్తామో, అప్పుడే అత్యుత్తమంగా పనిచేస్తాము. ఇతరుల మీద అంత ఎక్కువ ప్రభావాన్ని చూపగలుగుతాము. ప్రపంచం చూసిన గొప్పగొప్ప మేధావులందరూ ఈ నిజాన్ని గ్రహించి పనిచేశారు"* నిజానికి అటువంటి మనిషి తనలోని శక్తిని (పరిపూర్ణతను లేదా దివ్యత్వాన్ని) అంత ఎక్కువగా వెలికితీయగలుగుతున్నాడని అర్థం చేసుకోవాలి.

## 16. స్వార్థంతో ఎందుకు జీవించకూడదు?

అందరి సంక్షేమాన్నీ మనం ఎందుకు దృష్టిలో పెట్టుకోవాలి? స్వార్థంతో ఎందుకు జీవించకూడదు? ఎందుకంటే మొదటిగా అందరూ సుఖంగా ఉంటేనే మనమూ సుఖంగా ఉండగలం. మన చుట్టుప్రక్కల ఉన్నవారందరూ ఏదైనా అంటురోగంతో బాధపడుతున్నారనుకోండి! నేడోరేపో అది మనకు కూడా సోకుతుంది కదా! అలాగే మనకు తెలిసిన వారందరూ సంతోషంగా ఉన్నప్పుడే మనం కూడా సంతోషంగా ఉంటాము. రెండవదిగా మనం సమాజంలో అందరి సహాయాన్ని తీసుకుని జీవిస్తున్నాం. సమాజంలోని వారందరూ తెలిసో, తెలియకో తమ కర్తవ్యాలను ఎంతో కొంత ప్రేమతో నిర్వహిస్తున్నారు కాబట్టే మన జీవనం సాధ్యమవుతోంది. కాబట్టి మనం వారికి ఋణపడి ఉన్నాం.

**యావద్భ్రియేత జఠరం తావత్ స్వత్వం హి దేహినామ్ ।**
**అధికం యోఽభిమన్యేత స స్తేనో దండమర్హతి ॥**

"తన కడుపు నింపుకునేందుకు కావలసినంత ధనం పైనే మనిషికి అధికారం ఉంది. అంతకన్నా ఎక్కువ ధనాన్ని మనిషి కూడబెట్టడానికి ప్రయత్నిస్తే అతడు దొంగ అవుతాడు. అతణ్ణి శిక్షించవలసి ఉంటుంది" అని ఒక సంస్కృతశ్లోకంలో చెప్పబడింది. ఆ విధంగా తమ సంపదకు సంరక్షకులుగా వ్యవహరిస్తూ, అది సమాజంలో అందరికీ ప్రయోజనకరమయ్యేందుకు కృషి చెయ్యడం ధనికుల విధి.

**ఇష్టాన్ భోగాన్ హి వో దేవాః దాస్యంతే యజ్ఞ భావితాః ।**
**తైర్దత్తా న ప్రదాయైభ్యః యో భుంక్తే స్తేన ఏవ సః ॥ (భగవద్గీత 3.12)**

దేవతలకు సమర్పించకుండా తానే తినాలనుకునేవాడు తప్పు చేస్తున్నాడని, అలా చేసినవాడు దొంగతనం చేసినట్టేనని భగవద్గీతలో చెప్పబడింది. దేవతలనే వారు ఎక్కడోలేరనీ, మన చుట్టూ మానవరూపంలో ఉన్న అసంఖ్యాకులైన దేవుళ్ళను అర్చించమనీ వివేకానంద స్వామి చెప్పారని మనందరికీ తెలుసు. కాబట్టి 'అన్నీ నాకే కావాలి, అన్నీ నాకే కావాలి!' అనుకునేవాడు ప్రకృతి నుంచీ, సమాజం నుంచీ దొంగిలిస్తున్నట్టే లెక్క.

స్వామీజీ ఇలా చెప్పారు. *"ఇతరులు తమకున్నదాన్ని ఎంతోకొంత వదులుకోవడం ద్వారానే మన జీవనం సాధ్యపడుతోంది. మనకు ఆహారం దొరకాలంటే మొక్కలూ, జంతువులూ తమను తాము అర్పించుకోవలసి వస్తోంది. అంతేకాక మనకు పట్టెడన్నం దొరకాలంటే ఎవరోవొకరు తమ నోటి దగ్గర కూడును వదులుకోవలసి వస్తోంది"* అని చెపుతూ, *"అందుచేత మనిషి తన జీవితాన్ని ఇతరుల కోసం అర్పించాలి. వారికి సేవగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించడమే మనిషి ఔన్నత్యానికి బాటలు వేస్తుంది"* అని చెప్పారు.

స్వామీజీ మనిషి జీవితలక్ష్యాన్ని ఇలా నిర్వచించారు. *"ఈ జీవితం క్షణికం! ఈ ప్రపంచంలో మన గొప్పలన్నీ మూణ్ణాళ్ళ ముచ్చట్లే! ఎవరైతే పరుల కోసం జీవిస్తారో వాళ్ళే నిజంగా జీవిస్తున్నారు. మిగిలిన వాళ్ళు బ్రతికున్నా చచ్చినట్టే లెక్క!"* అని చెప్పారు. దానివల్ల కలిగే ఫలితం ఎలా ఉంటుందో వివరిస్తూ, *"ఇతరుల కోసం మనం ఏ కొద్దిపాటి పని చేసినా అది మనలోని ఆత్మశక్తిని మేల్కొల్పుతుంది. ఇతరులకు మంచి జరగాలని ఏ మాత్రం ఆలోచించినా అది క్రమంగా మన హృదయంలో ఒక సింహానికి ఉండే శక్తిని నింపుతుంది. మిమ్మల్నందరినీ నేనెంతగానో ప్రేమిస్తున్నాను.* కానీ *మీరందరూ ఇతరుల కోసం శ్రమిస్తూ మరణించాలని నేను* కోరుకుంటున్నాను – మీరు అలాచెయ్యడాన్ని చూడడమే నాకు ఇష్టం!" అని చెపుతూ, విశాలదృష్టితో చూసినప్పుడు, *"నిస్వార్థమైన జీవితమే మానవులందరికీ నిర్దేశించబడిన ఏకైక కర్తవ్యమనీ, దానిమీదగల కర్తవ్యనిష్ఠ మనకు దివ్యమైన ఫలితాలను ఇవ్వగలదు"* అని వివరించారు.

ఒక విద్యార్థి, నేను చదివే చదువు సమాజానికి ఉపయోగపడాలి అని భావించి శ్రద్ధతో చదవాలి. ఏదోవొక మార్గంలో పరీక్షలలో బయటపడాలని ప్రయత్నించకూడదు. ఒక ఉద్యోగి తాను చేసే ఉద్యోగాన్ని దైవకార్యంగా, ప్రజాసేవగా భావించి చెయ్యాలి. అవినీతికి పాల్పడకూడదు. కుటుంబాల విషయంలో కూడా తల్లిదండ్రులు తాము కుటుంబ సభ్యుల కోసం చేసే పని అంతా సేవగా భావించి, ప్రేమతో చెయ్యాలి. పిల్లలు తల్లిదండ్రులను, ఇతర కుటుంబ సభ్యులను దైవసమానులుగా భావించి సేవ చెయ్యాలి.

## 17. కర్తవ్యనిష్ఠకు నిజమైన ఊతం ప్రేమే!

మనిషి తాను చేసే పనులన్నింటినీ ప్రేమతోనే చేస్తాడు. ప్రేమ లేకుండా ఏ పనినీ చెయ్యలేడు. ప్రేమ ఉంటే మనిషి ఎంత కష్టమైన పనినైనా సంతోషంగా చేస్తాడు. కానీ, సాధారణంగా ఈ ప్రేమ పూర్తి స్థాయిలో ఉండదు. అందువల్ల మనిషి పనిచేస్తున్నపుడు

బాధపడుతూ చేస్తాడు. ఇలా బాధపడుతూ చేసిన పని మంచి ఫలితాలను ఇవ్వదు. పైగా అలా చేసిన పని పాడయిపోవడమే కాక, మన వ్యక్తిత్వం ఉన్నతంగా ఎదగడానికి కూడా దోహదపడదు.

*"చేపట్టిన కర్తవ్యం అనేది మధురంగా తోచడం చాలా అరుదు. చేదుగా తోచే పనిని చెయ్యాలంటే దాని మీద గొప్ప ప్రేమను పెంపొందించుకోవాలి. 'ప్రేమ'ను దాని చక్రాలకు కందెనగా పూసినప్పుడు మాత్రమే ఈ కర్తవ్యమనే యంత్రం సాఫీగా నడుస్తుంది"* అని కూడా స్వామీజీ చెప్పారు. అయితే ఇది మాట్లాడినంత సులభం కాదు. మనిషి ఎప్పుడూ 'నేను ఇంతవాణ్ణి, అంతవాణ్ణి' అనీ, 'నాకు బాధ కలుగుతోంది, నాకు సంతోషం కలుగుతోంది' అనీ, ఇవి కాకపోతే, 'వాతావరణం వేడిగా ఉంది, చల్లగా ఉంది; అలా ఉంటే నేను పనిచేయగలను, ఇలా ఉంటే నేను పనిచేయలేను' అనీ పరిపరి విధాల అనుకుంటూ ఉంటాడు. ఇలా మనిషి తనను గురించే తాను ఎల్లప్పుడూ ఆలోచించుకునే ఈ తత్త్వాన్ని వదిలించుకోవడం అంత సులభం కాదు. అటువంటి ఆలోచనలను వదిలించుకోవాలంటే మనిషికి ప్రేమ కావాలి. ప్రేమ మనిషిలో తనను గురించిన ఆలోచనలను త్యాగం చేసి, ఇతరుల మేలు గురించి ఆలోచించేలా చేస్తుంది.

**కూరిమి గల దినములలో**
**నేరములెన్నడును గలుగనేరవు మరి యా**
**కూరిమి విరసంబైనను**
**నేరములే తోచుచుండు నిక్కము సుమతీ! (సుమతీ శతకం)**

కూరిమి అంటే ప్రేమ. స్నేహం, ప్రేమ ఉన్నంత కాలం స్నేహితుడిలో తప్పులు కనిపించవు కానీ స్నేహం చెడిపోయిన క్షణం నుంచీ స్నేహితుడు చేసేవన్నీ నేరాలుగానే కనిపిస్తాయని ఈ పద్యం భావం. ఇదే విధంగా మనకు ఇష్టమైన పనిని, మనం ప్రేమించే పనిని చెయ్యడానికి ఎంత కష్టపడడానికైనా వెనుకాడం. కానీ ఆ ప్రేమ

లోపించిన నాడు ఆ పనిని ఎగవెయ్యడానికి అన్ని రకాల సాకులూ చెపుతూ ఉంటాము.

కాబట్టి ఇలా తనను తాను మర్చిపోయేలా చేసే ప్రేమ మనిషిలో ఎంతగా పెరిగితే అతడు తన కర్తవ్యాన్ని అంత చక్కగా నిర్వహించగలుగుతాడు. అతడు చేసే పని అంత మంచి ఫలితాలను సాధిస్తుంది. అయితే ప్రేమగల మనిషి ఫలితాలను కూడా పట్టించుకోడు. ఫలితాలను గురించి ఆలోచించడమనేది నిజంగా ప్రేమించేవాడు చేసే పని కాదు. కర్తవ్యమే అతడికి ముఖ్యం. కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నప్పుడు మనిషి కొన్ని అనుకూలమైన ఫలితాలను, కొన్ని ప్రతికూలమైన ఫలితాలను పొందుతాడు. ఈ సమయంలో అతడి అహంకారం తలెత్తితే అతడు ఆ ఫలితాలతోనే ఆగిపోతాడు. మళ్ళీ తన ప్రేమ సహాయంతో ఆ అహంకారాన్ని వదిలించుకుని కర్తవ్యనిష్ఠతో ముందుకు సాగితే మరింత గొప్ప ఫలితాలను సాధించగలుగుతాడు.

## 18. పరమానందమే సృష్టి యొక్క పరమగమ్యం

అయితే ఈ ఘనకార్యాలను సాధించినప్పుడు కలిగే పేరు ప్రఖ్యాతుల మీదే మన దృష్టి ఉంటుందా లేక మన మనస్సులో ఇంకొక ఆలోచన ఏదైనా ఉందా! ఉంది! ఆయా పనులను పరిపూర్ణతతో చేసినప్పుడు మనకు గొప్ప ఆనందం కలుగుతుంది. నిజానికి ఇదే మనల్ని ఆయా పనులు చేయడానికి పురికొల్పుతుంది. ఆ ఆనందం ఎల్లకాలం నిలిచి ఉండాలన్నదే మన ప్రయత్నం. మనం తెలిసి పనిచేసినా, తెలియక చేసినా ఆ పరమానందమే మన పరమగమ్యం.

జీవరాశులన్నీ కూడా ప్రస్తుతం తమకు దొరకని ఒక గొప్ప ఆనందాన్ని కాంక్షిస్తున్నాయి. తమ జీవితాలలో మరింత నైపుణ్యాన్ని సాధించడం ద్వారా మరింత ఆనందాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆ దిశగా పనిచేస్తూ, దాన్ని ఒక ఉద్యమంగా చేసుకుని, ప్రతి జీవీ తన వంతు పాత్రను నిర్వర్తిస్తోంది. అంతేకాక

వేదాంతం ప్రకారం జీవులన్నీ మరణించిన తర్వాత తిరిగి పునర్జన్మను కూడా పొందుతాయి. ముందుజన్మలో ఏ స్థాయి వరకూ పరిపూర్ణతను సాధించాయో ఆ స్థాయినుంచి మొదలుపెట్టి తర్వాత జన్మలో తమ ప్రయాణాన్ని ఆ పరిపూర్ణత్వపు దిశలో కొనసాగిస్తాయి.

స్వామీజీ ఇలా బోధించారు. *"ఎవరు ఏది చేస్తున్నా, ఆ పరమానందాన్ని పొందాలన్న ఆశతోనే చేస్తున్నారు. అయితే అందరికీ ఈ విషయం పట్ల స్పృహ ఉండదు. అందువలనే, జంతువులకే కాక మనుష్యులకు కూడా ఈ విషయం అర్థం కాదు. 'ఆబ్రహ్మ పిపీలికాది పర్యంతం' అంటే పరబ్రహ్మం నుంచి చిన్న చీమ వరకూ అందరిలోనూ ఈ పరమానందం, దివ్యచైతన్యం నిండుగా నెలకొని ఉంది. నీవు కూడా ఆ అఖండ సచ్చిదానందంలో ఒక భాగానివే. నిజంగా, పరిపూర్ణంగా నేను అదేనని నీవు నమ్మగలిగితే క్షణంలో నీకు భగవత్సాక్షాత్కారం కలుగుతుంది. మనకు దానిని గురించి ప్రత్యక్షంగా తెలియకపోవడం వల్లనే ఇదంతా జరుగుతున్నది."*

స్వామీజీ ఇంకా ఇలా చెప్పారు. *"నీవు భార్య పిల్లల పోషణ కోసం ఉద్యోగం చేస్తూ, ధనం సంపాదించడానికి అమితంగా కష్టపడుతున్నావు. దీనికంతటికీ కూడా చిట్టచివరి గమ్యం బ్రహ్మానందాన్ని పొందడమే. (మనిషి స్థాయిలో) ఈ అంతులేని చిక్కుముడుల మాయాజాలంలో మాటిమాటికీ చిక్కుకుపోయి, కష్టాలు, కడగండ్లతో గట్టిగా దెబ్బతిన్న తర్వాత, మనిషి దృష్టి దానంతట అదే తన నిజస్వభావంవైపు, అంటే అంతరాత్మవైపు మరలుతుంది. హృదయంలో ఆ బ్రహ్మానందాన్ని పొందాలన్న కోరికవల్లనే, ఒకదాని తర్వాత ఒకటిగా గట్టి దెబ్బలను తింటూ, మనిషి తన దృష్టిని తనలోనికే – అంటే తన అంతరాత్మ వైపుకు – మరల్చుతాడు. ప్రతి ఒక్కరికీ ఈ స్థితి కలుగవలసిందే. దీనిలో ఎటువంటి మినహాయింపులూ ఉండవు. అది ఈ జీవితంలోనే కావచ్చు లేదా మరుజన్మలో కావచ్చు లేదా కొన్ని వేల జన్మల తర్వాత కావచ్చు!"*

అయితే అలా పనిచెయ్యడం మనకు సులభంగా తోచకపోవచ్చు. అయితే ఏమైంది? *"పవిత్రత, ఓరిమి, పట్టుదల విజయానికి ఆయువుపట్టులు. వీటన్నింటికీ మించి ప్రేమ!"* అని నాలుగు మాటల్లో స్వామీజీ మనకు విజయానికి మార్గాన్ని బోధించారు కదా!

**యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్ ।**
**తత్సుఖం సాత్త్వికం ప్రోక్తం ఆత్మబుద్ధి ప్రసాదజమ్ ॥ (భగవద్గీత 18.37)**

"ఏదయితే మొదలుపెట్టినప్పుడు విషంలాగా బాధాకరంగా తోచినా, దాని ఫలితాలు అమృతంలాంటి ఆనందాన్ని కలిగిస్తాయో, అటువంటి ఆనందాన్ని సాత్త్వికమైనదని చెపుతారు," అని భగవద్గీతలో చెప్పబడింది. కాబట్టి మనకు గొప్ప ఆనందాన్ని తెచ్చిపెట్టే పనులన్నీ కూడా చేసేటప్పుడు అమితమైన కష్టంతో కూడుకుని ఉంటాయి. వడ్లను దంచి, చెరిగి, శుభ్రం చేసినప్పుడే మనకు మంచి బియ్యం లభిస్తాయి కదా! అలాగే మన కర్తవ్యాన్ని నిర్వహించడంలో నానా బాధలూ ఎదురవుతాయి. అయినా, వాటన్నిటినీ ఓర్చుకుని వదలకుండా పనిచెయ్యడంవల్ల అమృతంతో సమానమైన ఫలితాలు మనకు వస్తాయి.

## 19. ప్రతి కర్తవ్యం గౌరవప్రదమైనదే

*స్వామీజీ ఇంకా ఇలా చెప్పారు: "కర్మయోగ సిద్ధాంతంలో కర్తవ్యం అనేది ఒక భాగం. ...తన విధిని నిర్వర్తించడం ద్వారానే గృహస్థు గొప్పతనాన్ని సాధిస్తాడు. ఒక యోగి ధ్యానం చెయ్యడం ద్వారా ఏ సర్వోత్కృష్ట స్థితిని సాధిస్తాడో, ఒక సైనికుడు తన ఉద్యోగంలో కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ మరణిస్తే అదే గమ్యాన్ని చేరుకుంటాడు. ఈ విధంగా ఒకరికి కర్తవ్యం అయినది మరొకరికి కర్తవ్యం కానవసరం లేదు. అదే సందర్భంలో మరొక విషయాన్ని గమనించండి. 'ఒక కర్తవ్యం మనిషిని లేవనెత్తుతుంది, మరొకటి దిగజార్చుతుంది' అని కర్మయోగ సిద్ధాంతం ఎంతమాత్రం చెప్పడం లేదు. కర్తవ్యం*

*ఏదైనా సరే అది మనిషిని అన్ని సందర్భాలలోనూ లేవనెత్తేదే. అయితే అది అతడి కర్తవ్యం అయి ఉండాలి. దానిని అతడు శ్రద్ధతో నిర్వర్తిస్తూ ఉండాలి. ప్రతి కర్తవ్యానికీ ఒక గౌరవప్రదమైన స్థానం ఉంది. మనం ఎటువంటి పరిస్థితులలో ఉన్నామన్న దాన్ని బట్టి, వాటికి తగినట్టుగా మనకు నిర్దేశించబడిన కర్తవ్యాన్ని శ్రద్ధతో నిర్వర్తించాలి." దీనిలో ఒక విషయాన్ని గమనించాలి. మనం సాధారణంగా గొప్పవని భావించే జపతపాలు ఎటువంటి ఫలితాలను ఇవ్వగలవో, వీధులను ఊడ్చడం, అంట్లుతోమడం లాంటి పనులు కూడా చిత్తశుద్ధితో, నిష్ఠతో చేసినప్పుడు అదే ఫలితాన్ని ఇవ్వగలవు.*

*"ఈ ప్రపంచమనేది ఒక బ్రహ్మాండమైన వ్యాయామశాల. ఇక్కడ మనందరమూ వ్యాయామం చేసి శారీరికంగా, నైతికంగా, మానసికంగా, ఆపైన ఆధ్యాత్మికంగా మరింత బలవంతులం కావాలి" అని స్వామీజీ చెప్పారు.* దీనికి అర్థం ఏమిటి? మనం అభ్యాసం, సాధన చెయ్యడం కోసమే ఈ ప్రపంచం. మనం చెయ్యవలసిన పనిని విసుగు లేకుండా సాధన చెయ్యడానికి ఈ ప్రపంచం మనకు చక్కని అవకాశాన్ని కల్పిస్తుంది. అందులో బోలెడు కష్టాలను మనకు ఎదురయ్యేలా చేసి, వాటన్నింటినీ ఎదుర్కొని, తన పనిని వదిలి పారిపోకుండా ఉండడాన్ని అభ్యాసం చెయ్యడాన్ని నేర్పుతుంది. ఇలా చేసిన కర్తవ్యనిర్వహణే అద్భుతమైన వ్యక్తిత్వాలను నిర్మిస్తుంది. తుదిగా, అదే మనకు పరిపూర్ణతనూ, ముక్తినీ ప్రసాదిస్తుంది.

## 20. పొరుగింటి పుల్లకూర రుచి!

ఈ ప్రపంచంలో పక్కవారు చేసే పని మనకు చాలా గొప్పదిగా కనపడుతుంది. 'పొరుగింటి పుల్లకూర రుచి' అన్నారు కదా! అయితే మన శక్తియుక్తుల్ని అంచనా వేసుకోకుండా, ఎవరో ఏదో చేశారని మనం కూడా అదే చేయడానికి ప్రయత్నించడం అవివేకం. 'పులిని చూసి నక్క వాతలు పెట్టుకుందన్న' సామెత మనకు తెలుసు. వాతలు

పెట్టుకుని శరీరం మీద చారలు వేసుకున్నంత మాత్రాన నక్క పులి అయిపోదు కదా! కాబట్టి దీనికి సమాధానం ఏమిటి? **ప్రస్తుతం మన చేతిలో ఉన్న పనిని సక్రమంగా చేయడమే.**

ఏదైనా పనిలో గొప్పతనాన్ని సాధించినవాడు, అలా చేయగలగడానికి కారణం అతడు చేపట్టిన పని అతడి స్వభావానికి సహజమైనది కావడమే. ఆ పనిలో అతడు చూపే నైపుణ్యం ఒక గొప్ప సౌందర్యాన్ని సంతరించుకుంటుంది. అలాకాక, ప్రక్కవారిని అనుకరించడానికి ప్రయత్నించేవాడు ఘోరమైన పనికిమాలినతనంలో పడిపోతాడు. నిజానికి, అనుకరించాలని ప్రయత్నించే వాడిలో కూడా అతడిదైన ఏదోవొక గొప్ప నైపుణ్యం ఉంది. దానిలో అతడు గొప్పతనాన్ని సాధించగలడు. కానీ దాన్ని విడిచి అతడు వేరే పనిని చేపట్టడం వలన తనలోని నైపుణ్యాన్ని నాశనం చేసుకుంటాడు. పైగా తాను కొత్తగా చేపట్టిన పనిలో ఔన్నత్యాన్ని సాధించలేక జీవితంలో విఫలమవుతాడు.

చరిత్రలో ఇలా అందరూ ఒకే ఆదర్శాన్ని కోరడంవల్ల హాని జరిగిన సందర్భాలు ఏవైనా ఉన్నాయా? ఉన్నాయి. బౌద్ధమతకాలంలో సన్న్యాసం అందరికీ నచ్చిన ఆదర్శంగా తయారైంది. సన్న్యాసమనేది అత్యున్నతమైన ఆదర్శమని మనకు తెలుసు. ఆ కాలంలో సమాజంలో ఎక్కువభాగం సన్న్యసించాలని ప్రయత్నించారు. అయితే అన్నింటినీ విడిచిపెట్టి, సన్న్యసించి, తద్వారా నిస్వార్థగుణాన్ని సాధన చెయ్యడం సమాజంలో అందరికీ సాధ్యం కాదు. ప్రజలలోని భిన్నత్వాన్ని పరిగణనలోనికి తీసుకోకుండా బౌద్ధమతం సన్న్యాసాన్ని అందరికీ ఆదర్శంగా ఇచ్చింది. దానివల్ల ఆచరణాత్మకంగా అది సమాజంలో ఘోరమైన దుష్పరిణామాలకు దారి తీసింది. ఎందుకంటే జనాభాలో అధికశాతం అంత పెద్ద ఆదర్శాన్ని తమ తలకెత్తుకుని, కడదాకా మోసుకొనిపోలేరు. అందుచేత వారు ఆ ఆదర్శాన్ని దిగజార్చి, దానితోపాటు తాము

కూడా దిగజారారు. చరిత్రను చదివితే బౌద్ధమతం పతనమైపోవడానికి ముఖ్య కారణంగా కనిపించేది ఇదే.

స్వామీజీ పై సమస్యకు సనాతన ధర్మం చూపిన పరిష్కారాన్ని ఇలా వివరించారు: *"...ఆ విధంగా బౌద్ధమతం సన్న్యాసమనే పద్ధతినే ప్రధానంగా కలిగిన మతంగా తయారైంది. కానీ హిందూమతం సన్న్యాస సాంప్రదాయాన్ని ఎంతగా గౌరవించినా, కర్తవ్యనిష్ఠ మీదనే విశ్వాసాన్ని నిలిపిన మతంగా నిలబడింది. భగవంతుణ్ణి తెలుసుకునేందుకు అందరికీ వీలైన మార్గంగా కర్తవ్యనిష్ఠను సనాతన ధర్మం చూపించింది."* అలా సనాతన ధర్మం ఆ సమస్యను చక్కగా పరిష్కరించింది.

మరొకప్రక్క, ప్రతి మనిషీ తాను కోరుకున్న బాధ్యతను చేపట్టగలిగే స్థితిని చేరుకోవచ్చును. అలా జీవితంలో అభివృద్ధి చెందాలనీ, పెద్ద బాధ్యతలను పొందాలనీ కోరడం తప్పుకాదు. అయితే, అందుకోసం నేరుగా దాన్ని చేపట్టడం కాక, ప్రస్తుత కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చడమే మార్గమని స్వామీజీ విడమరచి చెప్పారు. *"ప్రతివాడూ ఒక మహారాజులాగా సింహాసనం మీద కూర్చోవడానికి తాను సమర్థుణ్ణని అనుకుంటాడు. అతడు సమర్థుడే కావచ్చు. అయినా, ప్రస్తుతం తానున్న స్థితిలో, తన బాధ్యతను చక్కగా నిర్వర్తించగలిగానని అతడు ముందు నిరూపించుకోవాలి. అప్పుడు మాత్రమే మరింత పెద్ద బాధ్యతలు అతడికి అప్పగించబడతాయి."* కాబట్టి ఈ క్షణంలో మనకున్న బాధ్యతను ఎంత చక్కగా చేస్తున్నామన్నదే అత్యంత ముఖ్యమైన విషయం. అలా పనిచేస్తూ, మనం చేపట్టిన ఆదర్శాన్ని అంచెలంచెలుగా ఎదగనివ్వాలి. నిజానికి గొప్పగొప్ప అవకాశాలు శ్రమతో సాధించవలసిన పనుల రూపంలో, తక్షణ కర్తవ్యాలుగా మనకు ఎదురవుతాయి. అయితే వాటినుంచి మనం తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాము. అలా కాక అటువంటి పని రూపంలో మనకు అవకాశం వచ్చిందని గ్రహించడమే ఔన్నత్యానికి మార్గం.

# 21. వ్యక్తిస్థాయిలో కర్తవ్యనిష్ఠను అభ్యాసం చెయ్యడం కోసం నాలుగు ఆశ్రమాలు

సామాజిక వ్యవస్థ సజావుగా ముందుకు నడుస్తూండగానే, ఆ సమాజంలోని వ్యక్తులు తమతమ కర్తవ్యాలను చక్కగా నిర్వహిస్తూనే మతం బోధించే ఉన్నత స్థితులను పొందగలగాలి. ఇది సాధ్యమవుతుందా? భారతదేశపు సనాతన ధర్మం ఇది చక్కగా సాధ్యమవుతుందని బోధిస్తుంది.

ఆ గృహిణి తాను ఇంటిలో నిర్వర్తిస్తున్న కర్తవ్యాలను చక్కగా నిర్వర్తించడం ద్వారా ఉన్నతస్థితిని పొందిందనీ, ధర్మవ్యాధుడు తాను నిర్వహిస్తున్న వృత్తిని దేవుడి ఆరాధనతో సమానంగా భావించి, దానిని సక్రమంగా నిర్వర్తించి ఎలా ఉన్నతస్థితిని పొందాడో మనం గమనించాము.

వేదాంతం మానవులలో సహజంగా, పుట్టుకతో ఏర్పడే వైవిధ్యాన్ని అంగీకరించి వారివారి అభిరుచులకు తగినట్టు అనేకమైన – నిజానికి అసంఖ్యాకమైన – ఆదర్శాలను కల్పించింది. తాము చేసే పనిని, అది చివరకు ఎంత సాధారణంగా కనిపించేదైనా సరే, శ్రద్ధతో నిష్ఠతో చేస్తే అది మనిషికి పరిపూర్ణతను ఇస్తుందనీ, అదే అతడికి బ్రహ్మాండమైన వ్యక్తిత్వాన్ని ఇవ్వగలదనీ, చిట్టచివరిగా దివ్యత్వానికి చేర్చగలదనీ కూడా చెప్పింది. సమాజంలోని రకరకాల వ్యక్తులు రకరకాల మనస్తత్వాలను కలిగి ఉంటారు. వారికి వేరువేరు స్థాయులలో కోరికలు కూడా ఉంటాయి. అవి కామసుఖాలు కావచ్చు, సంతానం కావచ్చు, ఆస్తిపాస్తులు కావచ్చు, సంఘంలో పేరుప్రఖ్యాతులు, గౌరవాధికారాలు కావచ్చు. వాటన్నింటినీ వారు ఉన్నట్టుండి ఒక్కసారిగా వదిలిపెట్టలేరు. అంతమాత్రంచేత వారికి పరిపూర్ణత పొందే అవకాశం ఉండదని మన ధర్మం చెప్పలేదు. ధర్మబద్ధంగా కోరికలను తీర్చుకుంటూ, సాధారణంగా మనిషి కోరదగ్గ

సుఖసంతోషాలను పొందుతూనే, పరిపూర్ణతను సాధించడం కోసం నాలుగు ఆశ్రమాల వ్యవస్థను సనాతన ఋషులు ఏర్పరిచారు. తానున్న పరిస్థితిలో తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించడం కోసం, మనిషి కోరికలను అదుపులో ఉంచుకోవడాన్ని సాధన చేస్తూ, ఒక్కొక్క మెట్టే పైకెక్కుతున్నట్టుగా ఒక్కొక్క ఆశ్రమాన్నే దాటుతూ, క్రమక్రమంగా పరిణతి సాధిస్తూ చివరికి ముక్తిని పొందుతాడు. అయితే మనిషి తానున్న ఆశ్రమంలో, తన తక్షణ కర్తవ్యాన్ని గొప్ప క్రమశిక్షణతో నిర్వహించాలి!

ఈ సందర్భంలో స్వామీజీ, *"బ్రహ్మచర్యాశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమం, చివరిగా సన్న్యాసాశ్రమం అనే నాలుగు ఆశ్రమాలు ఏర్పరచబడ్డాయి. ముందుగా ఒకడు విద్యార్థి దశలో ఉన్నప్పుడు అతడికి బ్రహ్మచర్యాశ్రమానికి సంబంధించిన విధులు ఇవ్వబడ్డాయి. వివాహం తర్వాత అతడు ఒక గృహస్థుగా తన జీవితాన్ని గడుపుతాడు. వృద్ధాప్యంలో అన్ని కోరికలనూ విడిచిపెట్టి, తన బరువుబాధ్యతల నుంచి విశ్రాంతి తీసుకుని వానప్రస్థ ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. చివరిగా ఈ ప్రపంచాన్ని విడిచి సన్న్యసిస్తాడు. ఈ నాలుగు ఆశ్రమాలకూ సంబంధించిన వేర్వేరు కర్తవ్యాలు బోధించబడ్డాయి"* అని వివరించారు.

అయితే ఈ వ్యవస్థ ఎల్లప్పుడూ అలా నిలిచి ఉండలేదు. *"కాలక్రమేణా ఈ నాలుగు ఆశ్రమాలలో రెండు ఆశ్రమాలే ఆచరణలో మిగిలాయి. అవి ఒకటి గృహస్థాశ్రమం, రెండవది సన్న్యాసాశ్రమం. ఒక గృహస్థు వివాహం చేసుకొని దేశపౌరుడిగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాడు. ఒక సన్న్యాసి వివాహం చేసుకోకుండా తన పూర్తి కాలాన్ని ఆధ్యాత్మిక సాధనల కోసం వెచ్చిస్తాడు, భగవంతుడి గురించి బోధించడానికి, భగవంతుణ్ణి ఆరాధించడానికి పాటుపడతాడు"* అని స్వామీజీ వివరించారు. అంతేకాక, *"వీటి నాలుగింటిలోనూ ఏదీ మరొకదానికన్నా గొప్పది కాదు. దేనికదే గొప్పది.*

ఒకదానితో మరొకదాన్ని పోల్చడానికి వీలులేదు” అని స్వామీజీ ఘంటాపథంగా చెప్పారు.

## 22. సామాజిక స్థాయిలో కర్తవ్యనిష్ఠను అభ్యాసం చెయ్యడం కోసం నాలుగు వర్ణాలు

వ్యక్తిగత జీవితంలో నాలుగు ఆశ్రమాల ద్వారా మనిషి పరిణామం సాధించినట్టే, సమాజంలో కూడా మనిషి పూర్తి స్వేచ్ఛతో పరిణతి చెందడానికి అవసరమైన వ్యవస్థను సనాతన ధర్మం కల్పించింది. స్వామీజీ ఇలా చెప్పారు: ‘‘*భగవద్గీతలో మనిషి యొక్క పుట్టుకను, స్థానాన్ని బట్టి అతడికి కర్తవ్యం నిర్దేశించబడుతుంది అని తరచుగా చెప్పడాన్ని మనం చూస్తాము. జీవితంలోనూ, సమాజంలోనూ మన పుట్టుకను, స్థానాన్నీ బట్టి జీవితంలోని రకరకాల విషయాల పట్ల మనుష్యులకు ఉండే మానసిక నైతిక ప్రవృత్తి ఆధారపడుతుంది. కాబట్టి మనం ఏ సమాజంలో పుట్టామో దానియొక్క ఆదర్శాలనూ, వృత్తివ్యాపారాలనూ అనుసరించి మనకు నిర్దేశించబడిన పనిని చేసినప్పుడు అది మనల్ని గొప్పవారిగా తీర్చిదిద్దుతుంది. అదే మన కర్తవ్యంగా చెప్పబడుతుంది.*”

**చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణ కర్మ విభాగశః । (భగవద్గీత 4.13)**

గుణాలను బట్టి, పనిచేసే పద్ధతిని బట్టి మనుష్యులు నాలుగు వర్ణాలుగా విభజించబడ్డారు. ఇవి బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. (ఇవి ప్రస్తుత సమాజంలో మనం చూస్తున్న కులాలు కావు.)

వేదాలలో ఈ వర్ణాల గురించి ఏమి చెప్పబడిందో ఇప్పుడు స్వామీజీ మాటలలో చూద్దాము. “*భగవంతుణ్ణి సాక్షాత్కరించుకున్నవాడే బ్రాహ్మణుడు (బ్రహ్మను ఎరిగినవాడు) అని వేదాలు చెపుతున్నాయి. తన ప్రజల సంరక్షణ బాధ్యతను చేపట్టేవాడు*

క్షత్రియుడు. వృత్తి వ్యాపారాల ద్వారా తన జీవనోపాధిని పొందేవాడు వైశ్యుడు" అని చెపుతూ, "ఈ వర్ణాలు స్వాభావికంగా ఒకే దృక్పథం, ధోరణి ఉన్న వ్యక్తులు జతకూడడం వల్ల ఏర్పడినవే గానీ మరొకటి కాదు. అవి అన్ని కాలాలలోనూ మానవజాతికి అమూల్యమైన వ్యవస్థలుగానూ, దానిని ఉన్నతస్థితులకు లేవనెత్తే సోపానాలుగానూ పనిచేశాయి" అని వివరించారు. ఈ నాలుగు వర్ణాల వారి విధులేమిటో భగవద్గీతలోని 18వ అధ్యాయంలో 42, 43, 44 శ్లోకాలలో చెప్పబడ్డాయి.

జీతానికి ఉద్యోగం చేసేవారెవరూ బ్రాహ్మణులు కాజాలరు. శాంత స్వభావం, ఆత్మనిగ్రహం, తపస్సు, శౌచం, క్షమ, నిష్కపటం, విశ్వాసం, జ్ఞానం, విజ్ఞానం బ్రాహ్మణులకు ఉండవలసిన లక్షణాలు. బ్రాహ్మణులు తాము విద్య నేర్చుకుని, తెలివితేటలను పెంచుకుని, సమాజానికి ఉచితంగా విద్య నేర్పాలి. తాముగా ఆదర్శవంతమైన, సరళమైన, నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతూ, ధనాపేక్ష లేకుండా జీవిస్తూ, అందరిపట్ల ప్రేమ చూపుతూ, సనాతనధర్మం అందించిన సత్యాలు కలకాలం నిలచి ఉండేలా చూడడమేకాక, వాటిని తానుగా జీవితంలో ఆచరించి చూపి, తద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించడానికి కృషి చెయ్యాలి. వారు నిస్వార్థమైన, నిష్కళంకమైన జీవితాన్ని గడపాలి. సాధారణ ప్రజలు 'ఆచరణసాధ్యం కావు' అనుకునే గొప్ప లక్షణాలను బ్రాహ్మణుడు తన జీవితంలో ఆచరించి చూపి సమాజానికి మార్గదర్శనం చేస్తాడు. తన జీవితాన్ని పూర్తిగా త్యాగం చేసి, మిగిలిన సమాజం పరిపూర్ణత్వాన్నీ, మోక్షాన్నీ పొందేందుకు సహాయం చెయ్యడం బ్రాహ్మణుడి యొక్క తప్పనిసరి కర్తవ్యం.

క్షత్రియులు అంతులేని శౌర్యం, అమితమైన శారీరికశక్తి, అఖండమైన సంకల్పశక్తి, పనిచెయ్యడంలో గొప్ప సామర్థ్యం, యుద్ధంలో వెన్నుచూపి పారిపోకుండా ఉండడం మొదలైన లక్షణాలను కలిగి ఉండాలి. "ఛాతీ మీద కత్తి గాయపు మచ్చ ఉన్నవాడే

నిజమైన క్షత్రియుడు కానీ వీపు మీద ఉన్నవాడు కాదు" అని సామెత. అంటే చావును ధైర్యంగా ఎదుర్కొనేవాడు, వెన్ను చూపి పారిపోనివాడు అని అర్థం. అదే విధంగా సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేవాడు, దేశప్రజల మేలు కోసం అనుక్షణం తన తలను పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉండేవాడే నిజమైన క్షత్రియుడు.

వైశ్యుడు సమాజానికి కావలసిన సంపదనంతా ఉత్పత్తి చేస్తాడు. వ్యవసాయం, పశువుల పెంపకం, పరిశ్రమలు, వ్యాపారం - వీటిని నడిపేవారందరూ వైశ్యుల కోవకు చెందినవారౌతారు. మాట మీద నిలబడడం, ఏ విషయంలోనైనా సరే ఏ మాత్రం రాజీ పడకపోవడం వీరికి ఉండవలసిన ముఖ్యలక్షణాలు. "ప్రాణం పోయినా ఫరవాలేదు కానీ ఇచ్చినమాట నిలబెట్టుకోలేకపోతే సమస్తం పోయినట్టే" అన్న భావన వీరి నరనరాలలో ఉండాలి. మానమర్యాదలు పోగొట్టుకున్న మనిషి జీవచ్ఛవంలా బ్రతకవలసి వస్తుంది కదా.

చివరిగా జీతం తీసుకుని పనిచేసేవారందరూ శూద్రుల కోవకు చెందిన వారౌతారు. వీరు పనిచేయడంలో గొప్పశక్తిని కనపరచేవారై ఉంటారు. పనులు చేయడం లో వీరు అలుపెరుగని శక్తిసామర్థ్యాలు చూపగలిగి ఉంటారు. తాను తీసుకునే జీతానికి తగిన పనిని సకాలంలో, లోపరహితంగా పూర్తి చేస్తారు. తనకు ఇవ్వబడిన పనిని చెప్పింది చెప్పినట్టుగా, గొప్ప విధేయతతో చేయడమే ఈ వర్ణం యొక్క ముఖ్యలక్షణం.

మనం సంఘంలో రకరకాల మనుష్యులను చూసినప్పుడు, పైన పేర్కొనబడిన నాలుగు వర్ణాల యొక్క లక్షణాలను, వారు వేర్వేరు మోతాదులలో కలిగివుండడం కనిపిస్తుంది. సాధారణమైన మానవులు ఒక్కసారిగా ఉన్నతమైన ఆదర్శాలతో నిండిన నిస్వార్థజీవితాన్ని గడపలేరు. వారు ఇతరుల ఆదేశాలకు లోబడి పనిచేస్తూ, ధర్మబద్ధమైన జీవితం ద్వారా, ఆ స్థాయిలో తమ పనిని ఉత్తమంగా చేసినప్పుడు మరింత ఔన్నత్యాన్ని సాధించి నిస్వార్థమైన జీవితాన్ని గడపగలిగే ఉన్నతస్థాయికి ఎదుగుతారు. కాబట్టి వర్ణాలను ఒకదానికొకటి సంబంధంలేని గదులుగా కాక, వ్యక్తులు క్రమక్రమంగా ఎదిగే

సోపానాలుగా భావించాలి. అందరికీ సమానావకాశాలు ఇచ్చేందుకు ఏర్పరచిన వ్యవస్థగా దీనిని అర్థం చేసుకోవాలి.

## 23. ఈ వర్ణాల సమగ్ర సమ్మేళనమే సమసమాజానికి పునాది!

పై వర్ణాల లక్షణాలను మనం పరిశీలించినప్పుడు ఒక్కొక్కరిలో ఒక్కొక్క గొప్ప గుణం కనిపిస్తుంది. అంతేకాక పైన వర్ణించిన నాలుగు వర్ణాల లక్షణాలు వేర్వేరు మోతాదులలో అందరు మనుష్యులలోనూ కనిపిస్తూ ఉంటాయి. (సత్త్వము, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలలాగానే.) ఐతే ఏ లక్షణం ఒక మనిషిలో ఎక్కువ మోతాదులో కనిపిస్తుందో ఆ మనిషి జీవితంలో ఆ విధమైన పనులు చేయడానికే ఇష్టపడతాడు. ఒకే కుటుంబంలో ఇలా వేర్వేరు లక్షణాలు ఉన్నవారు పుట్టవచ్చు. ఒకే మనిషి తాను చేసే రోజువారీ పనులలో ఒక్క రోజులోనే ఈ నాలుగు రకాల లక్షణాలనూ ప్రదర్శించవచ్చు. మరొకవైపున, జన్మించిన కుటుంబంతో ఈ లక్షణాలను ముడిపెట్టడానికి వీలులేదు.

ఒక వస్త్రాన్ని తయారు చెయ్యడానికి రకరకాల రంగులున్న కొన్నివేల దారాలను ఉపయోగిస్తారు. వాటిలో ఏ ఒక్క దారమైనా మిగిలిన దారాలకన్నా గొప్పది అవుతుందా? ఒక రంగు దారం మరొక రంగు దారం కన్నా గొప్పదవుతుందా? కాదు. దేని స్థానంలో అది అవసరం. నిజానికి ఏవొక్క నూలుపోగు తగ్గినా, తెగిపోయినా, రంగు వెలసిపోయినా గుడ్డ మొత్తం అందవిహీనంగా తయారవుతుంది.

సప్తవర్ణాలు కలిసినప్పుడు శ్వేతవర్ణం ఏర్పడుతుందని మనందరికీ తెలుసు కదా! సమాజంలోని వ్యక్తుల వ్యవస్థ ఇటువంటిదే. వివిధ రంగాలలోని వ్యక్తులు తమతమ పనుల్ని చక్కగా నిర్వహించాలి. వారందరి పనుల సమ్మేళనం సమాజాన్ని ముందుకు తీసుకుపోతుంది. సమాజంలోని వ్యక్తులు తమతమ పనుల్ని అవి గొప్పవా, తక్కువవా అని చూడకుండా శ్రద్ధగా నిర్వహించినప్పుడు ఆ సమాజం సమగ్రమైన అభివృద్ధిని

సాధిస్తుంది. అంతేకాక తమ తోటివారు చేస్తున్న పనులు గొప్పవా కావా అని న్యాయనిర్ణయం చేసే హక్కు కూడా ఎవరికీ లేదు.

## 24. నాలుగు పురుషార్థాలనే ఆదర్శం

మనిషిగా పుట్టిన వాడికి చతుర్విధ పురుషార్థాలు అనే నాలుగు ఆదర్శాలు ఉంటాయని సనాతనధర్మం బోధించింది. అవి ధర్మం, అర్థం, కామం, మోక్షం. ప్రతి మనిషీ తన జీవితంలో ఈ నాలుగు ఆదర్శాలనూ సాధించడానికి ప్రయత్నించాలి. సాధారణ మానవులు ఎక్కువగా అర్థకామాలను గురించి ఆలోచిస్తూ, వాటినే సాధించాలని ప్రయత్నిస్తూ ఉంటారు. అలా చేయడం తప్పు కాదు. కానీ ఆ ప్రయత్నం ధర్మానికి లోబడి ఉండాలి. ధర్మాన్ని అనుసరించడం వల్ల మనిషి అవినీతికి పాల్పడకుండా, మొక్కవోని దీక్షతో తన కర్తవ్యాన్ని నిర్వహిస్తాడు. పైగా నలుగురికీ సహాయపడుతూ, అందరూ తనలాగే సుఖపడాలని కోరుకుంటాడు. అందువల్ల సమాజంలో అందరికీ అర్థం, కామం సమానంగా లభించి, ఒక సమసమాజం నిర్మితమౌతుంది. ఆపైన, ఇటువంటి సత్–సమాజంలోని ప్రజలు సత్ప్రవర్తనతో నాలుగవ పురుషార్థమైన మోక్షం కోసం ప్రయత్నిస్తారు. ఈ విధంగా సమాజంలో అన్ని వర్ణాలవారూ, తాము చేసే పనులను నిష్ఠతో చెయ్యడం ద్వారా, ఈ నాలుగు పురుషార్థాలనూ పొందడమే కాక, ఆపై పరిపూర్ణతను సాధిస్తారు.

## 25. ఏకత్వానికి భిన్నత్వాన్ని కలిగించడమే సృష్టి ప్రణాళిక

ఒక బాటసారి అడవిదారిలో నడచిపోతున్నాడు. ఎండకు తాళలేక ఒక మర్రిచెట్టు క్రింద ఆగి విశ్రాంతి తీసుకుందామనుకున్నాడు. ఆ చెట్టు క్రింద ఆగి, అటుయిటూ చూస్తున్నప్పుడు అతడికి చెట్టు మీద ఎర్ర రంగులో ఉన్న చిన్నచిన్న మర్రికాయలు

కనిపించాయి. ఆ ప్రక్కనే నేలమీద ప్రాకుతున్న పెద్ద గుమ్మడి తీగకు పెద్దపెద్ద గుమ్మడికాయలు కనిపించాయి. వాటిని చూసినప్పుడు అతడికి తాను చిన్ననాట నేర్చుకున్న పాఠం గుర్తుకు వచ్చింది. ఈ సృష్టిలో అన్నింటినీ భగవంతుడే తయారుచేశాడన్నదే ఆ పాఠం. కానీ ఇప్పుడు ఆ పాఠం అంత తెలివిగలదిగా తోచలేదు. 'ఆ దేవుడు అంత పెద్ద మర్రిచెట్టుకి చిన్నచిన్న కాయలు పెట్టాడెందుకు, నేలమీద ప్రాకుతున్న ఆ చిన్న గుమ్మడిపాదుకి అంత పెద్దపెద్ద కాయలు పెట్టాడెందుకు?' అని అనుకున్నాడు. ఇంతలో నిద్ర ముంచుకువచ్చి ఆ మర్రిచెట్టు క్రింద పడుకుని కునుకుతీశాడు. కొంతసేపటి తర్వాత లేచి చూసుకుంటే అతని మీద, అతని చుట్టూ మర్రికాయలు రాలి కనిపించాయి. ఒక్కసారిగా ఆ బాటసారికి కళ్ళుతెరుచుకున్నాయి. 'ఈ మర్రిచెట్టుకే గనుక నేననుకున్నట్లు గుమ్మడి కాయలంత కాయలు ఉండి, అవి నామీద పడితే నేనేమయిపోయేవాణ్ణో కదా' అనుకున్నాడు. 'కాబట్టి ఈ సృష్టిలో కనిపించే ప్రతి వైవిధ్యానికి మనకు తెలియని ఏదోవొక అర్థం ఉండే ఉంటుంది' అని గ్రహించాడు.

*"ఈ సృష్టి యొక్క ప్రణాళికే భిన్నత్వం వెనుక ఏకత్వం. జీవులు ఎంత వైవిధ్యాన్ని చూపినా వారి వెనుక ఏకత్వం ఉంది."* అని స్వామీజీ చెప్పారు. సృష్టి ఆ ఏకత్వం నుంచి భిన్నత్వాన్ని సృష్టిస్తుంది. దానివల్ల మనుష్యులు పుట్టుకతోనే వేర్వేరు శక్తిసామర్థ్యాలతో పుడతారు. అందరిలోనూ ఒకే శక్తి నిక్షిప్తమై ఉందన్నమాట నిజమే, కానీ అది అందరిలో ఒకే విధంగా వ్యక్తీకరణ పొందదు. అందరూ అన్ని విషయాలనూ ఒకే విధంగా, ఒకే వేగంతో అర్థం చేసుకోలేరు. కొంతమంది త్వరగా పురోగతి సాధిస్తారు. కొందరు నెమ్మదిగా సాధిస్తారు. *"ఒకరికి ఒకసారి చెపితే అర్థమయ్యేది మరొకరికి పదిసార్లు చెప్పవలసి రావచ్చు. అయితే అలా విద్య నేర్పేందుకు అవసరమైన ఏర్పాటును సమాజం కల్పించాలి. అదే నా దృష్టిలో న్యాయం!"* అని స్వామీజీ చెప్పారు.

ఆధునిక సమాజంలో ఒక పెద్ద సమస్య ఇది. దేనితోనో మనుష్యులు తమనుతాము పోల్చుకుని తాము తక్కువవారమనే ఆత్మన్యూనతాభావంతో బాధపడుతూ ఉండడం మనం అన్నిచోట్లా చూడవచ్చు. అంతేకాక, అలాంటి పోలికలతో ఇతరులను తక్కువచేసి మాట్లాడుతూ ఉండేవారు కూడా కనిపిస్తూనే ఉంటారు. ఇవి రెండూ సరికావు. మనల్ని మనం వేరెవరితోనూ పోల్చుకోకూడదు. ఎందుకంటే మనలో ప్రతివొక్కరూ ఒక ప్రత్యేకమైన వ్యక్తి. అలాగే సమాజంలోని వ్యక్తుల్ని ఒకరితో ఒకరిని పోల్చకూడదు. *"అందరికీ ఒకే కొలతల చొక్కాలను తొడగడానికి ప్రయత్నించడం అవివేకం"* అని స్వామీజీ చెప్పారు!

*"మనం జీవులలో చూసే రకరకాల వ్యక్తిత్వాలు, వర్గాలు సృష్టిలో సంభవించిన స్వాభావికమైన రూపాంతరాలే. అందుచేత వారందరి శక్తిసామర్థ్యాలనూ కొలవడానికి ఒకే కొలబద్ద (స్కేలు) ఉపయోగించకూడదు. వారందరి మీద ఒకే ఆదర్శాన్ని రుద్దకూడదు. ఎందుకంటే స్వాభావికంగా విభిన్నమైన శక్తిసామర్థ్యాలున్న వారందరినీ ఒకే లక్ష్యసాధనకు నిర్దేశించడంవల్ల వారి మధ్య కృత్రిమమైన లేదా అసహజమైన పోటీ నెలకొంటుంది. అందులో నెగ్గలేక మనిషి తనను తాను ద్వేషించుకోవడం మొదలుపెడతాడు. (ప్రపంచాన్ని కూడా ద్వేషించడం మొదలుపెడతాడు.) అందుచేత సాధువుగానూ, మంచివాడుగానూ తయారుకాలేకపోతాడు. ప్రతి ఒక్కరికీ వారివారి శక్తిసామర్థ్యాలకు తగినట్టు వేర్వేరు స్థాయులలో ఉన్న ఆదర్శాలను చూపాలి. ఆ ఆదర్శాన్ని సాధించడం కోసం పనిచేస్తూ ఆ ఆదర్శాన్ని అత్యున్నత సత్యానికి వీలయినంత దగ్గరగా తీసుకుపోవడానికి ప్రయత్నించాలి."*

*"కాబట్టి సమాజంలోని ప్రతి ఒక్కరినీ తనకు నచ్చినదీ, తాను అత్యున్నతమైనదనీ అనుకున్న ఆదర్శాన్ని అందుకునేందుకు తీవ్రంగా కృషి చెయ్యమని సమాజం ప్రోత్సహించాలి. అదే సమయంలో ఆ ఆదర్శం పరమసత్యానికి అత్యంత చేరువలో*

*ఉండే విధంగా జాగ్రత్త తీసుకోవడాన్ని నేర్పాలి"* అని స్వామీజీ బోధించారు. దీనివల్ల అందరికీ సమానావకాశాలు లభిస్తాయి.

## 26. కర్తవ్య భావన - స్త్రీ పురుష సమానత్వం

ఈ సృష్టి యొక్క ప్రణాళిక ఏకత్వం నుంచి భిన్నత్వాన్ని తయారుచేయడమని ఇంతకు ముందు చదివాము. పురుషులూ, స్త్రీలూ ఒకే జాతికి చెందిన వారయినా వారి మధ్య గొప్ప వైవిధ్యం ఉంది. మనం స్త్రీపురుషులలో చూసే రకరకాల వ్యక్తిత్వాలు, వర్గాలు సృష్టిలో సంభవించిన స్వాభావికమైన రూపాంతరాలే. అందుచేత మనం వారందరినీ ఒకే కొలబద్దతో పరీక్షించకూడదు. వారందరికీ ఒకే ఆదర్శాన్ని విధించకూడదు.

ఇదే సందర్భంలో స్త్రీ పురుష సమానత్వం గురించి కొంత చెప్పుకోవాలి. ఎందుకంటే ఈ ఆధునిక సమాజంలో స్త్రీ పురుష సమానత్వం అనే భావన తప్పుదోవ పడుతోంది. స్త్రీ పురుషులిద్దరూ ఎవరి స్థానంలో వారు గొప్ప. ఇరువురికీ ఒకే స్థాయిలో గౌరవాన్ని ఇవ్వాలి. ఒకరినొకరు గౌరవించుకోవాలి. అదే సమానత్వం. కానీ స్త్రీ పురుషులిద్దరూ సమానమని చెప్పి, ఇరువురూ ఒకే పనులు చెయ్యాలనీ, ఒకరితో ఒకరు పోటీ పడాలనీ, ఒకరు చేసిన పనిని రెండవవారు కూడా చేసి చూపడంలోనే గొప్పతనం ఉందనీ నవసమాజం అనుకుంటోంది. ఇదే భావన మరికొంత వెర్రితలలు వేసినప్పుడు స్త్రీలు పురుషులలాగా, పురుషులు స్త్రీలలాగా కనిపించడానికి ప్రయత్నించడం, ఇంకా దాని పర్యవసానాలు కూడా సమాజంలో కనిపిస్తున్నాయి.

అయితే స్త్రీపురుషుల కర్తవ్యాలు ఒకటి కాలేవు. స్త్రీపురుషులు ఇరువురూ మానవ జాతికే చెందినవారైనా, శరీరధర్మపరంగానే కాక మానసికంగానూ, ప్రవర్తన పరంగానూ కూడా భిన్నంగా ఉంటారు. స్వామీజీ స్త్రీపురుషులకు వేర్వేరు ఆదర్శాలు ఎందుకు ఉండాలో చక్కగా వివరించారు.

*"ప్రతి మనిషి తనదైన కర్తవ్యాన్ని ఎన్నుకుని దాన్ని సాధించడానికి ప్రయత్నించాలి. మనిషి తానెప్పటికీ సాధించలేని ఇతరుల ఆదర్శాలను చేపట్టి భంగపడడం కంటే తనదైన ఆదర్శాన్ని నిర్వర్తించడమే ప్రగతిని సాధించడానికి సులువైన త్రోవ. ఉదాహరణకు ఒక చిన్నపిల్లవాడికి ఇరవై మైళ్ళు నడవమని చెప్పండి. వాడు చనిపోవడం ఖాయం. లేకపోతే నూటికో, కోటికో ఒకడు పాకుతూ ఆ ఇరవై మైళ్ళు దాటినా, సగం చచ్చి, కొనప్రాణంతో గమ్యానికి చేరతాడు. సాధారణంగా మనం ప్రపంచంతో ఇలానే పనిచెయ్యాలని చూస్తాం. ఏ సమాజంలోనైనా సరే స్త్రీపురుషులందరూ ఒకే మనస్సుతోనూ, (శరీరబలంతోనూ), పనిచేసే సామర్థ్యంతోనూ ఉండరు. కాబట్టి వారికి వేర్వేరు ఆదర్శాలను చూపాలి. ఈ విషయంలో ఏ ఆదర్శాన్నైనా చిన్నచూపు చూసే హక్కు మనకు లేదు. ప్రతి ఒక్కరినీ వారి సొంత ఆదర్శాన్ని సాధించేందుకు పాటుపడనివ్వండి. ఒకరి ఆదర్శాన్ని మరొకరి ఆదర్శంతో పోల్చి చూడడం ఎంతమాత్రం సరికాదు. మామిడిచెట్టును వేపచెట్టుతో పోల్చకూడదు. వేపచెట్టును మామిడిచెట్టుతో పోల్చకూడదు. మామిడిచెట్టు మంచిచెడులు మామిడిచెట్టువైతే, వేపచెట్టు మంచిచెడులు వేపచెట్టువి."*

నోబెల్ బహుమతిని పొందిన డాక్టర్ అలెక్సిస్ కారెల్ అనే అమెరికన్ వైద్యుడు ఏమి చెప్పారో చూడండి. "స్త్రీపురుషుల మధ్య ఉన్న తేడాలు వారి స్వభావానికి సంబంధించినవి. అవి చాలా లోతైనవి. ఈ ప్రాథమిక సత్యాలను తెలుసుకోలేని అజ్ఞానం వల్లనే నేటి స్త్రీస్వాతంత్ర్యవాదులు స్త్రీలకు, పురుషులకు ఒకే రకమైన విద్య, అధికారాలు, బాధ్యతలు ఉండాలని వాదిస్తున్నారు. నిజానికి స్త్రీ పురుషుడి కంటే ఎంతో భిన్నంగా ఉంటుంది. నిజానికి ఆమె శరీరంలోని ప్రతి కణము పురుషుడి శరీరంతో విభేదిస్తుంది. ఆమె శరీరపు ప్రతికణంలోనూ ఆమె స్త్రీ అన్న మాట వ్రాసి ఉంటుంది. ఈ శరీరతత్త్వ నియమాలు, ఖగోళనియమాలలాగా నిర్దాక్షిణ్యంగా, ఖచ్చితంగా పనిచేస్తాయి.

మానవుల ఇష్టాయిష్టాలతో వాటిని మార్చడం సాధ్యం కాదు. స్త్రీలు తమ స్వభావానికి తగినట్లుగా వారి శక్తియుక్తులను పెంపొందించుకోవాలి. పురుషులను అనుకరించడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. నిజానికి మానవచరిత్రలో, మానవనాగరికత యొక్క పురోగతిలో, మానవజాతి యొక్క పరిణామంలో స్త్రీ పోషించిన పాత్ర అమూల్యమైనది." (స్టూడెంట్ పవర్ - ఇట్స్ యూస్ అండ్ అబ్యూస్ - అన్న శ్రీ హర్షానంద స్వామివారి పుస్తకంలో ఉదహరించబడింది.)

వివేకానంద స్వామి స్త్రీల అభ్యున్నతి గురించి మాట్లాడుతూ, "*పక్షికి ఒకే రెక్కతో ఎగరడం ఎలా సాధ్యం కాదో అలాగే స్త్రీలు పురోగతిని సాధించనిదే మానవజాతి పురోగమించదు*" అని స్పష్టం చేశారు. కాబట్టి, బింబప్రతిబింబాలలాంటి కుడిఎడమ రెక్కలు రెండూ చక్కగా పనిచేసేవిగా ఉండవలసిందే! అప్పుడే పక్షి చక్కగా ఎగురగలుగుతుంది.

సమాజంలోని వ్యక్తులందరూ ఒక్కసారిగా తమతమ కర్తవ్యాల మీద గౌరవాన్ని కోల్పోయి ఇతరుల కర్తవ్యాల కోసం ఎగబడితే ఏమవుతుందో ఊహించండి! స్త్రీ పురుషుల విషయంలోనూ అంతే. కర్తవ్య నిర్వహణలో ప్రతిసారీ మనం కోరుకున్న పని, ఉద్యోగం మనకు లభించకపోవచ్చును. అంతమాత్రాన మన చేతిలో ఉన్న పనిని, ప్రకృతి మనకు సహజసిద్ధంగా విధించిన పనిని విస్మరించకూడదు.

## 27. ప్రత్యేకతను సాధించడమే విజయరహస్యం

"ఈ సృష్టి చేసే పని ఏకత్వానికి భిన్నత్వాన్ని కల్పించడమే!" అన్న సూత్రాన్ని అనుసరించి ఆ మార్గంలో పరిపూర్ణత సాధించమని ప్రకృతి మనల్ని నిర్దేశిస్తోంది. అందువల్ల మనం చేస్తున్న వృత్తిలో అందరికంటే ఉత్తమంగా పనిచెయ్యడం ద్వారా దానిలో మరింత సమర్థతనూ, కొత్తదనాన్నీ చూపాలి. ఇతరులకన్నా విభిన్నమైన

మార్గాన్ని ఎంచుకోవాలి. దానివల్ల సమాజంలో మనకు సరైన స్థానం లభిస్తుంది, ఇతరులతో పోటీపడవలసిన అవసరం, వారిని అణచివేయవలసిన అవసరం, వారిచేత అణచివేయబడే అగత్యం మనకు కలుగవు. ఇలా చేసినప్పుడు మనం సమాజానికి, సమాజం మనకు పరస్పరం ఉపయోగపడతాము.

దీని కోసమే చదువులోనూ, ఉద్యోగాలలోనూ, ఇతర విషయాలలోనూ మనల్ని స్పెషలైజేషన్ చెయ్యమని చెపుతారు. (అంటే ప్రత్యేకమైన అంశాన్ని ఎంచుకుని దానిలో మరింత నైపుణ్యాన్ని సాధించడం.) దాని ఉద్దేశ్యం ఏమిటి? పోటీనుంచి తప్పుకోవడమే. ఎల్లకాలం, జీవితమంతా పోటీపడుతూ జీవించడం ఎవరికీ సాధ్యం కాదు. మన జీవితాలలో విజయం సాధించడానికి మార్గం కూడా ఇదే. అందరూ చేసే వృత్తినే మనం కూడా ఎంచుకోవడం వల్లనే మన జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. (ఈ పోటీ అనే మాటను తరువాత అధ్యాయాలలో ఇంకా వివరంగా చూస్తాము.)

ఒక ఉదాహరణ చూడండి. ఒక రైతు ఒక సంవత్సరం బెండ పైరు వేశాడు. ఆ సంవత్సరం అతడికి మంచి లాభం వచ్చింది. అది చూసి మరుసటి సంవత్సరం ఆ ఊళ్ళోని రైతులందరూ బెండ పంటే వేశారనుకోండి. ఒకవేళ పంట బాగానే వచ్చినా ఒకే కాయగూర ఎక్కువగా విపణిలోకి రావడం వల్ల ధర తగ్గిపోయి అందరూ నష్టపోతారు. అంతేకాక, ఒకే పంట ఎక్కువ విస్తీర్ణంలో నాటినప్పుడు చీడపీడల బెడద కూడా ఎక్కువవుతుంది. దానివల్ల కూడా నష్టం వస్తుంది. అందుచేతనే వేర్వేరు పంటలు కలిపి మిశ్రమ పంటలు నాటమనీ, లేకపోతే గ్రామంలోని రైతులు వేర్వేరు పంటలు నాటాలనీ, దానివల్ల నష్టం తగ్గుతుందనీ చెపుతూ ఉంటారు. కాబట్టి సమాజంలో మనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకోవడమే విజయరహస్యం.

దీన్ని ఎలా సాధించాలో వివరిస్తూ, ఆ సమస్యకు ఒక అతి చక్కని పరిష్కారాన్ని మిస్ మేరీ హేల్ అనే అమెరికాదేశపు యువతికి వ్రాసిన ఉత్తరంలో వివేకానంద స్వామి

సూచించారు. అందులో మనందరిలోనూ అత్యద్భుతమైన శక్తి దాగివుందనీ, కానీ మనం దాన్ని తెలివితక్కువతనంతో వృథా చేస్తున్నామనీ చెప్పారు. దానికి బదులు ఏదోవొక విషయాన్ని, వృత్తిని ఎంచుకోమనీ, దానికే జీవితాన్ని అర్పించమనీ, అదే విజయానికి మూలమనీ చెప్పారు.

జీవితంలో చిన్నతనంలో కొంత సందిగ్ధానికి లోనయినా ఒక వయస్సు వచ్చేసరికి జీవితంలో ఏ మార్గాన్ని చేపట్టాలో నిశ్చయించుకోవాలి. ఆపైన ఎటువంటి సందిగ్ధాలకూ తావివ్వకుండా ఎంచుకున్న మార్గాన్ని పట్టువదలని, అలుపెరుగని, విసుగు చెందని కర్తవ్యనిష్ఠతో అనుసరించాలి. ఒకసారి ఇలా నిర్ణయించుకున్న తర్వాత మన నిర్ణయం గడియగడియకూ మారిపోకూడదు. చేపట్టిన వృత్తిలో, వ్యాపారంలో, కళలో, జీవనశైలిలో పూర్తిగా లీనమైపోవాలి. ఇలా చెయ్యడం ద్వారానే మనం జీవితంలో విజయం సాధిస్తామనీ, ధన్యతను పొందుతామనీ, ఇతరులకు కూడా ధన్యతను అందించగలుగుతామనీ స్వామీజీ బోధించారు.

## 28. మీరొక విశిష్టమైన వ్యక్తి అని నమ్మండి!

మనందరికీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఒక రకమైన నిస్పృహ కలుగుతుంది. "నేనెవరిని? సంఘంలో నా స్థానం ఏమిటి?" అన్న ప్రశ్నలు మన మనస్సులలో కలుగుతాయి. "నన్ను ఎవరూ లెక్కచెయ్యడం లేదే! నా స్నేహితులు, నా తోడబుట్టిన వాళ్ళే నన్ను అంతంత మాటలు అన్నారు కదా! జీవితమంటే ఇంతేనా? నా మీద వీరికున్న గౌరవం ఇంతేనా!" అనే తికమక కలుగుతుంది. దీనికి కారణం ఏమిటి? దీనిని తట్టుకోవాలంటే ఎలా? మనం చెయ్యవలసిన పనిని వదలకుండా చెయ్యాలంటే ఎలా?

*"దేశప్రజలకు వారు పోగొట్టుకున్న వ్యక్తిత్వాన్ని తిరిగి ఇవ్వండి"* అని స్వామీజీ చెప్పారు. దీనినుంచి మనం ఏమి నేర్చుకోవచ్చునో చూద్దాం. మనిషి తాను ఈ సృష్టిలో ఒక విశిష్టమైన వ్యక్తిననీ, తనలాంటి వ్యక్తి మరొకరు లేరనీ భావించాలి. నిజంగానే మనలాంటి వ్యక్తి మరొకరు లేరు. మనల్ని భగవంతుడు ఒక ప్రత్యేకమైన పనికోసం ఈ భూమి మీద పుట్టించాడనీ, మన మీద ఆయన ఆ బాధ్యతను ఉంచాడనీ భావించాలి. భగవంతుడు మన సొంత మనిషి. మన బంధుమిత్రుల కన్నా మనకు అత్యంత సన్నిహితుడైనవాడు. ఏదోవొక కారణం లేకుండా ఆయన మనను ఈ భూమి మీదకు పంపుతాడా?

*"మీరొక మనిషిలో ఏదైనా చెడు లక్షణాన్ని చూస్తే దానిని పట్టించుకోవద్దు. అది మానవాళి మొత్తంలో సహజసిద్ధంగా కనిపించేదే. కానీ మీరు అతనిలో ఒక మంచి లక్షణాన్ని చూస్తే అది పూర్తిగా అతని సొంతం అని తెలుసుకోండి. దానిని దృష్టిలో ఉంచుకుని అతణ్ణి గౌరవించండి!"* అని స్వామీజీ బోధించారు. ఇతరులను ఈ దృష్టితో చూడడంతో పాటు మనల్ని మనం పరిశీలించుకునేటప్పుడు కూడా ఇదే వర్తిస్తుంది. మనలో మనకే ఏదైనా చెడుగుణం, బలహీనత కనిపిస్తే దాన్ని గురించి మరుక్షణం ఆలోచించడం మాని, మనలో ఉన్న శక్తి ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. మనందరిలోనూ ఏదోవొక వైశిష్ట్యం ఉన్నదనే విషయాన్ని గుర్తుచేసుకోవాలి. మనం చేసే పని, నిర్వర్తించే కర్తవ్యం మనవల్ల కొత్తదనాన్ని సంతరించుకుంటుందనీ, సమాజానికి అది చేసే మేలు వల్ల మన పేరు చిరస్థాయిగా నిలచిపోతుందనీ భావించి మనం పనిచెయ్యాలి. *"పుట్టిన ప్రతి మనిషీ గిట్టక తప్పదు కనుక ఈ ప్రపంచం మీద మీదైన ఒక ముద్రను ముద్రించి పోండి!"* అనీ, *"మీరందరూ మహాత్ములైన ఋషుల సంతానం. ...మీరందరూ ఘనకార్యాలు సాధించడానికి పుట్టారని నమ్మండి!"* అని కూడా స్వామీజీ బోధించారు కదా!

కర్తవ్యాన్ని దీర్ఘకాలం విసుగులేకుండా, నిష్ఠతో నిర్వర్తించాలంటే మనకు మనమీద, మన పనిమీద గౌరవం ఉండాలి. అప్పుడే మనం చెయ్యవలసిన పనిని చక్కగా చెయ్యగలుగుతాము. *"మన మొట్టమొదటి కర్తవ్యం మనల్ని మనం ద్వేషించుకోకుండా ఉండడమే. ఎందుకంటే జీవితంలో ముందుకు సాగాలంటే మనమీద మనకు విశ్వాసం ఉండాలి. మనలోని అఖండమైన శక్తిమీద (దివ్యత్వం మీద) మనకు విశ్వాసం ఉండాలి. తనమీద తనకు విశ్వాసం లేనివాడికి భగవంతుడి మీద ఎప్పటికీ విశ్వాసం కలుగదు"* అనీ, *"'ఆత్మగౌరవం లేనివాడు మనిషే కాదు' అని మా గురుదేవులు చెప్పేవారు"* అని కూడా స్వామీజీ చెప్పారు.

## 29. చిన్న పనులలోని గొప్పతనాన్ని తెలుసుకోవాలి

మన ప్రస్తుత విద్యావిధానంలో మానవునిలోని దివ్యత్వాన్ని, కర్తవ్యనిష్ఠలోని ఔన్నత్యాన్ని చాటిచెప్పే భావన పూర్తిగా లోపించింది. మనిషిలోనే ఉన్న దివ్యత్వాన్నీ, అఖండమైన శక్తినీ మన విద్యావిధానం మేలుకొలపట్లేదు. తాను ఏదైనా సాధించగలడనే నమ్మకాన్ని మనిషిలో అది కలిగించడం లేదు. ఒక మనిషిని అతడు చేసే వృత్తివ్యాపారాలను బట్టి గౌరవించకూడదనీ, అతనిలోని దివ్యత్వాన్ని చూసి, అతడు తాను చేసే పనిని ఎంత శ్రద్ధతో చేస్తున్నాడన్నదాన్ని బట్టి గౌరవించాలనీ మనం మన పాఠశాలల్లో నేర్చుకోవడం లేదు. దీనివల్ల కొన్ని వృత్తివ్యాపారాలే గొప్పవనీ, మిగిలినవి 'అంత గౌరవప్రదమైనవి కావు' అన్న తప్పుడు ఆలోచనలను ప్రజలు ఒంటబట్టించుకుంటున్నారు. ఇలా ఆలోచించడం తప్పు అన్న విషయాన్ని మన పాఠ్యపుస్తకాలు బోధించడం లేదు.

*"గొప్ప పనులు చేయాలి, నిజమే! కానీ గొప్ప పనులే ఎందుకు? చిన్నచిన్న పనులను కూడా గొప్పగా ఎందుకు చేయకూడదు? అవి ఎంత గొప్పవో ఇవి కూడా*

*అంతే గొప్పవి! చిన్నచిన్న విషయాలలోని గొప్పతనాన్ని బోధించడమే భగవద్గీత ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశం!"* అని స్వామీజీ చెప్పారు. మనం ఇటువంటి ఆలోచనావిధానాన్ని అలవరచుకున్నప్పుడు మన మీద, మనం చేసే పని మీద, మనకు గౌరవం కలుగుతుంది. నేను కూడా అన్నీ సాధించగలనన్న నమ్మకం, చెయ్యగలనన్న ధైర్యం కలుగుతుంది.

## 30. సమాజం మనల్ని గౌరవించాలంటే ఏమి చెయ్యాలి?

ఒక మనిషికి ఒక క్షేత్రంలో ఉన్న శక్తిసామర్థ్యాలు, కర్తవ్యనిష్ఠలను గమనించిన సమాజం వారిని ఆ క్షేత్రానికి సంబంధించిన పనులు చేసిపెట్టమని అడుగుతుంటుంది. వారువారు ఆయా పనులు చక్కగా నిర్వహించగలరు కాబట్టి సమాజం అన్ని రంగాలలోనూ ప్రగతిని సాధించగలుగుతుంది. శాంతి, సమన్వయాలు కూడా వెల్లివిరుస్తాయి. వ్యక్తిగతంగా వారు కూడా పురోగతి సాధిస్తారు. అప్పుడు వారికి ఇంకా ఇంకా పెద్ద పెద్ద బాధ్యతలు చేపట్టే అర్హత కలుగుతుంది. అప్పుడు మరింత ఉన్నతమైన అవకాశాలు వారిని వెతుక్కుంటూ వస్తాయి.

"అత్యుత్తమంగా పనిచేసేవాడు ఎలకబోనులు తయారుచేస్తూ అడవిలో కూర్చున్నా సరే, ప్రజలు అతడి ఎలకబోనుల్ని కొనడానికి బారులు కడతారు!" అని ఒక మేధావి అన్నాడు. ప్రజలు మనల్ని గుర్తిస్తారో లేదోనని అనుమానపడవలసిన అవసరం లేదు. చేతనైనవాడికి, శ్రద్ధగా చేసేవాడికి పని ఎప్పుడూ దొరుకుతూనే ఉంటుందనీ, అతడి జీవితానికి ఏ లోటూ ఉండదనీ మనం ప్రతిరోజూ గమనిస్తూనే ఉంటాం. *"ఒక తామరపువ్వులా ఉండండి. మీ పరిమళాలను ఎల్లెడలా వెదజల్లండి. ఆ తామరపువ్వు ఒకచోట స్థిరంగా ఉన్నా, ఎక్కడెక్కడనుండో తుమ్మెదలు దానిని వెతుక్కుంటూ వస్తాయి"* అని స్వామీజీ చెప్పారు. నిజానికి ఆ తామరపువ్వు చెరువు నీటిలో పెరుగుతున్నా, దాని

పరిసరాలు అంత శుభ్రంగా లేకపోయినా, దాని పరిమళం ఎక్కడెక్కడో ఉన్న తుమ్మెదల్ని ఆకర్షించక మానదు. మట్టిలో ఉన్నా మాణిక్యం మాణిక్యమే!

ధర్మవ్యాధుడు ఏమీ ఎరగనట్టు తన వ్యాపారం చేసుకుంటున్నాడు. కానీ అతడి గొప్పతనాన్ని గుర్తించి కౌశికుడే తనకు బోధించమని అతణ్ణి బ్రతిమలాడాడు. నూరు యోజనాల సముద్రాన్ని దాటవలసి వచ్చినప్పుడు హనుమంతుడికి ఆ గురుతర బాధ్యతను పిలిచి అప్పగించారు. ఆ విధంగా తనకు లభించిన వివిధ స్థాయులలోని కర్తవ్యాలను నిష్ఠతో నెరవేర్చిన వ్యక్తి పరిపూర్ణతను సాధిస్తాడు. అప్పుడు సమాజమే వెంటపడి తనకు త్రోవ చూపమని అటువంటివారిని కోరుతుంది.

## 31. కర్తవ్యనిష్ఠ వల్ల సమాజంలో శాంతి, సమన్వయాలు

ఒక కథ చెప్పుకుందాం. ఒక అడవిలో ఒక కాకి ఉంది. ఆ అడవిలోనే ఒక పెద్ద సరస్సు కూడా ఉండేది. దానికి చాలా దూరం నుంచి హంసలు వలసగా వచ్చేవి. ఈ కాకి వాటిని చూసింది. వాటితో పందెం పెట్టుకుని ఎగరాలని అనుకుంది. అనుకున్నదే తడవుగా, వాటితో పోటీపెట్టుకుని ఎగరడానికి బయలుదేరింది. కాకి నిజంగానే చాలా బలంగా ఎగరగలిగిన పక్షి. గాలిలో చాలా విన్యాసాలు చేస్తూ ఎగురగలదు. కానీ హంస చాలా దూరం, నిజానికి వేల కిలోమీటర్లు, సునాయాసంగా ఎగురగలిగిన పక్షి. త్వరలోనే, దూరప్రయాణంలో తాను వాటితో పోటీపడలేనని మన కాకి తెలుసుకుంది. తన ప్రయత్నాన్ని మానుకుంది. హంస గొప్పతనం హంసదని, తన గొప్పతనం తనదని, రెంటికీ పోలిక లేదనీ గ్రహించింది.

ఒక కొండలో అట్టడుగున ఉన్న రాయి గొప్పదా, శిఖరాన ఉన్న రాయి గొప్పదా అని ప్రశ్నించడం హాస్యాస్పదం! సమాజానికి అవసరమైన ఒక్కొక్క పనిని ఒక్కొక్కరు నిర్వహిస్తారు. వీటిలో ఒకటి గొప్ప ఒకటి తక్కువ అన్న తేడా ఉండదు. అందరి సంక్షేమంలోనే వ్యక్తి సంక్షేమం ఉంది. అందరి ఆనందంలోనే వ్యక్తి ఆనందం ఉండాలి.

ధర్మవ్యాధుడు జనకుడి పరిపాలనను వర్ణిస్తూ, ఆయన రాజ్యంలో పౌరులను ఎవరి కర్తవ్యాలను వారు నిర్వర్తించేలా జీవించమని ప్రోత్సహించేవాడనీ, తద్వారా సమాజంలో పోటీ తగ్గి, శాంతిసమన్వయాలు నెలకొని ఉన్నాయనీ చెపుతాడు. మనుష్యులు అందరూ ఒకే వృత్తి చెయ్యాలని కోరుకున్నా, తమకున్న అర్హతకు మించిన పనులకోసం ఎగబడినా రెండు రకాలైన నష్టాలు కలుగుతాయి. మొదట, ఆయా పనులలో నాణ్యత లోపించడం వలన సమాజం మొత్తం దెబ్బ తింటుంది. ఆపైన, ఆ పనుల్ని చేయడానికి కావలసిన సామర్థ్యం వారిలో తగినంతగా లేకపోవడం చేత పూనుకున్న పనుల్ని సాధించలేక అసంతృప్తికి లోనవుతారు. క్రమక్రమంగా అభివృద్ధి సాధించడానికి బదులు, ఒక్కసారిగా తమ అర్హతకు మించిన పని చెయ్యడానికి ప్రయత్నించి అందులో విఫలమవ్వడంవల్ల వ్యక్తిగత జీవితంలో అపజయాల పాలవుతారు, అసంతృప్తికి లోనవుతారు. మరొకప్రక్క సమాజంలో అసూయాద్వేషాలు పెచ్చరిల్లుతాయి.

**కర్మణైవ హి సంసిద్ధిం ఆస్థితా జనకాదయః ।**
**లోకసంగ్రహ మేవాపి సంపశ్యన్ కర్తు మర్హసి ॥ (భగవద్గీత 3.20)**

జనకుడు మొదలైనవారు తమ పనులను నిష్ఠతో చేయడం ద్వారా పరిపూర్ణతను సాధించారనీ, అయితే లోకానికి ఆదర్శంగా ఉండడం కోసం పరిపూర్ణత సాధించిన తర్వాత కూడా తమ కర్తవ్యాన్ని అదే నిష్ఠతో కొనసాగించారని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆ విధంగా జీవితంలో కర్తవ్యనిష్ఠను ఎంతవరకూ కొనసాగించాలో, ఎందుకు కొనసాగించాలో ఈ శ్లోకం వివరిస్తుంది.

జనకుడు, ధర్మవ్యాధుడు, గృహిణి – ఈ ముగ్గురినీ దీనికి చక్కని ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. వారు తాము ఏ పని చేస్తున్నామన్న దానితో నిమిత్తం లేకుండా తమ కర్తవ్యాన్ని నిష్ఠతో చేయడం ద్వారా పరిపూర్ణతను సాధించారు. అయితే వారు పరిపూర్ణతను సాధించిన తర్వాత కూడా సమాజశ్రేయస్సు కోసం అదే పనిని

కొనసాగించారు. గొప్ప శక్తుల్ని సాధించినా, గృహిణి తన కుటుంబాన్ని సంరక్షించే పనిని కొనసాగించింది. జనకుడు భగవత్సాక్షాత్కారాన్ని పొందినవాడిగా పేరు తెచ్చుకున్నా, రాజుగా తన పాలనను కొనసాగించాడు. వేదాంత సత్యాలను అవలీలగా విడమరచి చెప్పగల ధర్మవ్యాధుడు తాను చేసే మాంసం వ్యాపారాన్ని కొనసాగించాడు. అలాగే హనుమంతుడు తన కర్తవ్యనిర్వహణలో భాగంగా అనేక మహత్కార్యాలను చేసినా, సుగ్రీవుడి మంత్రిగానే తన జీవితాన్ని గడిపాడు. మంత్రిగా తాను చేసే వృత్తి తనకు సరిపడ గౌరవాన్ని ఇవ్వలేదని అనుకోక, తన విధుల్ని అత్యున్నతమైనవిగా భావించి నెరవేర్చాడు. ఇటువంటి మరికొన్ని మహావ్యక్తుల జీవితకథలను ఈ పుస్తకం చివరిభాగంలో చూడవచ్చు.

పైన పేర్కొన్న వ్యక్తులు వేర్వేరు జీవితాలను మనకు చూపారు. వారివారి కర్తవ్యనిష్ఠ వల్ల తమకన్నా చాలా ఉన్నతమైనవారుగా కనపడేవారికి మార్గదర్శనం చేసే స్థాయికి ఎదిగారు. వారి కర్తవ్యనిష్ఠ వల్ల వారు చేసిన పనులకే ఔన్నత్యం అబ్బింది. అంతేకాక వేల సంవత్సరాలుగా భారతీయుల హృదయాలలో నిలిచి, గౌరవాన్ని పొందుతున్నారు.

## 32. చేసే పనిపట్ల ఆరాధనాభావం అత్యవసరం

మన దేశంలో చాలాచోట్ల మనుష్యులు తాము చేసే పనుల విషయంలో ఆరాధనాభావాన్ని ప్రకటించడాన్ని చూడవచ్చు. ఒక విద్యార్థి తన పుస్తకాలకు నమస్కరించి చదువు మొదలుపెడతాడు. ఒక నటుడు తాను ఎక్కే వేదికను ముందుగా కళ్ళకద్దుకుంటాడు. ఒక రిక్షా కార్మికుడు తన రిక్షాను కళ్ళకద్దుకుంటాడు. ఒక బస్సును నడిపే డ్రైవరు బస్సుకు నమస్కారం చేస్తాడు. ఇటువంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. ఇటువంటి ఆరాధనాభావం వల్ల మనిషి తాను చేసే పనిని మరింత చక్కగా చేయగలుగుతాడు. క్రమక్రమంగా ఉన్నతమైన బాధ్యతలకు అర్హత సాధిస్తాడు.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసియత్ ।**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ (భగవద్గీత 9.27)**

"నీవు ఏ పని చేసినా దానిని నా ఆరాధనగా భావించి పనిచెయ్యి!" అని భగవద్గీతలో కృష్ణుడు బోధించాడు కదా! కొద్దిగా ఆలోచిస్తే మనం ఇటువంటి దృక్పథంతో పనిచేయడం లేదని మనమే గుర్తించవచ్చు. చేసే పనిని ఆరాధనగానూ, ఉపయోగించే వస్తువులను దివ్యత్వంతో నిండి ఉన్నట్టుగానూ భావించడం వలన మనం మరింత చక్కగా పనిచెయ్యగలుగుతాము.

స్వామీజీ, *"నువ్వు ప్రస్తుతం ఏ పని చేస్తున్నావో దానినే అత్యున్నతమైన ఆరాధనగా భావించి శ్రద్ధతో చెయ్యి. తర్వాత ఏమి జరుగుతుందని కానీ, ఎటువంటి ఫలితం వస్తుందని కానీ ఆలోచించవద్దు. నీ జీవితం మొత్తాన్ని ఈ క్షణంలో నీ చేతిలో ఉన్న పనికే అర్పించి, దానినే ఒక ఆరాధనగా భావించి చెయ్యి!"* అని చెప్పారు.

## 33. *'మనం ఈ ప్రపంచానికి ఋణపడి ఉన్నాం!'*

*"ఇతరుల సంక్షేమం కోసం పని చెయ్యండి! 'నాకేం వస్తుంది?' అని చూడకండి!"* అని బోధిస్తూ, కర్తవ్య నిర్వహణలో మన దృక్పథం ఎలా ఉండాలో స్వామీజీ వివరించారు.

*"మొట్టమొదటగా మనందరం ఈ ప్రపంచానికే ఋణపడి ఉన్నాం కానీ ఈ ప్రపంచం మనకు ఏ మాత్రం ఋణపడి లేదన్న విషయాన్ని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ఈ ప్రపంచానికి ఏ కొద్దిపాటి సహాయం చెయ్యగలిగినా అది మనకు లభించిన గొప్ప మన్నన అని తెలుసుకోండి. ఈ ప్రపంచానికి సహాయం చెయ్యడం ద్వారా నిజానికి మనకు మనమే సహాయం చేసుకుంటున్నాము."*

*"రెండవ విషయం: ఈ విశ్వంలో భగవంతుడనేవాడు ఒకడున్నాడు. ఈ విశ్వం*

అనేది ఎక్కడికో కొట్టుకుపోతున్నదనీ, అలా కొట్టుకుపోకుండా ఉండడానికి అది నీ సహాయాన్ని గానీ, నా సహాయాన్ని గానీ కోరుతున్నదని చెప్పే భావన సరైనది కాదు. ఈ విశ్వంలో భగవంతుడు ఎల్లప్పుడూ ఉన్నాడు. ఆయనకు మరణం లేదు. ఆయన నిరంతరం చురుకుగా పనిచేస్తూ, ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఈ విశ్వాన్ని గమనిస్తూ ఉంటాడు. ఈ విశ్వమంతా నిద్రిస్తున్నప్పుడు కూడా ఆయన మెలకువతోనే ఉంటాడు. ఈ విశ్వంలో కలిగే మార్పులు, వ్యక్తీకరణలూ అన్నీ ఆయన వల్లనే కలుగుతాయి."

"మూడవది: మనం ఎవరినీ, దేనినీ ద్వేషించకూడదు. ఈ ప్రపంచంలో మంచీ చెడూ ఎప్పుడూ కలిసే ఉంటాయి. బలహీనులపట్ల మనం జాలి చూపాలి. తప్పు చేసేవారిని కూడా ప్రేమించగలగాలి. ఈ ప్రపంచం ఒక బ్రహ్మాండమైన వ్యాయామశాల. ఇక్కడ మనమందరం వ్యాయామం చేసి ఆధ్యాత్మికంగా ఇంకాయింకా బలవంతులుగా తయారు కావాలి."

"నాలుగవది: మనకు ఏ విధమైన దురభిమానమూ ఉండకూడదు. ఎందుకంటే దురభిమానం ప్రేమకు వ్యతిరేకంగా పని చేస్తుంది. దురభిమానంతో నిండిన మనుష్యులు, 'నేను నేరస్థుణ్ణి ద్వేషించను, అతడిలోని నేరప్రవృత్తిని మాత్రమే ద్వేషిస్తాను!' అని నాలుక చివర నుండి మాట్లాడడం మనం చూస్తాము. అయితే నిజంగా నేరస్థుడికీ, నేరానికీ మధ్య తేడా చూడగలిగే మహాత్ముడి ముఖారవిందాన్ని దర్శించడానికి ఎంతదూరం ప్రయాణం చెయ్యడానికైనా నేను సిద్ధంగా ఉన్నాను. అలా చెప్పడం చాలా సులభం. కానీ, నిజానికి ఒక లక్షణానికీ, దాన్ని కలిగివున్న మనిషికీ నిజంగా తేడా చెప్పగలిగితే మనమే పరిపూర్ణమైన మనుష్యులం అయిపోతాం. ఇది అంత సులభం కాదు. కాబట్టి (దురభిమానం లేకుండా) మనం ఎంత శాంతంగా ఉండి, మన మనస్సు ఎంత తక్కువ అలజడికి లోనయితే అంత ఎక్కువ ప్రేమను మనం చూపగలుగుతాము, అంత చక్కగా పనిచేయగలుగుతాము."

# 34. దురభిమానమే దుర్మార్గానికి మూలం!

అయితే మనుష్యులు తమ కర్తవ్యాన్ని నిష్ఠతో కొనసాగించకుండా వారిలోని అహంకారం అడ్డుతగులుతుంది. ఈ అహంకారం, తానే అందరికన్నా గొప్పవాడిననే ఆలోచనను కలిగించడం ద్వారా మనిషిలో దురభిమానాన్ని రేకెత్తిస్తుంది. ఈ దురభిమానమే కర్తవ్యనిష్ఠకు పెద్ద శత్రువు. అంతేకాక సమాజంలో కనిపించే దుర్మార్గానికి ఇదే పునాది.

*"మన దురభిమానంవల్లనే మనం పని చెయ్యలేకపోతాము"* అని స్వామీజీ చెప్పారు. *"మనం దేనిని కలిగివుంటే అది గొప్పదనీ, మనది కానిది ఏదీ గొప్పది కాదనీ మనం అనుకుంటాము. మనం పనిచేసే పద్ధతి మాత్రమే అందరికంటే గొప్పదనీ, 'నేను కనుక చేసి చూపిస్తే ఆ పని మరింత గొప్పగా జరుగుతుంది' అనీ మనం గొప్పలు చెప్పుకుంటాం. ఇటువంటి దురభిమానం మనలో ద్వేషాన్నీ, కోపాన్నీ రగిల్చి, ప్రేమను చంపివేస్తుంది. దానివల్ల చేసేపని మీద ఆసక్తి సన్నగిల్లిపోవడమే కాక ఇతరుల పనులూ, పదవులూ నాకే కావాలని మనిషి కోరడం మొదలుపెడతాడు. ఈ దురభిమానం మనిషిలోని జాలిగుండెను చంపివేస్తుంది. పోటీతత్త్వాన్ని రగిల్చి ఒకరితోనొకరు పోటీపడేలా చేస్తుంది. ఇటువంటి దురభిమానం మనిషిని తెలివితక్కువ వాడిగా చేస్తుంది. తాను చేసే పనిమీద ప్రేమను, గౌరవాన్ని కోల్పోయేలా చేసి తోటివారిపట్ల ప్రేమ, జాలి, కరుణ మొదలైన సుగుణాలను అంతమొందిస్తుంది. దీనివల్ల సామాజికవ్యవస్థ మొత్తం ఛిన్నాభిన్నమవుతుంది"* అని కూడా చెప్పారు.

'పోటీలో నెగ్గడానికి మనిషి చేసే ఆలోచనలు అతడి తెలివిని మరింత పెంచుతాయి కదా! మరి పోటీతత్త్వం వల్ల మనిషి తెలివితక్కువవాడవుతాడని స్వామీజీ అన్నారెందుకు?' అన్న సందేహం కలుగవచ్చు. చిన్నతనంలో విద్యాభ్యాసానికి పోటీ

కొంతవరకూ అవసరం కావచ్చు. కానీ అవే ఆలోచనలు జీవితమంతా కొనసాగితే అవి మనిషిలోని స్వార్థాన్ని విపరీతంగా పెంచుతాయని మనం మరచిపోకూడదు. మనిషి అప్పటికప్పుడు నెగ్గుతున్నట్టు కనపడినా కాలగమనంలో తనను తాను నాశనం చేసుకుంటాడు. తన మనశ్శాంతిని పోగొట్టుకోవడమే కాక సమాజం మొత్తం నాశనమవ్వడానికి కారణమవుతాడు. తనను, చుట్టూ ఉన్న సమాజాన్నీ, ప్రకృతినీ నాశనం చేసుకునేది తెలివి ఎలా అవుతుంది?

ఈ దురభిమానాన్ని నిర్మూలించడానికి ఇంకొక విషయం నేర్చుకోవాలి. స్వామీజీ ఇలా చెప్పారు.

*"మనం నేర్చుకోవలసిన పాఠం ఒకటుంది. అదేమిటంటే, ఈ ప్రపంచం ఎలాంటిదో చెప్పడానికి మనల్నే కొలబద్దలుగా తీసుకుంటే కుదరదు అన్నదే. ఏ మనిషి గురించి నిర్ణయించాలన్నా, అతడి స్వభావాన్ని మాత్రమే పరిగణనలోనికి తీసుకోవాలి. ప్రతి జాతి గురించి దాని సొంత సాంప్రదాయాన్ని అనుసరించి మాత్రమే న్యాయనిర్ణయం చెయ్యాలి. ఒక దేశంలోని ఒక సంప్రదాయాన్ని ఆ దేశంలోని పరిస్థితులను బట్టి, ఆ పరిస్థితులకు అనుగుణమైన హేతుబద్ధతను బట్టి న్యాయనిర్ణయం చేయాలి. అమెరికా దేశంలోని ఆచారవ్యవహారాలు ఆ దేశస్థులు జీవించే పరిసరాల వల్ల ఏర్పడ్డాయి. భారతదేశంలోని ఆచారవ్యవహారాలు ఈ దేశస్థులు జీవించే పరిసరాల వల్ల ఏర్పడ్డాయి. అదే విధంగా చైనా, జపాన్, ఇంగ్లండ్ మొదలైన అన్ని దేశాలలోనూ జరిగింది."*

*"ప్రతివొక్కరూ, వారికి ఏ స్థానానికి అర్హత ఉందో దానికే చేరుకుంటారు. ఏ బంతి ఏ కన్నంలో సరిపోతుందో దానిలోకే చేరుతుంది. ఇలా విశ్వవ్యాప్తంగా సాగిపోతున్న సర్దుబాటులో ఒకరికి మరొకరి కన్నా ఎక్కువ సామర్థ్యం ఉంటే ఈ ప్రపంచం దాన్ని కూడా తప్పక గుర్తిస్తుంది. కాబట్టి మనం వగచి ప్రయోజనం లేదు. ఒక ధనవంతుడు*

*ఉంటాడు. అతడు మంచివాడు కాకపోవచ్చు. కానీ అతడు ఆ భాగ్యవంతమైన స్థితికి చేరడానికి అతడిలో ఏవో కొన్ని లక్షణాలు ఉండి ఉండాలి. అటువంటి లక్షణాలే వేరొకరిలో ఉంటే అతడు కూడా ధనవంతుడౌతాడు. కాబట్టి ఎవరో ధనవంతులయ్యారని మనం మెటికలు విరిచి ప్రయోజనం లేదు. దానివల్ల మన పరిస్థితులు ఏ మాత్రం మెరుగుపడవు."*

కాబట్టి మనలోని దురభిమానాన్ని (ఫెనాటిసిజమ్) వదిలించుకోవాలి. మనం ఉన్న స్థానంలో నుంచి సక్రమంగా పనిచేయడం ద్వారా మనం ఏ స్థాయికైనా చేరుకోవచ్చునన్న సత్యాన్ని మరచిపోకూడదు. మన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలన్నా, సమాజాన్ని అభివృద్ధి చేయాలన్నా ఇదే పద్ధతి.

## 35. భారత సమాజాన్ని చిరకాలంగా నిలబెట్టిన కర్తవ్యభావం

అయితే సమాజాలు ఈ దురభిమానాన్ని తగ్గించుకుని, ప్రేమను, నిస్వార్థగుణాన్ని పెంచుకున్న సందర్భాలను కొన్నింటిని చరిత్రలో చూడవచ్చు. విభిన్న జాతుల చరిత్రను పరిశీలించినప్పుడు, ఏయే కాలాలలో ఈ సుగుణాలను ఆయా జాతులు ఎక్కువగా అలవరచుకున్నట్టుగా కనిపిస్తుందో, ఆయా సందర్భాలలో ఆయా జాతులు గొప్ప అభివృద్ధిని సాధించాయి. అంతేకాక కాలక్రమంలో సమాజంలో సంపద పెరిగినా, భౌతికసుఖలాలసత్వం పెరిగి, ఈ సుగుణాలు కనుమరుగైనప్పుడు, ఆయా జాతులు క్షీణించి అంతరించడం కూడా మనం చూస్తాము.

భారతదేశ చరిత్రను మొత్తంగా పరిశీలించినప్పుడు సనాతనధర్మం ద్వారా నేర్పబడిన కర్తవ్యనిష్ఠ మన దేశంలోని సమాజాన్ని చాలావరకూ సజావుగా సాగేలా చేసింది. వేరే దేశాలలో పెచ్చరిల్లిన దురభిమానం వల్ల, అక్కడి ప్రజలు గొప్పతనాన్ని భౌతికమైన సంపదలలోనూ, కామసుఖాలలోనూ చూడడంవల్ల, అక్కడి సమాజాలు

చాలా సందర్భాలలో తుడిచిపెట్టుకుపోయినా, భారత సమాజం చాలావరకూ అటువంటి ఆటుపోట్లను తట్టుకుని నిలబడింది. చారిత్రకంగా భారత సమాజం ఈ కర్తవ్యనిష్ఠ మీద చేసిన ప్రయోగాలు ఏమిటో, వాటి ఫలితాలు ఏమిటో స్వామీజీ బోధనల వెలుగులో చూద్దాం.

## 36. భారతదేశ చరిత్రలో కర్తవ్యనిష్ఠ - మంచి, చెడు

కర్తవ్యనిష్ఠను సరైన దృక్పథంతో పాటించినప్పుడు ఎటువంటి మంచి ఫలితాలు కలుగుతాయో, పాటించనప్పుడు ఎటువంటి చెడు ఫలితాలు కలుగుతాయో భారత సమాజపు చరిత్రను పరిశీలిస్తే తెలుస్తుంది. స్వామీజీ దాన్ని ఇలా వివరించారు.

*"మన జన్మభూమి కర్తవ్యనిష్ఠ వల్ల కలిగే పరిణామాలకు, ఫలితాలకు జాజ్వల్యమానమైన ఉదాహరణగా నిలిచింది. సేవ అనే ఆదర్శం సమాజంలోని వ్యక్తుల మీద బలవంతంగా రుద్దబడినప్పుడు; సామాజిక నియమాల ద్వారా, క్రమశిక్షణ ద్వారా వ్యక్తులు ఆత్మత్యాగాన్ని చూపడానికి బలవంతం చేయబడినందువల్ల; సమాజంలో ఎటువంటి ఫలితాలు కలుగుతాయో మన చరిత్రను పరిశీలిస్తే తెలుస్తుంది. ఈ భరతభూమిలో, మనుష్యులు శాస్త్రోక్తంగా జన్మిస్తారు; జీవితాంతం అన్నపానాదులన్నీ నియమానుసారం చేస్తారు; వివాహం మొదలైన రకరకాల కర్మలన్నీ శాస్త్రోక్తంగా చేస్తారు. అయితే ఈ కఠోరమైన క్రమశిక్షణ, ఒక్క మంచి విషయాన్ని మాత్రం మినహాయించి, అన్ని రకాలుగానూ దుర్మార్గంతో నిండివుంది."*

*"దీనిలోని మంచి విషయం ఏమిటంటే, ఇటువంటి క్రమశిక్షణ వల్ల మనుష్యులు అతి తక్కువ ప్రయత్నంతో ఒకటి రెండు పనులను చాలా చక్కగా చేయగలుగుతారు. ఎందుకంటే తరాల తరబడి వాటిని చేస్తూ ఉన్నారు కాబట్టి. మూడు రాళ్ళు పెట్టి, నాలుగు కట్టెపుల్లలతో ఈ దేశంలోని వంటవాడు చేసే రుచికరమైన వరి అన్నం, కూర*

*మరే దేశంలోనూ చూడము. రూపాయి విలువచేసే ఇక్ష్వాకులకాలంనాటి మగ్గం మీద ఎక్కి, కాళ్ళు ఒక గుంటలో పెట్టి కూర్చుని, గజం ఇరవైరూపాయలు విలువచేసే పట్టుబట్టను ఈ దేశంలోని నేతగాళ్ళు మాత్రమే నేయగలరు. (ఇవి 19వ శతాబ్దపు చివరి దశాబ్దంలో చెప్పిన మాటలు. అప్పటి ఇరవై రూపాయలు బహుశా ఇప్పుడు ఇరవై వేలతో సమానం.) చిరిగిన చాప మీద కూర్చుని, ఆముదంతో వెలిగే మట్టిదీపం వెలుగులో పనిచేస్తూ, గొప్ప ఋషులుగా తయారైన మహనీయుల్ని మీరు ఈ దేశంలో మాత్రమే చూడగలరు. కురూపిగా, అంగవైకల్యంతో ఉన్న భార్యను అంతులేని ఓరిమితో, సహనంతో చూసుకుంటూ, జీవితాంతం అనుబంధాన్ని కలిగివుండే భర్తలను మనం ఈ దేశంలో మాత్రమే చూడగలం. ఒక పనికిమాలినవాడు, దుర్మార్గుడు అయిన భర్త పట్ల జీవితాంతం భక్తిని చూపే భార్యలను మనం ఈ దేశంలోనే చూడగలం. అయితే అంతవరకే దానిలోని మంచి...”*

ఇలా కర్తవ్యనిష్ఠ ద్వారా మనిషి సాధించగలిగే అత్యుత్తమ ఫలితాలను భారతదేశంలోని మనుష్యులు సాధించారని స్వామీజీ చెప్పారు. సమాజం కోసం, కుటుంబం కోసం, ముందు తరాల కోసం తమ సర్వస్వాన్నీ ఒడ్డి, తమ సొంతానికి ఏమీ ఆశించకుండా, అంతులేని నిస్వార్థగుణంతో పనిచేయగల మనుష్యులు, పనిచేసిన మనుష్యులు, ఒక్క భారతదేశంలో మాత్రమే కనిపిస్తారు. దీనివల్ల భారత సమాజం అత్యున్నతమైన శాంతిసౌభాగ్యాలతో విలసిల్లింది. కానీ గత వెయ్యి సంవత్సరాలలో పరిస్థితులు అలా నిలబడక, సమాజం దిగజారిపోయింది. (దీనికి కారణాలు అనేకం. స్వామీజీ సారస్వతంలో వాటిని చదువవచ్చు.) ప్రజలు “గుడ్డెద్దు చేలో పడ్డట్టు” యాంత్రికంగా పని చేయసాగారు. వారి మనఃస్థితిని గురించి స్వామీజీ ఇలా వివరించారు.

*“...కానీ మనం పైన చెప్పుకున్న సందర్భాలలో చాలావరకూ నిర్జీవమైన*

*యంత్రాలలాగా పనిచేసే మనుష్యులే కనిపిస్తారు. వారిలో ఎటువంటి మానసికమైన చలనం, హృదయ వికాసం, జీవం, చలనం, ఆశ కనిపించవు. వారిలోని సంకల్పశక్తి వారికి ఏ విధమైన స్ఫూర్తినీ కలిగించదు. వారికి గొప్ప సుఖం కానీ, గొప్ప దుఃఖం కానీ అనుభూతికి రావు. వారి మనస్సులలో నుంచి నిరాశానిస్పృహల మబ్బులు తొలగిపోవు. సూర్యోదయపు అద్భుతమైన సుందరదృశ్యం వారి హృదయాలను రంజింపజేయలేదు. తామున్న పరిస్థితికన్నా గొప్ప స్థితిగతులు ఉన్నాయేమోనన్న ఆలోచన వారి మనస్సులలో పొరపాటున కూడా కలుగదు. ఒకవేళ ఆ ఆలోచన కలిగితే అది వారికి నమ్మకాన్ని కలిగించలేదు. ఒకవేళ నమ్మకం కలిగినా దాన్ని సాధించడానికి కావలసిన ప్రయత్నం కొరవడుతుంది. ఒకవేళ వారు ప్రయత్నం చేయాలని మొదలుపెట్టినా సరిపడినంత ఉత్సాహం లేకపోవడం వల్ల అది త్వరలోనే ఆగిపోతుంది."*

ఇలా మన్నుతిన్న పాములలాగా తయారైన జాతికి మళ్ళీ జీవం పోయాలని స్వామీజీ గొప్పగా తపన చెందారు. భారతదేశ చరిత్రలో కర్తవ్యనిష్ఠ ఇలా విఫలమవ్వడానికి కారణం దానికి తగిన విద్యను జోడించకపోవడమేనని స్వామీజీ నొక్కిచెప్పారు. అటువంటి విద్య వల్ల కలిగే సంకల్పశక్తి లభించకపోవడం వల్లనే మనుష్యులు యంత్రాలుగా, బానిసలుగా తయారయ్యారు. కర్తవ్యనిష్ఠ సఫలీకృతం కావాలంటే ఏమి చెయ్యాలో స్వామీజీ చక్కగా వివరించారు.

## 37. సంకల్పశక్తి, సంస్కృతి లేని కర్తవ్యనిష్ఠ వ్యర్థం

"గుడ్డెద్దు చేలో పడ్డట్టు" చేసే కర్తవ్యం వల్ల ప్రయోజనం లేదు. స్వామీజీ ఇలా చెప్పారు. *"...ఇలా ఒక నియమాన్ని అనుసరించి జీవించడమే ప్రతిభను సాధించగలిగినదైతే, తరతరాలుగా వస్తున్న నియమాలను, ఆచారవ్యవహారాలను కఠినంగా పాటించడమే సుగుణమైతే, ఒక చెట్టుకన్నా సుగుణవంతుడైనవాడు ఎవరో*

చెప్పండి? ఒక రైలుబండి కన్నా గొప్ప భక్తుడు, సత్పురుషుడు ఎవరుంటారో చెప్పండి? ఒక బండరాయి ఏదైనా ప్రకృతి నియమాన్ని అతిక్రమించడం మీరు చూశారా? పశువులు పాపం చెయ్యగా ఎవరైనా చూశారా?"

"ఒక పెద్ద ఓడ, ఒక పెద్ద రైలు ఇంజను కదులుతాయి, ప్రక్కలకు తిరుగుతాయి, పరిగెత్తుతాయి. కానీ వాటికి జీవం లేదు. వాటిలో చైతన్యం లేదు. కానీ ఆ రైలు పట్టామీద కూర్చున్న చిన్న పురుగు సమయానికి ప్రక్కకు తప్పుకుని ఆ రైలు క్రింద పడకుండా తన ప్రాణాలను కాపాడుకుంటుంది. ఎందుకంటే దానిలో చైతన్యం ఉంది. కానీ ఒక పెద్ద బండరాయి పట్టాలకు అడ్డంగా పడితే ఆ రైలుబండి దానికి గుద్దుకుని నాశనమవుతుంది. ఎందుకంటే ఆ యంత్రంలో చైతన్యం, సంకల్పశక్తి లేవు! ఆ యంత్రం ఎప్పుడూ తన నియమాలను దాటిపోవాలని అనుకోదు. కానీ ఆ పురుగు ప్రకృతి నియమాలను వ్యతిరేకించాలని అనుకుంటుంది. ఆ చిన్న పురుగు నెగ్గుతుందా, ఓడిపోతుందా అన్నది వేరే విషయం. అది ముందు ప్రకృతి నియమాలను వ్యతిరేకించడానికి ప్రయత్నిస్తుంది. అందుకనే దానిలో చైతన్యం ఉందని చెప్పవచ్చు. ఒక జీవిలోని సంకల్పశక్తి ఎంతగా వ్యక్తీకరించబడితే ఆ జీవి అంత గొప్పది అవుతుంది, దానికి అంత ఎక్కువ ఆనందం కలుగుతుంది." కాబట్టి మనం నేర్చుకునే విద్య మన సంకల్పశక్తిని వృద్ధి చెయ్యాలి.

## 38. కర్తవ్యనిష్ఠను సఫలీకృతం చేసే విద్య

"విద్య అంటే ఏమిటి? పుస్తకాలనుంచి నేర్చుకునేదా? కాదు. రకరకాల విషయాలను గురించిన పరిజ్ఞానమా? అది కూడా కాదు. ఏమి నేర్చుకోవడం వల్ల మనిషికి ఉండే సంకల్పశక్తి యొక్క ప్రవాహం, వ్యక్తీకరణ అతని స్వాధీనంలోకి వచ్చి, అతని జీవితంలో ఉపయోగపడి, ఫలవంతమౌతాయో దాన్ని విద్య అనవచ్చు. ఏ

*విద్యవల్ల తరతరాలుగా మనిషిలోని సంకల్పశక్తి యొక్క గొంతు నొక్కబడుతోందో, ఇంచుమించు చచ్చిపోయిందో దాన్ని విద్య అనగలమా? దేనివల్ల కొత్త భావాలే కాక మహత్తరమైన పాత భావాలు కూడా ఒక్కటొక్కటిగా మాయమయిపోతున్నాయో, ఏది మనిషిని నెమ్మదినెమ్మదిగా యంత్రంగా మార్చివేస్తోందో దాన్ని విద్య అనగలమా? నా ఉద్దేశ్యంలో ఒక మనిషి ఒక యంత్రంలా తప్పులు చేయకుండా ఉండేకంటే, తనలో సంకల్పశక్తికీ, బుద్ధిశక్తికీ స్వాతంత్ర్యాన్ని ఇచ్చి, వాటి ఆదేశం మేరకు పనిచేసి, పొరపడడమే మేలు. అంతేకాక మట్టిముద్దలలాంటి మనుష్యులతో, నిర్జీవమైన యంత్రాలలాంటి మనుష్యులతో, సమాజం ఒక గులకరాళ్ళ కుప్పలాగా ఉంటే దాన్ని అసలు సమాజం అని పిలువవచ్చునా? అటువంటి సమాజం ఏ విధంగా అభ్యుదయాన్ని సాధించగలదు? సంకల్పశక్తికీ, బుద్ధిశక్తికీ స్వాతంత్ర్యాన్ని ఇచ్చే విద్యను కనుక మనం మన జనబాహుళ్యానికి అందించి వుంటే, శతాబ్దాల తరబడి ఇలా బానిసలుగా ఉండే కన్నా మనం ఈ భూమి మీదే అత్యున్నత దేశంగా ఉండేవారం. ఇలా ఒక మూర్ఖత్వపు గనిగా ఉండే బదులు అఖండమైన విద్యకు పెన్నిధిగా ఉండేవారం"* అని స్వామీజీ చెప్పారు.

కాబట్టి మన విద్యలో సంస్కృతిని పునరుజ్జీవింపజేసి, సంకల్పశక్తిని పెంపొందించే విద్యను నేర్పి, మనుష్యులను తమ స్వతంత్రభావాలతో పనిచేయగలిగేవారుగా తయారు చెయ్యాలి. మనలోని దివ్యత్వాన్ని గురించి, కేవలం వస్తుసంపదలే మన గొప్పతనానికి కొలబద్దలు కావన్న విషయం గురించి, విద్య మనకు బోధించాలి. ప్రేమతో కూడిన కర్తవ్యనిష్ఠను విద్య పెంపొందించగలగాలి. అటువంటి విద్యను పునాదిగా చేసుకున్న మనుష్యులు కర్తవ్యనిష్ఠతో పనిచేసినప్పుడు అత్యుత్తమమైన వ్యక్తిత్వాలు, సమాజాలు నిర్మితమౌతాయి.

వివేకానంద స్వామి ఇలా చెప్పారు. "ఒక బెంగాలీ సామెత చెప్పినట్టు, 'రుద్ది, దిద్ది, అందాన్ని తయారుచేయలేము!' ప్రయత్నంతో ప్రేమ మొలకెత్తదు. ఎవరో మనకు అంటగట్టిన పని మీద ప్రేమ పుట్టడమనేది అరుదు. ఎప్పుడూ అడుక్కుతిందామని అనుకునేవాడు వైరాగ్యం గురించి గొప్పలు చెపితే దానికి అర్థమేముంటుంది? తన ఇంద్రియాలకున్న సుఖాన్నిచ్చే శక్తిని తెలుసుకోనివాడు, ఇంద్రియనిగ్రహాన్ని చూపిస్తానంటే దానికి అర్థమేముంది? ఆలోచన అన్నదే లేని మనిషి, హృదయంలేని మనిషి, ఉన్నతమైన ఆశయమేదీ లేని మనిషి, సమాజం అంటే ఏమిటో, ఏ విధంగా సమాజం రూపొందుతుందో తెలియని మనిషి, (సమాజం కోసం) ఆత్మత్యాగం చేస్తానంటే దానికి అర్థమేముంది? మనుష్యులకు మూఢనమ్మకాలను నేర్పి, వాటి ద్వారా వారిచేత పుణ్యకార్యాలు చేయించేందుకు బలవంతం చేయడమెందుకు? (మనుష్యులు మంచి ఏదో, చెడు ఏదో తెలిసిన విచక్షణాజ్ఞానంతో మంచి పనులు చెయ్యాలి.) నేను చెప్పేదేమంటే మనుష్యుల సంకెళ్ళను (అజ్ఞానాన్ని) వీలయినంత తొలగించండి. (తమలోని దివ్యశక్తి గురించి విద్య ద్వారా వారికి బోధించండి. అప్పుడు వారు తమంతటతాముగా మానవత్వంతో జీవిస్తారు.) ఎందుకంటే మురికిని మురికితో శుభ్రం చేయలేము కదా! ఉన్న బంధాలను మరిన్ని బంధాలను ఏర్పరచడం ద్వారా తొలగించలేము కదా!"

"ధీరుడైన మనిషి మాత్రమే తన స్వార్థాన్ని కాదనగలిగేవాడు. ఒక పిరికివాడు సమాజం ఝుళిపించే కొరడాకు భయపడి, ఏడుస్తూ, ఒక చేత్తో కళ్ళు తుడుచుకుంటూ, రెండవ చేత్తో దానం చేస్తాడు. అటువంటి దానాలవల్ల ఫలితమేముంటుంది? (చేసే పని మీద నిజమైన ప్రేమ లేకుండా చేసే మంచి పనుల వల్ల, కర్తవ్యాల వల్ల మనిషికి పరిణతి, పరిపూర్ణత ఎలా కలుగుతాయి?) మొత్తం సమాజానికే సేవచేయగలిగే విశ్వజనీనమైన ప్రేమ అని దాన్ని ఎలా అనగలం?"

*"కాబట్టి నిజమైన ప్రేమను సాధించాలంటే; మొత్తం సమాజానికే సేవ చేయగలిగిన సత్తా గల ప్రేమను సాధించాలంటే; మనిషి ముందుగా 'ఏదోవొక విషయాన్ని నిస్వార్థంగా ప్రేమించడం' నేర్చుకోవాలి. ఒక విషయాన్ని నిష్ఠతో సాధనచేస్తే, మిగిలిన విషయాలు వాటంతట అవే పట్టుబడతాయి. మొక్క చిన్నదిగా ఉన్నప్పుడు దానికి కంచె వేసి రక్షించాలి కదా!"* ఆ విధంగా స్వామీజీ జీవితపు తొలిదశలలో ఉన్నవారు నిష్ఠతో, ప్రేమతో ఒక కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించడాన్నే విద్యగా నేర్చుకోవాలనీ, అలాంటి విద్య వల్ల క్రమంగా జీవితంలోని అన్ని రంగాలలోనూ విజయం సాధిస్తారనీ చెప్పారు.

## 39. పాశ్చాత్య నాగరికత ప్రబలడంవల్ల కలిగిన దుష్ఫలితాలు

భౌతికమైన సంపదలు (అర్థం, కామం) అవసరమే. అయితే వాటిమీద కోరికను మనిషి (ధర్మం ద్వారా) అదుపులో పెట్టుకోవాలి. కానీ అవే సర్వస్వమనీ, సమాజం సంపన్నులను మాత్రమే గౌరవిస్తుందనీ భావించినప్పుడు, వాటిని న్యాయంగా సంపాదించే శక్తిలేని వారందరూ ఏదోవొక విధంగా వాటిని సంపాదించడానికి ప్రయత్నిస్తారు. దీనివల్ల సమాజంలో దుర్మార్గం పెరిగి, అది పోటీకి దారితీస్తుంది. ముఖ్యంగా, వస్తుసంపదలే పరమగమ్యమని నమ్మే పాశ్చాత్య నాగరికత వల్ల, ఈ ఆధునికయుగంలో మన జనావళి మీద పడిన దుష్ప్రభావాన్ని స్వామీజీ వివరించారు.

*"...మరొకవైపు నుంచి ఐరోపా, 'ఒక మనిషి ఎంత సంపాదించవచ్చును? ఏదోవొక విధంగా మనిషి ఎంత అధికారాన్ని చేజిక్కించుకోగలడు? న్యాయమో, అన్యాయమో - దానికి ఏ పద్ధతి వాడినా ఫర్వాలేదు' అని ఆలోచిస్తోంది. క్రూరమైన, హృదయమే లేని, వెన్నులో చలిపుట్టించే పోటీతత్వమే యూరోపు నాగరికతల సందేశం. కానీ దానికి మన సమాధానం వర్ణాశ్రమ వ్యవస్థ. దాని ద్వారా పోటీని తగ్గించి, దాని శక్తుల్ని అదుపులో పెట్టి, దానిలోని క్రూరత్వాన్ని తొలగించి, ఈ సంసారచక్రంలో నుంచి*

*సులువుగా, ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ, జీవాత్మ (మానవుడు) ప్రయాణించేందుకు తోడ్పడుతుంది.”*

*“చరిత్రను పరిశీలించినప్పుడు ఐరోపా ప్రజల లక్ష్యంగా కనిపించేది ఒక్కటే – ప్రపంచంలో అందరినీ తుదముట్టించి తాము ఒక్కరమే జీవించడం వారి లక్ష్యం. కానీ మన పూర్వీకులైన ఆర్యుల లక్ష్యమేమిటంటే అందరినీ తమ స్థాయికి లేవనెత్తడం. అంతేకాదు తమకంటే ఉన్నతస్థాయికి కూడా లేవనెత్తడం. ఐరోపా నాగరికత చిరకాలంగా అనుసరించిన పద్ధతి తెగనరకడమే. కానీ ఆర్యుల విధానం సమాజంలోని వ్యక్తుల్ని వేరువేరు వర్ణాలుగా వర్గీకరించడం. ఈ విధంగా వ్యక్తులను వేర్వేరు వర్ణాలుగా వర్గీకరించడంవలన, ఆయా మనుష్యుల శక్తిసామర్థ్యాలలోని ఎక్కువతక్కువలతో సంబంధం లేకుండా, ఈ వర్ణాలు అనే మెట్లను క్రమక్రమంగా ఎక్కుతూ, అందరూ ఉన్నత సంస్కృతిని సాధిస్తారు. మనుష్యులు తమ కృషికి తగినట్టు, తాము నేర్చుకున్న విద్యకూ, తాము అలవరచుకున్న సంస్కృతికీ తగినట్టు క్రమక్రమంగా ఎదిగి సమాజంలో మరింత గొప్పస్థాయులకు ఎదుగుతాడు. ఐరోపా చరిత్రలోనూ, ప్రస్తుత సమాజంలోనూ, ఎక్కడ చూసినా బలం కలవాడిదే విజయం, బలహీనుడికి మరణమే శరణ్యం. కానీ ఈ భరతభూమిలో ఏర్పరచబడ్డ ప్రతి సామాజిక నియమం బలహీనుల రక్షణ కోసం ఉద్దేశించబడినదే.”*

కాబట్టి సమాజంలో పోటీ అనే శక్తిని అదుపుచేసి, సరైన త్రోవలో పెట్టినప్పుడు సమాజం, వ్యక్తులు శాంతిసౌఖ్యాలను పొందుతారు.

## 40. అసలు పోటీతత్త్వం అవసరమా?

ఆస్తిపాస్తులు సంపాదించడం కోసం, పేరుప్రఖ్యాతులు సంపాదించడం కోసం సమాజంలో మనుష్యులు ఒకరితోఒకరు పోటీపడినప్పుడు అది వారిని మరింత

మెరుగైన వ్యక్తులుగా తయారుచేస్తుందని పాశ్చాత్యులు భావిస్తున్నారు. దీనికి ముఖ్యమైన ఊతంగా నిలిచినది డార్విన్ చెప్పిన 'బలంగలవాడిదే రాజ్యం' అన్న సిద్ధాంతం. అది జంతువులకే వర్తిస్తుంది కానీ మనుష్యులకు కాదు. అయితే కోతి నుంచి పుట్టిన మనిషి కూడా జంతువులాగానే ప్రవర్తిస్తాడనీ, జంతువులా బలం చూపడం వల్లనే తాను కూడా అభివృద్ధి సాధిస్తాడనీ పాశ్చాత్యులు చెపుతున్నారు. కానీ ఆ భావాలు ఎందుకు సమగ్రమైనవి కావో, పోటీతత్వం వల్ల నష్టాలు ఏమిటో, స్వామీజీ వివరించారు.

*"బాహ్యమైన విషయాలు (కామకాంచనాలు, ఆస్తిపాస్తులు, పేరుప్రఖ్యాతులు) మనకు ప్రేరణలుగా కొంతవరకే ఉపయోగపడగలవు. వాటి ప్రయోజనం అంతవరకే. వాటివల్ల కలిగే పోటీతత్త్వం, 'బలంగలవాడిదే రాజ్యం' మొదలైన చెడుభావనలన్నీ మన అభివృద్ధికి దోహదపడే కారణాలుగా ఏమాత్రం పనిచెయ్యబోవు. నిజానికి అవి మన అభివృద్ధికి అడ్డుపడుతున్నాయి. అవి లేకపోయినా మనిషి చక్కగా పురోగతి సాధించి దైవత్వాన్ని పొందగలడు. ఎందుకంటే మనిషి స్వభావమే దైవత్వం – అంతేకాక ఆ దైవత్వానికున్న స్వభావం ఏమిటంటే తనంతట తానుగా బయటకు వచ్చి తనను తాను వ్యక్తీకరించుకోవడమే. తలచుకుంటేనే మనస్సులో భయోత్పాతాన్ని సృష్టించే ఆ పోటీతత్త్వం అనే భావం కన్నా 'మన స్వభావమే దివ్యత్వం' అనే భావనే నా మనస్సుకు ఎంతోకొంత ఆశలు రేకెత్తించేదిగా కనపడుతోంది. చరిత్రను మరింతగా అధ్యయనం చేసిన కొద్దీ నాకు మానవాళి పురోభివృద్ధికి పోటీతత్వమే చక్కగా దారి చూపెట్టగలదన్న భావం తప్పుగా కనిపిస్తోంది. మనిషి తన తోటి మనిషితో పోరాడకపోతే ప్రగతి సాధించలేడని కొందరు చెపుతున్నారు. చిన్నప్పుడు నేను కూడా అదే నిజమని నమ్మాను. కానీ ఇప్పుడు నాకు ఏమనిపిస్తోందంటే ఈ భూమిమీద జరిగిన ప్రతీ యుద్ధం మానవప్రగతిని ముందుకు ఉరికించే బదులు యాభై ఏళ్ళు వెనక్కి నెట్టింది. మనుష్యులు వేరే దృక్కోణంలో నుంచి చరిత్రను అధ్యయనం చేసే రోజు త్వరలోనే వస్తుంది. అప్పుడు మానవ పురోగతికి పోటీ*

*కారణం కాదనీ, ఫలితం కూడా కాదనీ, కేవలం అది ఒక అడ్డంకి మాత్రమేననీ, మానవ పురోభివృద్ధికి దాని అవసరం ఎంతమాత్రం లేదనీ తెలుసుకుంటారు,"* అని స్వామీజీ పోటీతత్త్వం గురించి తన అభిప్రాయాలను వెల్లడించారు.

జీవులు ఒకదానితో ఒకటి పోటీపడడం ద్వారా కాక ఒకదానితో మరొకటి సామరస్యంతో, సర్దుకుపోయి జీవించడానికి ప్రయత్నించడం ద్వారా పరిణామాన్ని సాధిస్తున్నాయి. అసలు పోటీతత్త్వానికి ఉండవలసిన నిజమైన దృక్పథం మరొకరితో పోటీపడి ఓడించడం కాదు. మిగిలిన జీవులలోని దివ్యత్వాన్ని గుర్తించి, వాటితో సర్దుకుపోవడానికి ప్రయత్నించడమే దాని పరమార్థం. అలా చెయ్యడం ద్వారా మనిషి ఇతరులతో నిరంతరం పోరాడవలసిన అవసరం ఉండదు. పైకి చూడడానికి పోరాటంలాగా కనిపించే ఈ సర్దుబాటు యొక్క నిజమైన ఆశయం అన్ని పోరాటాలనూ దాటిపోవడమే. స్వామీజీ దీన్ని వివరించే ఒక భారతీయ సిద్ధాంతాన్ని చెప్పారు.

*ఇప్పుడు ఒక సిద్ధాంతం గురించి చర్చిద్దాము. ప్రత్యేకించి మన భరతభూమిలో మాత్రమే ఇటువంటి విస్తుగొలిపే, విలక్షణమైన ఈ సిద్ధాంతం తయారుకాగలదు; దేశంలోని మతవర్గాలన్నీ ఆమోదించే భావం ఇదొక్కటే. భారతదేశం యొక్క మొత్తం తత్త్వజ్ఞానానికి ఇది పునాది లాంటిది. ఈ భావాన్ని ఇప్పుడు వివరిస్తాను. పాశ్చాత్య ప్రపంచంలో జర్మనీ, ఇంగ్లాండు దేశాల వైజ్ఞానికులు బోధించిన భౌతికపరిణామవాద సిద్ధాంతాన్ని మీరు వినేవుంటారు. దాని ప్రకారం రకరకాలుగా కనిపించే జంతువుల శరీరాలన్నీ నిజానికి ఒక్కటే. మనకు కనిపించే భేదాలన్నీ ఒకే వరుసక్రమంలోని రూపాంతరాలు. అత్యల్పమైన ఒక కీటకం నుంచి అత్యున్నతుడైన మనిషి దాకా, అంతా ఒకటే. ఒక జీవి మరొక రూపంలోకి రూపాంతరం చెందుతూ, పైపైకి ఆరోహిస్తూ, పరాకాష్ఠకు చేరేవరకూ ఇంకాయింకా ఎదుగుతుంది.*

*భారతదేశంలోనూ ఈ భావం ఉంది. "జాత్యంతర పరిణామః ప్రకృత్యా పూరాత్"* –

అని మహర్షి పతంజలి ప్రకటించారు. ఈ యోగసూత్రం ప్రకారం ఒక జాతి జంతువులు వేరొక జాతిగా రూపాంతరం చెందుతాయి (జాతి అంటే స్పీషీస్). దీనినే పరిణామం అంటారు. మరి దీనికి, ఐరోపావాసుల సిద్ధాంతానికి తేడా ఎక్కడ వస్తుంది? పతంజలి మహర్షి "ప్రకృత్యా పూరాత్" అని పేర్కొన్నారు – అంటే జాతుల మధ్య అంతరం 'ప్రకృతి చేతనే పూరించబడుతోంది' అని అర్థం. కానీ ఐరోపావాసులైన శాస్త్రజ్ఞులు ఒక జాతి మరొక జాతిగా రూపాంతరం చెందడం అనేది ఆయా జాతుల మధ్య పోటీవల్లనూ, బలమైన ప్రాణులు సహజ, లైంగిక పద్ధతులలో బలవంతంగా ఎంపిక చేయబడడంవల్లనూ జరుగుతోందని తీర్మానించారు. దానికన్నా ఈ "ప్రకృతి చేత పూరణం" అనే ప్రక్రియ మరింత లోతుగా ఆలోచించి, మరింత మెరుగ్గా విశ్లేషించి చేయబడ్డ ప్రతిపాదన. ఈ "ప్రకృతి చేత పూరణం" అంటే ఏమిటి?

మనందరికీ శక్తినిత్యత్వసూత్రం (ది లా ఆఫ్ కన్సర్వేషన్ ఆఫ్ ఎనర్జీ) తెలుసు. దాని ప్రకారం, ఒక యంత్రంలో నుంచి మనం ఎంత పనిని రాబట్టాలనుకుంటున్నామో, అంతే మొత్తంలో శక్తిని ఏదో ఒక రూపంలో దానికి అందించకుండా ఆ పనిని రాబట్టలేమని కూడా మనం కచ్చితంగా అంగీకరిస్తున్నాం. అది ఎన్ని రూపాలలోకైనా మారవచ్చు గాక, ఆ శక్తి యొక్క మొత్తం పరిమాణం మాత్రం స్థిరంగా ఉంటుంది. ఒక కొన నుండి మీరు కొంత శక్తిని పొందాలనుకుంటే, అంతే శక్తిని మీరు రెండవ కొనకు అందించాలి. అది వేరే రూపంలో ఉండవచ్చునేమో కానీ, మీరు బయటకు పొందాలనుకుంటున్న శక్తికి అది సమానంగా ఉండాలి.

అదే విధంగా, ఒక అమీబా పైపైకి పరిణామం చెంది, ఒక మనిషిగానూ, ఇంకా ఉన్నతంగా ఎదిగి ఒక బుద్ధుడిగానూ పరిణమిస్తుందని మనం అంగీకరించవచ్చు. ఈ పరిణామక్రమంలో ఒక కొనలో అమీబా ఉండి, మరొక కొనలో బుద్ధుడు ఉన్నట్లైతే ఆ అమీబాయే ఈ బుద్ధుడు అయివుండాలి. బుద్ధుడు అమీబాలో నుంచి పరిణమిస్తే, ఈ

బుద్ధుడే పరిణతి చెందని స్థితిలో ఉన్నప్పుడు ఆ అమీబా అయివుండాలి.

ఈ విశ్వం ఇంచుమించు అనంతమైన శక్తితో రూపుదిద్దుకున్నదైతే, ఇదే విశ్వం ప్రళయస్థితిలో ఉన్నప్పుడు కూడా అంతే పరిమాణంలో స్థితిశక్తిని కలిగి ఉండాలి. ఇది మరొక విధంగా ఉండివుండడానికి వీలులేదు. ఇదే విధంగా ప్రతి ఆత్మ అనంతమైనదే అవుతుంది. మన కాళ్ళ క్రింద ప్రాకుతున్న అతిచిన్న పురుగు నుండి అత్యున్నతులైన మహర్షుల వరకూ ప్రతిఒక్కరూ ఈ అనంతమైన శక్తిని, అనంతమైన పవిత్రతను, అనంతమైన ప్రతి దాన్నీ కలిగి ఉండవలసిందే. కాకపోతే ఆ శక్తి ఏ స్థాయిలో వ్యక్తీకరించబడిందన్న దానిలో తేడాలుంటాయి. ఆ చిన్న పురుగు ఆ అనంతమైన శక్తిలోని ఒక చిన్న భాగాన్ని మాత్రమే వ్యక్తీకరిస్తుంది. మీరు ఇంకొంత ఎక్కువ వ్యక్తీకరిస్తున్నారు, మరొక సాధుపుంగవుడు ఇంకా ఎక్కువ వ్యక్తీకరిస్తున్నాడు. ఈ తేడాలు అంతవరకే. కానీ ఆ అనంతమైన శక్తి మాత్రం అందరిలో ఒకేలా ఉంటుంది.

ఇంకా పతంజలి, "తతః క్షేత్రికవత్ – ఒక రైతు తన పొలానికి నీరు పెట్టినట్టు!" అని చెప్పారు. తన పంటకు నీరు పెట్టడానికి ఎక్కడో ఉన్న జలాశయం నుంచి లేదా చెరువు నుంచి తన పొలంలోని ఒక మూలకు నీటిని రప్పిస్తాడు. నీరు పొలంలోకి ప్రవహించకుండా ఆపడానికి, బహుశా అతడు ఒక అడ్డుకట్టను లేదా లాకును నిర్మించే ఉంటాడు. అతడు నీరు పెట్టాలనుకున్నప్పుడు ఆ అడ్డుకట్టను తొలగిస్తే చాలు, నీరు తనంతట తానే పొలంలోకి ప్రవహిస్తుంది. క్రొత్తగా నీటికి మరింత శక్తిని జోడించవలసిన పనిలేదు. ఎందుకంటే జలాశయంలోని నీటికి ముందునుంచే ఆ శక్తి ఉంది. అదే విధంగా మనలోని ప్రతిఒక్కరికీ, ప్రతిజీవికీ వెనుక ఒక తటాకంలాగా ఆ అనంతమైన శక్తి, అనంతమైన పవిత్రత, అనంతమైన ఆనందం, శాశ్వతమైన స్థానం ఉన్నాయి. అయితే అటువంటి మన నిజస్వరూపాలను పూర్తిగా వ్యక్తీకరించడానికి, ఈ లాకులు లేదా శరీరాలు అడ్డంగా నిలుస్తున్నాయి.

పై చర్చను చదివిన తర్వాత ప్రతి మనిషిలోనూ అనంతమైన శక్తి ఉంటుందనీ, మనిషి ఎంత కృషి చేస్తే, అంతగా తనలోని దివ్యశక్తిని వ్యక్తీకరించగలుగుతాడని తెలుసుకోవచ్చు. దానికోసం తోటివారిని అణగద్రొక్కవలసిన పనిలేదు. దీని గురించి స్వామీజీ ఇంకా వివరించారు.

*“బాధ్యతను తనమీదే వేసుకుని, ప్రపంచంలోకి పోయి పనిచేసి పురోగతినీ, పరిణామాన్నీ సాధించే ఓపిక మనిషికి లేదు. (దానికి బదులు ఇతరులలో తప్పులు పట్టడం ద్వారానో, వారిని అణిచివేయడం ద్వారానో తాననుకున్నది సాధించాలనుకుంటాడు. తనను తాను సరిదిద్దుకోవడం ద్వారా పరిణతి సాధించాలని అనుకోడు.) ఉదాహరణకు ఒక నాటకశాలలో అగ్ని ప్రమాదం సంభవించిందనుకోండి – కొద్దిమంది మాత్రమే ప్రాణాలతో బయటపడతారు. మిగిలినవారందరూ బయటకు వచ్చే తొందరలో ఒకరినొకరు తొక్కుకుంటూ ఆ భవనంలోనే చిక్కుకుపోయి మరణిస్తారు. నిజానికి, ‘ఆ భవనానికి ముక్తి లభించడానికి’ కానీ, ఆ బ్రతికిబట్టకట్టిన ఒకరిద్దరు బయటపడడానికి కానీ ఆ తొక్కిసలాట అవసరం లేదు. అందరూ నెమ్మదిగా నడిచివుంటే ఏ ఒక్కరికీ వెంట్రుకంత హాని కూడా జరిగేది కాదు. మన జీవితంలో, ఈ ప్రపంచంలో కూడా ఇదే పరిస్థితి. తలుపులు తెరిచి వున్నాయి! ఎటువంటి పోటీలూ, పోరాటాలూ లేకుండానే మనందరం చక్కగా ముందుకు పురోగమించవచ్చు. ఈ పోరాటమంతా అజ్ఞానం వల్ల, ఓరిమిలేనితనం వల్ల మనం తయారుచేసుకున్నదే. ఎందుకంటే మన అతి తొందరపాటుతనం వల్లనే ఇలా జరుగుతున్నది. మనలోని బలానికి అత్యున్నతమైన వ్యక్తీకరణ మనల్ని మనం శాంతంగా ఉంచుకోవడంలోనూ, మన కాళ్ళమీద మనం ఆధారపడడంలోనూ మాత్రమే నిజంగా కనిపిస్తుంది,”* అని పతంజలి యోగసూత్రాలను సమర్థిస్తూ స్వామీజీ చెప్పారు.

అన్నిటికీ మించి, మానవజాతి ప్రగతిని సాధించడానికి పోటీతత్త్వం కంటే బలం, ఉదాత్తమైన నిస్వార్థబుద్ధి మరింత దోహదం చేస్తాయన్న విషయాన్ని సమర్థిస్తూ స్వామీజీ, *"...నిస్వార్థమే మనిషికి మరింత చేకూర్చగలదు. అయితే దాన్ని అభ్యసించేంత ఓపిక మనుష్యులకు ఉండదు!"* అని చెప్పారు.

## 41. పోటీతత్వం మానవపరిణామానికి అవరోధం

మానవసమాజంలో పరిణామం ఎలా జరుగుతుందో వివేకానంద స్వామి వివరించారు. *"... ఈ విషయాన్ని మన సాంఖ్యతత్త్వంలో అనాదికాలంలోనే వివరించారు. సనాతనులైన భారతీయ తత్త్వవేత్తలు పరిణామక్రమానికి కారణాలుగా చూపినవే సరైన కారణాలని నా విశ్వాసం."*

*"పరిణామక్రమాన్ని గురించి చక్కగా వివరించిన తత్త్వవేత్త పతంజలి మహర్షి. ఆయన డార్విన్ చెప్పిన కారణాలను చెప్పలేదు. ఒక జాతి మరొకజాతిగా పరిణామం చెందడానికి కారణం 'ప్రకృత్యా పూరాత్' లేదా 'ప్రకృతి పూరణం!" - అంటే ఒక జీవి మనుగడకు కావలసిన లక్షణాలు కొరవడినప్పుడు ప్రకృతి తానుగా ఆ లోటును భర్తీ చేస్తుందని, ఆ జీవి విజయవంతంగా మనుగడ సాగించడానికి కావలసిన కొత్త లక్షణాలను ప్రకృతే అందిస్తుందనీ, అంతేకానీ నిరంతర పోరాటం దీనికి కారణం కాదనీ, చెప్పాడు. నా ఉద్దేశ్యంలో పోరాటం, పోటీతత్వం మనిషి పరిపూర్ణతను సాధించడానికి అడ్డుగా నిలుస్తాయి. ఒక జాతి పరిణామం సాధించడానికి వెయ్యిమంది మనుష్యులు నాశనం కావలసివస్తే అటువంటి పరిణామం వల్ల ప్రపంచానికి చాలా కొద్దిగా మాత్రమే మేలు జరుగుతోందని ఒప్పుకోక తప్పదు."*

*"జంతువుల స్థాయిలో డార్విన్ సిద్ధాంతం పనిచేస్తూ కనిపించవచ్చు. అందువల్ల అది నిజమేనని, హేతుబద్ధమని తోస్తుంది. కానీ మనుష్యుల స్థాయిలో మనం*

*హేతుబద్ధంగా విచక్షణాజ్ఞానంతో ఆలోచించే శక్తిని చూడవచ్చు. అందువల్ల జంతువుల స్థాయిలోని నియమాలకు సరిగ్గా వ్యతిరేకమైన నియమాలు మానవ సామ్రాజ్యంలో పనిచేస్తాయి. ఉదాహరణకు మహావ్యక్తుల, ఆదర్శపురుషుల జీవితాలను మనం నిజంగా తరచి చూచినప్పుడు వారు బాహ్యమైన పోరాటం (అంటే ఆస్తిపాస్తుల కోసం, పేరుప్రఖ్యాతుల కోసం పోరాటం) జరుపుతున్నట్లు ఎంతమాత్రం కనిపించదు. పుట్టుకతో వచ్చే ఈ స్వభావం జంతుసామ్రాజ్యంలో బలంగా పనిచేస్తూ ఉన్నట్లు కనిపిస్తుంది. (కానీ మానవసామ్రాజ్యం విషయం వేరుగా ఉంటుంది.) మనిషి అభివృద్ధి చెందేకొద్దీ అతనిలో మరింత విచక్షణా జ్ఞానం వికసిస్తుంది. ఈ కారణం వల్లనే ఈ విచక్షణ అనే గుణాన్ని కలిగివుండే స్థాయికి చేరుకున్న మానవ సామ్రాజ్యంలో జంతుసామ్రాజ్యంలోలాగా ఇతరులను నాశనం చెయ్యడం ద్వారా అభివృద్ధి సాధించడం సాధ్యం కాదు. త్యాగగుణాన్ని అలవరచుకోవడం ద్వారా మాత్రమే మనిషి అత్యున్నతమైన పరిణతిని సాధించగలడు."*

## 42. బలమైన శరీరం లేనిదే కర్తవ్యనిష్ఠ సాధ్యం కాదు

శారీరికమైన శక్తి లేకుండా వ్యక్తులు వారి కర్తవ్యాన్ని నిష్ఠతో ఆచరించలేరు. వ్యక్తులు వారివారి వృత్తి వ్యాపారాలనూ, వయస్సునూ దృష్టిలో ఉంచుకొని అందుకు తగిన ఆహారాన్ని తీసుకోవాలి. తమ కర్తవ్యాన్ని అనుసరించి అందుకు తగిన అలవాట్లను రూపొందించుకోవాలి. ఏది ఎందుకు చేస్తున్నామో తెలుసుకోకుండా, అజ్ఞానంతో ప్రవర్తించడం వ్యక్తిత్వనిర్మాణానికి దోహదం చెయ్యదు కదా! శారీరికబలం కొరవడడం వలన తన కర్తవ్యాన్ని మనిషి నిర్వర్తించలేకపోవడం పాపమని స్వామీజీ హెచ్చరించారు. కాబట్టి, శారీరకబలాన్ని తగినంతగా పెంపొందించుకోవడం కూడా మనిషి కర్తవ్యమవుతుంది.

వివేకానంద స్వామి చారిత్రకంగా మన దేశంలో ప్రజల ఆహార అలవాట్లు ఎలా ప్రభావితమయ్యాయో వివరించారు. *"బౌద్ధమతం ప్రచారంలోకి వచ్చిన తరువాత మాంసాహారాన్ని ప్రజలు విడిచిపెట్టారు. అశోకుడు కత్తి చూపి, దండిస్తానని బెదిరించి, ప్రజలచేత మాంసం తినకుండా మానిపించాడు! దానివల్ల లక్షలాది జంతువులు బ్రతికిపోయాయన్నది నిజమే కానీ, దాని ఫలితంగా మనదేశం వేల సంవత్సరాలపాటు బానిసత్వంలో మగ్గిపోయింది. ఇలా దేశమంతా బానిస బ్రతుకులు బ్రతికేకంటే నాలుగు జంతువుల ప్రాణాలు తియ్యడమే మేలు కదా! నాలుగు మేకల ప్రాణం తియ్యడం ఘోరమా? లేకపోతే భార్యాబిడ్డల మానప్రాణాలు కాపాడలేక పోవడం, తన బిడ్డల నోటిదగ్గర కూటిని దొంగలు దోచుకుపోతుంటే కాపాడుకోలేకపోవడం ఘోరమా?"*

*"కాయకష్టం చేయవలసిన అవసరంలేని ఉద్యోగాలలో ఉన్నవారు, దైవభక్తులలాగా జీవించదలుచుకున్నవారు మాంసాహారాన్ని మానివెయ్యవచ్చు. కానీ అలా మాంసాహారాన్ని తినరాదనే ఉన్నతమైన ఆదర్శాన్ని దేశంలోని అందరి నెత్తిన రుద్దడం వల్లనే ఈ దారిన వచ్చిన ప్రతి విదేశీయుడికీ మనం దాసోహం అనవలసి వచ్చింది. మంచి పుష్టికరమైన ఆహారాన్ని తినడంవల్ల కలిగే మేలు ఏమిటో జపాన్ దేశస్థుల్ని చూసి నేర్చుకోవాలి" అని స్వామీజీ వివరించారు.*

మరొకసారి ఒక శిష్యుడు, "చేపల్ని, మాంసాన్ని ఆహారంగా తీసుకోవడం అవసరమా?" అని ప్రశ్నించాడు.

*వివేకానంద స్వామి ఇలా చెప్పారు. "ఔను నాయనా! వాటిని ఆహారంగా తీసుకోవాలి! మన దేశంలోని పేదల్ని చూడండి! వారి ముఖాలు ఎంత దీనంగా ఉన్నాయో చూడండి! వారి హృదయాలలో ధైర్యం, సాహసం, ఉత్సాహం ఏ మాత్రం కనిపించవు. మనదేశంలో మనుష్యులు పెద్దపెద్ద పొట్టలతో, కాళ్ళు చేతులలో ఏమాత్రం బలం లేకుండా ఎలా ఉన్నారో చూడండి! వారికి మనోబలం, గుండెధైర్యం ఎలా*

*కలుగుతాయి? ప్రతి చిన్న విషయానికీ అటువంటివారు భయపడిపోతూ ఉంటారు. ...మనకు అన్నిటికన్నా ముఖ్యంగా కావలసినది నిర్భయత్వమే కదా!"*

శారీరకబలం లేకుండా వ్యక్తిత్వనిర్మాణం ఎంత మాత్రం సాధ్యం కాదు. శిష్యుడు, "శారీరకబలాన్ని పెంపొందించుకోవడం గురించి మీరు అంత ఎక్కువగా చెపుతారెందుకు?" అని ప్రశ్నించాడు.

వివేకానంద స్వామి ఇలా సమాధానం చెప్పారు. *"మిమ్మల్ని మీరు మనుష్యులమని అనుకుంటున్నారా? మీకు కొద్దిగా తెలివితేటలు ఉన్నాయి, అంతే. కానీ బలమైన శరీరం లేకుండా మీరు కఠోరమైన పరిశ్రమ ఎలా చేయగలుగుతారు? (కఠోరమైన పరిశ్రమ లేకుండా దేనినీ సాధించలేము కదా!) ఈ భూమి మీద అత్యున్నతమైన పరిణతిని పొందిన జీవులు మనుష్యులు. కానీ అలా మనుష్యులమని పిలిపించుకునే అర్హత మీకు ఉందా? తినడం, నిదురపోవడం, కామ సంతృప్తిని పొందడం తప్ప మీరు ఇంకేమీ చెయ్యలేరు. మీరు నాలుగు కాళ్ళ మీద నడిచే జంతువులుగా దిగజారనందుకు మీ జన్మనక్షత్రాలకి కృతజ్ఞతలు చెప్పుకోవాలి! 'తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోగలిగినవాడే మనిషి' అని శ్రీరామకృష్ణులు చెపుతూ ఉండేవారు. మీరు మాత్రం శాస్త్రాలలో చెప్పినట్టు కేవలం పురుగులలాగా జీవితం గడుపుతున్నారు. ఈ జననమరణ సంసారచక్రంలో మళ్ళీమళ్ళీ పుడుతూ చస్తూ, మరింత ఉన్నత స్థితిగతులను పొందే శక్తి అణుమాత్రమైనా లేని దుస్థితిలో ఉన్నారు. పరస్పరం ద్వేషించుకుంటూ విదేశీయుల దృష్టిలో అసహ్యకరమైన వారిగా పేరుబడ్డారు."*

*"మీరు జంతువులలాగా బ్రతుకుతున్నారు. అందుకనే మిమ్మల్ని ముందు బలవంతులుగా తయారుకమ్మని చెపుతున్నాను. రకరకాల సిద్ధాంతాలన్నింటినీ ప్రస్తుతానికి ప్రక్కన పెట్టండి. అందుకు బదులు మీ రోజువారీ పనులలోనూ, ఇతరులతో మీ సంబంధ బాంధవ్యాలలోనూ, వ్యవహారాలలోనూ ఎలా ప్రవర్తిస్తున్నారో*

*పరిశీలించుకోండి. ఆయా విషయాలలో మీరు జంతువులలాగా ప్రవర్తిస్తున్నారన్న విషయం మీకే అర్థమవుతుంది. (బలహీనతే అటువంటి నీచమైన ప్రవర్తనకు కారణం.) కాబట్టి ముందుగా బలమైన శరీరాన్ని పెంపొందించుకోండి. అప్పుడు మాత్రమే మీ మనస్సు మీ స్వాధీనంలోకి వస్తుంది. కఠోపనిషత్తులో 'నాయమాత్మా బలహీనేన లభ్యః' అని చెప్పారు కదా! శారీరికంగా, మానసికంగా అఖండమైన బలం లేనివాడికి ఆత్మసాక్షాత్కారం సాధ్యం కాదనే దానికి అర్థం.* ***మొదట మీరు మంచి పుష్టికరమైన ఆహారంతో శరీరాన్ని బలంగా తయారుచేసుకోవాలి. అప్పుడు మాత్రమే మనస్సుకు బలం వస్తుంది.*** *ఎందుకంటే భౌతికమైన శరీరం యొక్క సూక్ష్మ అంశమే మనస్సు. ...కనీసం ఇరవై కిలోమీటర్లు ఆగకుండా నడవలేనివాణ్ణి మనిషి అని ఎలా పిలువగలం?"*

శరీరం బలంగా ఉన్న మనిషి మంచి విషయాలు నేర్చుకోగలుగుతాడు. తనను తాను మార్చుకోగలుగుతాడు. బలహీనుడికి ఆ శక్తి ఉండదు. ఏదైనా సాధిస్తే బలంగలవాడే సాధించాలి. బలహీనులైన మనుష్యులు కోపాన్ని, కామాన్ని అదుపు చేసుకోలేరు, భయాన్ని వదిలించుకోలేరు. వారికి సక్రమంగా ఆలోచించే శక్తి ఉండదు. క్రొత్త విషయాలను నేర్చుకోవడానికి, తమ వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నతమైనదిగా తీర్చిదిద్దుకోవడానికి కావలసిన ఓర్పూ, శక్తీ వారికి ఉండవు. ఇక అటువంటివారికి ధ్యానం, ఆధ్యాత్మిక సాధనలు మొదలైనవాటి ప్రసక్తే లేదు.

ఇంకా వివేకానంద స్వామి ఇలా చెప్పారు. *"మన దేశం అజీర్ణరోగులతో నిండిపోయింది. సత్త్వగుణం చూద్దామన్నా కనిపించడం లేదు. అందరూ గాఢమైన తమస్సులో మునిగి ఉన్నారు. అలా బతకడం కన్నా చావడమే మేలు. ముఖంలో తేజస్సు, హృదయంలో మొక్కవోని ఉత్సాహం, అలుపెరుగని చురుకుదనం – ఇటువంటి లక్షణాలు సత్త్వగుణం వల్ల కలుగుతాయి. తమస్సు వల్ల సోమరితనం,*

*బద్ధకం, తీవ్రమైన మమతానురాగాలు, నిద్ర కలుగుతాయి. చేపలు, మాంసం తినడం వల్ల రజస్సు పెరుగుతుంది నిజమే! కానీ ప్రస్తుతం మనకు కావలసింది రజస్సే. ఈ దేశంలో గొప్ప సత్త్వగుణం కలిగినవారుగా పేరుబడ్డవారిలో తొంభై శాతం నిజానికి అగాధమైన తమస్సులో మునిగి ఉన్నారు. వారిలో సత్త్వగుణం కలిగినవాళ్ళు నూటికి ఒక్కరు కూడా కనిపించరు. ఇలా దేశమంతా తమస్సు అనే ముసుగుతో కప్పబడివుంది. అందుకనే రాజసిక శక్తి ఒక బ్రహ్మాండమైన వెల్లువలా మేలుకోవాలి. లేకపోతే మనుష్యులు చెట్టుచేమల్లా, రాయిరప్పల్లా, జడపదార్థాలుగా పడివుంటారు. అందుచేతనే నాయనా! చేపల్ని, మాంసాన్ని వీలైనంత ఎక్కువగా తినమని నేను చెప్పేది!"* తమస్సు నుంచి నేరుగా సత్త్వగుణంలోకి దూకడం సాధ్యం కాదు. రజస్సును సాధించిన మీదటనే సత్త్వగుణానికి చేరడం సాధ్యమవుతుంది.

వివేకానంద స్వామి ఇంకా ఇలా చెప్పారు. *"మానవ సమాజంలో ఎంతవరకూ బలంగలవాడు బలహీనుణ్ణి అణచేందుకు ప్రయత్నిస్తూ ఉంటాడో అంతవరకూ మాంసాహారం అనేది కావలసిందే. లేకపోతే కనీసం మాంసాహారానికి తగిన ప్రత్యామ్నాయాన్ని కనుగొనే వరకూ. అలా కాకపోతే బలహీనులు బలవంతుల కాళ్ళ క్రింద నలిగిపోవలసి వస్తుంది. శాకాహారం తినడంవల్ల ఏ ఒక్కరికి గానీ, ఏ కొందరికి గానీ మంచి జరిగిందని మాట్లాడి ప్రయోజనం లేదు. కొన్ని శతాబ్దాల నిడివిలో, ఒక దేశాన్ని మరొక దేశంతో పోల్చి చూడండి! అప్పుడు ఒక నిర్ణయానికి రండి!"*

*"పుష్టికరమైన ఆహారాన్ని తినడంవల్ల కలిగే మేలు ఏమిటో జపాన్ దేశస్థుల్ని చూసి నేర్చుకోవాలి"* అని స్వామీజీ ఇంతకుముందు చెప్పగా చూశాము. ఆధునిక కాలంలో మనకు జంతువులలోనే కాక వృక్షాలలో కూడా ప్రాణమున్నదని స్పష్టంగా తెలుసు. హింస ఎక్కడైనా హింసే. మరొక జీవిని హింసించకుండా మనకు ఆహారమే దొరకదు. కాబట్టి, మనకి త్వరగా జీర్ణమై, మంచి బలాన్ని ఇవ్వగల పుష్టికరమైన ఆహారం

అవసరం. శరీరమూ, మెదడూ పెరిగే వయస్సులో ఉన్న బాలబాలికలకూ, యువతీయువకులకూ బలమైన ఆహారం, మంచి వ్యాయామం కావాలి. శారీరిక శ్రమచేసే వృత్తివ్యాపారాలలో ఉన్నవారికి అందుకు తగిన ఆహారం ఇవ్వాలి. ఎక్కువగా శారీరక శ్రమ చెయ్యకుండా ఉండే ఉద్యోగాలలో ఉన్నవారు, వృద్ధులు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని, అవసరమైనంత మాత్రమే తీసుకోవాలి.

ఆపైన మనిషి ఆహారాన్ని రుచికోసం, తన జిహ్వాచాపల్యాన్ని తీర్చుకోవడం కోసం కాక తన కర్తవ్యనిర్వహణకు కావలసిన శక్తిని పొందడం కోసమే తీసుకుంటాడు. దీని గురించి మరింత వివరంగా 'ఆత్మనిగ్రహమే మనిషి పరిణామానికి కొలబద్ద' అన్న అధ్యాయంలో చదువుతాము.

## 43. మానవ పరిణామంలో త్యాగబుద్ధి పాత్ర

అన్నీ తనకే కావాలని అనుకోకుండా, ఇతరులకు వీలయినంత సహాయపడాలనుకోవడమే త్యాగబుద్ధి.

స్వామీజీ ఇలా చెప్పారు. *"ఏ మనిషి అయితే అత్యంత ఎక్కువ స్థాయిలో ఈ త్యాగగుణాన్ని చూపిస్తాడో అతడు తన తోటివారిలో అంత గొప్పవాడు అవుతాడు. (అటువంటి వ్యక్తులున్న సమాజం అంత గొప్పదవుతుంది.) కానీ జంతువుల సామ్రాజ్యంలో ఏ జంతువు అయితే అన్నిటికన్నా ఎక్కువ జంతువుల్ని మట్టుపెడుతుందో అది గొప్పది అవుతుంది. కాబట్టి డార్విన్ చెప్పిన పోరాట సిద్ధాంతం ఈ రెండు సామ్రాజ్యాలలోనూ ఒకే విధంగా వర్తించదు."*

మనిషి ఈ త్యాగాన్ని తన కుటుంబం కోసం, తన ఊరికోసం, దేశం కోసం, సమస్త మానవాళికోసం – ఏ స్థాయిలోనైనా చూపించవచ్చు. అత్యున్నత స్థాయిలో త్యాగబుద్ధిని చూపి మానవాళి కోసం పాటుపడిన మహానుభావులు అందరికన్నా గొప్ప పరిణతి

సాధించిన అవతారపురుషులుగా వెలుగొందారు. ఇటువంటి వారిని అన్ని మతాలలోనూ, అన్ని దేశాలలోనూ చూడవచ్చు. ఈ విధంగా చూచినప్పుడు వ్యక్తి, "నాకది కావాలి! నాకిది కావాలి!" అని వెంపర్లాడే తత్త్వాన్ని వదిలిపెట్టాలి. 'అందరికన్నా నేనే సుఖపడాలి, అలా చెయ్యడం కోసం మిగిలినవారి నుంచి అన్నీ లాగుకోవడానికి కూడా నేను సిద్ధం, అవసరమైతే ఇందుకోసం ఏమైనా చేస్తాను' అనడం మానాలి. 'ఇందులో తప్పేమీ లేదు. ఎందుకంటే ఇతరులతో పోటీపడడమనేది ప్రకృతి సహజం' అని సమర్థించుకోకూడదు. ఇతరుల కోసం పాటుపడే విధంగా ఓరిమితో మనుష్యులు తమతమ కర్తవ్యాలను నిర్వర్తించడమే అత్యున్నతమైన వ్యక్తిత్వనిర్మాణానికి దారితీస్తుంది.

*వివేకానంద స్వామి ఇలా చెప్పారు: "మన దేశంలో తత్త్వవేత్తలు బోధించిన దాని ప్రకారం ప్రతి జీవీ ఒక పరిపూర్ణమైన ఆత్మ. జీవపరిణామక్రమంలో ప్రకృతి యొక్క వ్యక్తీకరణ ద్వారా కనిపించే భిన్నత్వం అంతా ఈ ఆత్మ తనను తాను ఆయా జీవులలో ఎంత మోతాదులో వ్యక్తీకరించుకుంటుందన్న విషయం మీద ఆధారపడుతుంది. ఏ క్షణంలో అయితే ఈ పరిణామానికి, ప్రకృతి వ్యక్తీకరణకు అడ్డంకులుగా నిలుస్తున్న వాటిని తొలగిస్తామో అదే క్షణంలో ఆత్మ తనకు తానుగా పరిపూర్ణంగా వ్యక్తీకరించుకుంటుంది."*

పైన చెప్పిన విషయాన్ని చదివినప్పుడు వివేకానంద స్వామి వేదాంతపరంగా పరిణామక్రమాన్ని వివరించడాన్ని గమనించవచ్చు. అంతటా వ్యాపించివున్నదొక్కటే – ఆత్మ లేదా దివ్యత్వం. ఏ జీవి తనలోని దివ్యత్వాన్ని మరింత ఎక్కువగా వ్యక్తీకరించగలుగుతుందో ఆ జీవి మరింత పరిపూర్ణతను సాధించి పరిణామక్రమంలో ముందుకు సాగుతుంది. ఇలా జరగడాన్ని వివిధ జాతుల మధ్య మాత్రమే కాక ఒకే జాతిలోని జనాభాలో కొన్ని జీవులు మిగిలినవాటికన్నా విజయవంతమైనవిగా తయారవడంలో కూడా చూడవచ్చు. ఆయా జనాభాలు మిగిలిన జనాభాల కన్నా

మరింత విజయవంతమైనవి కావడం ద్వారా కొత్త జాతులుగా ఆవిర్భవిస్తాయి. జంతువుల స్థాయిలో ఇలా పరిణామం జరగడానికి పరిసరాలలో వాటికి ఎదురయ్యే అడ్డంకులు కారణం కావచ్చు. కానీ మనుష్యులకూ జంతువులకూ తేడా లేదా?

స్వామీజీ ఇలా బోధించారు: *"ఈ భౌతికమైన శరీరాన్ని కాపాడుకోవడం కోసమే జంతువులు పోరాడడాన్ని మనం చూస్తాము. కానీ అది మానవుల స్థాయిలో మనస్సును అదుపు చేసుకోవడంలోనూ; పరిస్థితులు ఎలా మారిపోతున్నా మానసిక సమస్థితిని పోగొట్టుకోని స్థిరత్వాన్ని చేరుకోవడంలోనూ కనిపిస్తుంది. చక్కగా ఎదుగుతున్న ఒక చెట్టు, ప్రక్కనే నీటి కొలనులో దాని ప్రతిబింబం ఒకదానికొకటి వ్యతిరేకంగా ఎలా కనిపిస్తాయో, అదే విధంగా జంతు సామ్రాజ్యంలోనూ, మానవ సామ్రాజ్యంలోనూ జరిగే పోరాటాలు పరస్పరం వ్యతిరేకమైన విధానాలలో జరుగుతూ కనిపిస్తాయి."*

*"మనిషి కేవలం త్యాగం ద్వారానే అత్యుత్తమమైన స్థితికి చేరే పరిణామాన్ని సాధిస్తాడు. ...తనతోటి వారికోసం ఎంతవరకూ త్యాగం చెయ్యగలడన్న దాన్ని బట్టి ఒక మనిషి అంత గొప్పవాడుగా కీర్తించబడతాడు."*

*"మానవుల స్థాయిలో మనిషి ఎదుర్కొనే అడ్డంకులు చాలావరకూ తొలగిపోయి, విద్య ద్వారా, సంస్కృతి ద్వారా, ఏకాగ్రత ద్వారా, ధ్యానం ద్వారా, అన్నింటినీ మించి త్యాగబుద్ధి ద్వారా మనిషిలో ఆత్మ చైతన్యం కలుగుతుంది. కాబట్టి మనిషి పరిసరాల ద్వారా ఎదుర్కొనే అడ్డంకుల్ని మనిషి యొక్క పరిణామక్రమంలో, ఆత్మ తనను తాను వ్యక్తీకరించుకునే ప్రయత్నంలో అడ్డుపడే విషయాలుగా పరిగణించాలి. అంతే కానీ ఆ అడ్డంకుల్నే మానవపరిణామానికి కారణాలుగా చెప్పి, ప్రకృతిలో అద్భుతమైన విషయంగా గోచరించే ఈ భిన్నత్వానికి దోహదం చేసేవి అవేనని వర్ణించడం హేతుబద్ధంగా ఉండదు."*

*"చరిత్రను లోతుగా పరిశీలించినప్పుడు ప్రపంచదేశాలు ఒక గొప్ప సమస్యని*

పరిష్కరించడానికి ప్రయత్నిస్తూ ఉండడాన్ని మనం చూడవచ్చు. అందుకోసం భారతదేశం ఒకవైపు నుంచీ, మిగిలిన ప్రపంచం మరొకవైపు నుంచీ పనిచేస్తున్నాయి. ఇంతకీ, 'ఎవరు కడదాకా నిలిచి ఉంటారు?' అన్నదే ఆ సమస్య. ఈ జీవన పోరాటంలో ప్రేమ నిలిచి ఉంటుందా, ద్వేషం నిలిచి ఉంటుందా? సుఖలాలసత్వం నిలిచి ఉంటుందా, వైరాగ్యం నిలిచి ఉంటుందా? భౌతికమైన ఆస్తిపాస్తులు, సిరిసంపదలు, పేరుప్రఖ్యాతులు నిలిచి ఉంటాయా లేక మనిషిలోని ఆత్మ నిలిచి ఉంటుందా? అన్నదే ఆ సమస్య. దీనికి పరిష్కారంగా చరిత్రకందని కాలంలో మన పూర్వీకులు చెప్పినదే ఈనాటికీ సరైనదని మనం భావిస్తున్నాము. మన పూర్వీకులు అతి ప్రాచీనమైన కాలంలోనే ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించారు. అప్పటి స్థితిగతులను కనీసం సాంప్రదాయాన్ని అనుసరించి కూడా అంచనా వెయ్యలేము. అటువంటి అంధకారబంధురమైన అనాదికాలంలోనే మహాపురుషులైన మన పూర్వీకులు ఈ సమస్యకు తమదైన పరిష్కారాన్ని కనుగొని, ఈ ప్రపంచానికే ఒక సవాలు విసిరారు. 'మా సమాధానం వైరాగ్యం! (అన్‌వరల్డ్‌లీనెస్)' అని ఎలుగెత్తి చెప్పారు. కోరికల్ని విడిచిపెట్టడం, నిర్భయత్వం, ప్రేమ – ఇవే మన సమాధానాలని చెప్పారు. మానవ సమాజం కలకాలం నిలిచి ఉండాలంటే కావలసినవి ఇవేనని స్పష్టం చేశారు. ఏ దేశం, ఏ సంస్కృతి, ఏ నాగరికత ఇంద్రియ సుఖాలను అదుపులో పెట్టుకోమని బోధిస్తుందో అదే నిలిచి ఉంటుందని ఘంటాపథంగా చెప్పారు. దీనికి ఋజువుల్ని మనకు ఈనాటి చరిత్ర చక్కగా చూపుతోంది. మనదేశం చుట్టూ పుట్టగొడుగుల్లా దేశాలు పుట్టుకొస్తున్నాయి – ప్రతి శతాబ్దానికీ అటువంటి దేశం ఒకటి పుట్టి కుప్పకూలి పోతోంది. నిజానికి, మన బ్రహ్మాండమైన జాతి ప్రపంచంలోని మరే ఇతర దేశమూ ఎదుర్కోనటువంటి ఘోరమైన దురదృష్టాలనూ, అపాయాలనూ, దౌర్భాగ్యాలనూ చవిచూడవలసివచ్చింది. అయినా సరే, అలా మీదవచ్చిపడిన సమస్యలన్నింటినీ

*తట్టుకుంటూ ముందుకు సాగి నిలబడగలిగింది. ఎలా? వైరాగ్యాన్ని తన ఆయుధంగా చేపట్టడం వల్లనే.”*

ఈ విధంగా వైరాగ్యం, త్యాగబుద్ధి ఎలా మనిషి వ్యక్తిత్వ నిర్మాణానికి, సమాజనిర్మాణానికి అవసరమో స్వామీజీ వివరించారు.

## 44. ఇతర జీవజాతులలో కర్తవ్యం అనే భావన ఉన్నదా?

ఇప్పుడు ఒక్క క్షణం ఈ కర్తవ్యం అనే భావనను వేరే కోణంలో నుంచి పరిశీలిద్దాము. ఈ కర్తవ్యం అనే భావన కేవలం మనుష్యులకే పరిమితమయిందా లేక వేరే జీవజాతులలో కూడా ఉందా అన్న ప్రశ్న మనకు చాలా ఆసక్తికరమైన సమాధానాన్ని ఇస్తుంది.

చీమలు, తేనెటీగలు, చెదపురుగులు, మోల్ రాట్‌లు మొదలైన జీవజాతులను గమనించండి. ముఖ్యంగా చీమలు, తేనెటీగలు 90 మిలియన్ల సంవత్సరాలుగా ఈ భూమి మీద జీవిస్తున్నాయి. గత 90 మిలియను సంవత్సరాలలో వాటి శరీర నిర్మాణంలో పెనుమార్పులేవీ సంభవించలేదు. అంటే అప్పటికే అవి పరిణామంలో అత్యున్నత స్థితికి చేరుకున్నాయన్న మాట.

ఆయా జాతుల్ని పరిశీలించినప్పుడు మనం కొన్ని విషయాలను గమనించవచ్చు. అవి సాంఘిక జీవనానికి అలవాటు పడ్డాయి. ఒక్కొక్కరుగా జీవించడం కన్నా ఉమ్మడిగా జీవించడం ద్వారా మరింత విజయవంతంగా మనుగడ సాగించవచ్చునని అవి తెలుసు కున్నాయి. అంతేకాక సాంఘిక జీవనంలో పనులను పంచుకోవడం ద్వారా పోటీని నివారిస్తే సంఘంలోని అన్ని జీవులకూ పని దొరుకుతుందనీ, తద్వారా సంఘం మరింత శక్తిమంతంగా, విజయవంతంగా జీవించగలుగుతుందనీ, ఆ జాతిజీవులు ఒక్కొక్కరుగా ఉన్నప్పుడు పొందలేని రక్షణనూ, భద్రతనూ, సంక్షేమాన్నీ సాంఘిక జీవనంలో

పొందవచ్చనీ, మరింత పరిణామాన్ని సాధించవచ్చుననీ అవి తెలుసుకున్నాయి.

అయితే ఇందుకోసం ప్రతి జీవీ తనకే అన్ని బాధ్యతలూ కావాలని కోరడానికి వీలులేదు. ఉదాహరణకు తేనెటీగలలో మనం చూసే రాణి ఈగ, పోతుటీగలు, కూలి ఈగలు వాటివాటి కర్తవ్యాలను ఎంతో చక్కగా నిర్వర్తిస్తాయి. కూలి ఈగలు తమ ప్రత్యుత్పత్తి సామర్థ్యాన్ని త్యాగం చేసి, తమ సంఘానికి ఆహారాన్ని సేకరించిపెట్టడం, శత్రువుల బారినుంచి సంఘానికి రక్షణ కలిగించడం మొదలైన విధులను గొప్పగా నిర్వర్తిస్తాయి. వాటి వయస్సు పెరిగే కొద్దీ వాటి బాధ్యతలు మారిపోతూ ఉంటాయి. అవి కేవలం 21 రోజులే జీవిస్తాయి.

రాణి ఈగ పేరుకే రాణి! అయినా దాని కష్టం మిగిలిన వాటికన్నా ఎక్కువ. రోజుకు ఇంచుమించు ఆరువందల గుడ్లు పెడుతుంది. తాను జీవించిన రెండు సంవత్సరాల కాలంలో అది ఏనాడూ ఈ పనిని మానడానికి వీలులేదు. రెక్కలున్నా, ఎగిరే శక్తి ఉన్నా, హాయిగా బయటికిపోయి షికారు తిరగడానికి కుదరదు. తన ఆహారం కోసం పూర్తిగా కూలి ఈగల మీదనే ఆధారపడాలి. చివరికి తన యొక్క గుడ్లు పెట్టే సామర్థ్యం తగ్గిపోయినప్పుడు కొత్తరాణికి చోటిచ్చి ఆత్మత్యాగం కూడా చేస్తుంది.

ఇలా ఆయా సంఘాలలోని జీవులు కర్తవ్యనిష్ఠ అనే సుగుణాన్ని గొప్పగా అలవరచుకున్నాయి. అరవై మిలియను సంవత్సరాల క్రితం జరిగిన ఉల్కాపాతంవల్ల కలిగిన పెను ఉత్పాతంలో డైనోసార్లతోపాటు అధికశాతం జీవజాలమంతా నశించిందని చెపుతారు. అటువంటి ఉత్పాతాలేవీ లేకపోయినూ అనేక లక్షల జాతులు అంతరించాయి కూడా. అయితే అవన్నీ అంతరించినా తేనెటీగలు, చీమలు విజయవంతంగా తమ జాతుల మనుగడను కొనసాగించడంలో ఆశ్చర్యమేముంది?

ఇంకొకవైపున జీవరాశుల పరిణామక్రమాన్ని చూడండి. ప్రకృతిలో జీవులన్నీ తమతమ జాతుల్ని మిగిలిన జాతులకన్నా ఎక్కువగా పెంచడానికి ప్రయత్నిస్తున్నట్టు

కనపడతాయి. అయితే ఉన్న వనరులు కొంతవరకే సరిపోతాయి. అన్ని జీవులూ అవే వనరుల కోసం పోటీపడితే కుదరదు. అందువల్ల జీవులు పోటీని తగ్గించుకోవడానికి, అంతగా పోటీలేని వనరుల మీద ఆధారపడడానికి, తద్వారా పరిణామక్రమంలో తమ ఉనికిని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. మొక్కలు ఆహారాన్ని ఉత్పత్తి చేస్తాయి. దానిమీద ఆధారపడి మిగిలిన జంతువులన్నీ జీవిస్తాయి. మాంసాహారాన్ని తినే జీవులు మిగిలిన జీవుల జనాభాను అదుపులో ఉంచడం ద్వారా జనాభాల సమతౌల్యతను సాధించడానికి తోడ్పడుతున్నాయి. మరొక ప్రక్క సేంద్రియ పదార్థాలను కుళ్ళబెట్టే సూక్ష్మజీవులు మొత్తం పర్యావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడుతున్నాయి. అంటే ప్రతి ఒక్క జీవజాతి పోటీనుంచి తప్పుకోవడం కోసం తనదైన ఒక 'నిష్'ను (niche) తయారుచేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. (ఒక జీవి ఒక పర్యావరణ వ్యవస్థలో ఇతర జీవులు పోటీపడని వనరులను ఉపయోగించుకోవడం ద్వారా తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సాధించి, విజయవంతంగా జీవిస్తుందో, అలాంటి స్థానాన్ని నిష్ లేదా ప్రకృతి– నిర్ణయించిన– జీవితస్థానం అని అనవచ్చు.) ఆ విధంగా ఈ ప్రకృతిలో ప్రతి జీవి తనదైన నిష్‌లో సర్దుకుపోయి, జీవించడానికి ప్రయత్నిస్తోంది. దీనినే మనం కర్తవ్యనిష్ఠగా చెప్పుకోవచ్చు.

అదే జంతువు కొంత పరిణామాన్ని సాధించినప్పుడు కొత్త నిష్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఆ ఏర్పాటు సాధించేటప్పుడు కొంత పోటీ, పోరాటం కనబడడం సహజమే. అయితే ఇది జంతులోకానికే పరిమితం. ఒక 'పర్యావరణ వ్యవస్థ' (ఈకో–సిస్టమ్) పనిచెయ్యాలంటే దానిలోని జీవజాతులన్నీ చక్కగా మనగలగాలని జీవశాస్త్ర విద్యార్థులు చెపుతారు. కాబట్టి విశాలదృక్పథంతో చూసినప్పుడు ప్రకృతిలో జీవజాతుల కర్తవ్యనిష్ఠ మొత్తం పరిణామక్రమాన్నే ముందుకు నడిపిస్తోందని మనం అర్థం చేసుకోవచ్చు.

# 45. ఇతర జీవజాతులలో త్యాగబుద్ధి ఉన్నదా?

జాగ్రత్తగా తరచి చూచినప్పుడు పైకి తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు కనపడినా జీవరాశులన్నీ సమైక్యంగా పరిపూర్ణత వైపు కొనసాగుతున్నాయి. జంతువుల స్థాయిలో పరిపూర్ణతను సాధించిన స్థితి ఏమిటి? ఏ స్థాయికి చేరిన తర్వాత తాను ఏ ఇతర జంతువులోనూ పోటీపడి, పోరాడనవసరంలేదో ఆ స్థితినే ఆ జంతువుకు పరిపూర్ణత అని చెప్పుకోవచ్చు. తన బిడ్డల్ని రక్షించుకొనే నిమిత్తం ఒక బాతు కాలు విరిగినట్టుగా నటిస్తుంది. కుంటుతూ నడుస్తూ, చాలా బాధలో ఉన్నట్టు ఆర్తనాదాలు చేస్తుంది. తన పిల్లల్ని తినడానికి వస్తున్న కుక్కదో, నక్కదో దృష్టి మరలించడానికి కాలు విరిగినట్టు, పడుతూ, లేస్తూ పారిపోవడానికి ప్రయత్నిస్తున్నట్టు నటిస్తుంది. ఈ లోపల ఆ బాతుపిల్లలు చడీచప్పుడూ చేయకుండా తప్పుకుని, ఆ వేటాడే జంతువు కంటబడకుండా పారిపోతాయి. అంతవరకూ కుంటినడకలు నడుస్తున్న బాతు, ఆఖరు క్షణంలో తన నటన మాని, ఒక్కసారిగా ఆ వేటాడే జంతువుకు దొరకకుండా ఎగిరిపోతుంది. ఆ విధంగా ఆ బాతు తన పిల్లలకోసం గొప్ప త్యాగాన్ని ప్రదర్శిస్తుంది.

అయితే ఇందులో గొప్ప అపాయం ఉంది. ఆ బాతు ఏ క్షణంలోనయినా ఆ వేటాడే జంతువుకు చిక్కవచ్చు. దానివల్ల దాని ప్రాణాలకు ప్రమాదం వాటిల్లడమే కాక దాని సంరక్షణ కోల్పోయిన ఆ బాతుపిల్లలు కూడా మరణిస్తాయి. అయినా సరే, ఏయే బాతుల జనాభాలలో ఇటువంటి ప్రవర్తన కనిపిస్తుందో ఆయా జనాభాలు తక్కిన జనాభాల కన్నా మరింత విజయవంతంగా తమ మనుగడను కాపాడుకోగలుగుతున్నాయని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఇటువంటి ప్రవర్తన ఇంకా అనేక జంతుజాతులలో కూడా కనిపిస్తుంది. దీని నుంచి, తన ప్రాణాలను రక్షించుకోవడం కన్నా తోటివారి ప్రాణాలను

రక్షించే లక్షణమున్న జాతులే మరింత ఉన్నతమైనవనీ, అటువంటి లక్షణాన్నే మన కర్తవ్యంగా, జీవితాదర్శంగా మలచుకోవాలనీ అర్థమవుతోంది కదా!

మరొకవైపున జింకల్ని వేటాడి చంపుతున్న పులిని చూడండి. పైనుంచి చూసినప్పుడు మనకు ఆ జింక గొప్ప సాధుజంతువు అనీ, ఆ పులి క్రూరమైన జంతువు అనీ మనకు తోస్తుంది. కానీ మరొకరకంగా ఆలోచించి చూస్తే తమలోని లోపాల్ని తగ్గించుకోవడానికి ఆ జింకలు పులిని ఉపయోగించుకుంటున్నాయి. (అంటే తమను వేటాడే జంతువును ఉపయోగించుకుని అవి మరింత వేగవంతమైన, శక్తిమంతమైన జాతిగా తయారవడానికి ప్రయత్నిస్తున్నాయి.) మరొకవైపు వేటాడిన ప్రతిసారీ పులికి జింక చిక్కదు. ఇరవైసార్లు ప్రయత్నిస్తే ఒక్కసారి మాత్రమే దొరుకుతుంది. కొన్నిసార్లు వేటాడడం చేతకాక పులులు మరణించే సందర్భాలు కూడా ఉంటాయి.

గోధుమ పంటను పెంచి, ఆ గోధుమ మొక్క అనే జీవిని మనిషి తన సుఖం కోసం ఉపయోగించుకొంటున్నట్టు కనపడుతుంది. మరొకవైపు నుంచి చూస్తే ఆ మొక్కే మనిషికి కావలసిన లక్షణాలు కలిగిన గింజలను అందించే విధంగా తనను తాను రూపాంతరం చెందించుకుని, అతనినే ఒక మాధ్యమంగా ఉపయోగించుకుని, ప్రపంచమంతా విస్తరించింది.

కానీ సాధారణంగా మనం ఆ జింకల్నీ, పులుల్నీ ఐదు నిముషాలపాటు గమనించి మనం ఈ ప్రకృతిలో న్యాయం లేదనీ, క్రూరత్వం నిండిపోయి ఉందనీ, ప్రతివారూ ఎవరికివారేననీ, ఒకరు మరొకర్ని చంపుకు తినడమే ఈ ప్రపంచంలో యథార్థమనీ అనుకుంటాము. కానీ ఒక్కసారి దూరంగా నిలబడి (ఒక సాక్షిలాగా) ఒక కోటి సంవత్సరాల నిడివిలో భూమి మీద జరిగిన పరిణామక్రమాన్ని గమనించండి. ఎన్ని కోట్ల జాతుల జంతువులు ఉద్భవించాయో, అదే సమయంలో ఎన్ని కోట్ల జాతుల జంతువులు అంతరించిపోయాయో ఊహించుకోండి. ఈ పరిణామం వెనుకనున్నది

కేవలం స్వార్థమే అని చెప్పడం హాస్యాస్పదం. పతంజలి మహర్షి ప్రకృతి యొక్క పూరణవల్లనే పరిణామం జరుగుతోందని చెప్పగా చూశాం. కాబట్టి జీవరాశులన్నీ తమలోని దైవత్వాన్ని ప్రకటించడానికి అనునిత్యం ప్రయత్నిస్తున్నాయి. అయితే జంతువుల స్థాయిలో వాటికి తెలియకుండా, వాటి ప్రమేయం లేకుండా ఇది జరుగుతోంది. తమ శరీరాలను, తమ జాతిని రక్షించుకోవడంగానే జంతువుల స్థాయిలో కనపడుతుంది. మానవుల స్థాయిలో దైవత్వానికి మారులక్షణమైన నిస్వార్థబుద్ధిని పెంపొందించుకునే దిశగా, బుద్ధిపూర్వకంగా, ప్రయత్నం చేసి మనిషి పరిణామాన్ని సాధించాలి. అలా చేయడం ద్వారానే మానవజాతి పరిణామాన్ని సాధిస్తోంది. జంతువులలా జీవిస్తే మనిషి కూడా వాటితోపాటు 'కాలేనాత్మని విందతి' (భగవద్గీత 4.38) అన్నట్టు చాలా నెమ్మదిగా పరిణామంలో ముందుకుపోతాడు. కానీ మనిషి జంతువు కాదు కదా!

## 46. జంతువులకూ మనుష్యులకూ తేడా ఏమిటి?

జంతువులకూ, మనుష్యులకూ గల తేడాను మరింత వివరించేందుకు ఒక కథ చెప్పుకుందాము. ఒక గొప్ప సాధువు ఒక నదిలో స్నానం చెయ్యడానికి వెళ్ళాడు. నదిలో దిగి స్నానం చేస్తుండగా, నీటి ప్రవాహంలో ఒక తేలు కొట్టుకుపోతూ కనిపించింది. వెంటనే మహాత్ముడైన ఆ సాధువు దోసిలిపట్టి ఆ తేలును నీటిలోనుంచి పైకి తీశాడు. ప్రాణభయంతో కొట్టుకుంటున్న ఆ తేలు వెంటనే అతడి చేతి మీద కుట్టింది. ఒక్కసారిగా అమితమైన బాధ కలగడంతో అతడి చేయి పట్టుతప్పి, ఆ తేలు తిరిగి నీటిలో పడిపోయి, కొట్టుకుపోసాగింది. కానీ ఆ సాధువు మరుక్షణంలో తేరుకుని ఆ తేలును పైకి తీశాడు. అయితే అది మళ్ళీ కుట్టి నీటిలో పడిపోయింది. అతడు దాన్ని మళ్ళీ పైకి తీశాడు. ఇలా మాటిమాటికీ జరగడం చూసి పక్కనున్న వాడొకడు, "అయ్యా! దాన్ని వదిలిపెట్టండి!

తేలు స్వభావం కుట్టడమేనని మీకు తెలుసు కదా!” అన్నాడు. అది విన్న సాధువు, “అవును నాయనా! దాని స్వభావం కుట్టడమన్నది నిజమే కానీ, నా స్వభావం అన్ని జీవులనూ రక్షించడానికి ప్రయత్నించడం! అది దాని స్వభావాన్ని విడిచిపెట్టనప్పుడు నేను నా స్వభావాన్ని ఎందుకు విడిచి పెట్టాలి?” అని ఎదురు ప్రశ్నించాడు.

ఈ కథలో మనం నేర్చుకోవలసిన విషయాలు రెండు. మొదటిగా ఆ తేలు యొక్క ప్రవర్తనను చూడండి. అది జంతువు. దాని స్థాయిలో ఆత్మరక్షణ కోసం, తాను, తన జాతి అభివృద్ధి సాధించడం కోసం, కుట్టడమే సరైన మార్గం. అది జంతువు స్థాయిలో ఉన్నప్పటికీ దానిలో ఎటువంటి ప్రేమ లేదని మనం అనలేము. ఎందుకంటే, దాని ప్రేమ అంతా దాని శరీరాన్ని రక్షించుకోవడంలోనే లగ్నమయి ఉంటుంది. నిజానికి తన శరీరాన్ని రక్షించుకోవడం ద్వారా అది ఔన్నత్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తోంది. అదే దాని ఆదర్శం.

రెండవదిగా సాధువు సంగతి చూడండి. అతడి స్వభావం ప్రేమతో నిండిపోయింది. అత్యున్నతమైన పరిణామాన్ని సాధించిన మానవుడిగా అతడి స్వభావం ఇతరులకు సేవ చేయడమే. తోటి జీవరాశుల సంక్షేమంలోనే తన సంక్షేమం దాగివుందన్న విషయాన్ని అతడు స్పష్టంగా గ్రహించాడు. అందుకనే అతడు తనకు కలిగిన దుర్భరమైన బాధను ఓర్చుకుని ఆ తేలుకు సహాయం చెయ్యాలని ప్రయత్నించాడు. మనుష్యులకూ జంతువులకూ మధ్య పోలిక ఎక్కడ ఆగిపోతుందో ఈ కథ మనకు చక్కగా వివరిస్తుంది.

ఈ కథలో మనం నేర్చుకోవలసిన నీతి ఇంకొకటి కూడా ఉంది. అది ఏమిటంటే వారిద్దరూ తమ స్వభావాన్ని వదిలిపెట్టకుండా పనిచేస్తున్నారన్నదే. ఆ తేలు తన కుట్టే స్వభావాన్ని, ఆ సాధువు తన రక్షించే స్వభావాన్ని వదిలిపెట్టలేదు కదా! వారిలాగానే, ఎన్ని కష్టాలు ఎదురైనా సరే ఎవరి పనిని వారు వదిలిపెట్టకూడదు. ఒక పెద్ద సింహం ఒకసారి కొన్ని గడ్డివాముల మధ్యలో చిక్కుబడిపోయిందట. త్రోవ తెలియక

కొన్నిరోజులపాటు అక్కడే అది గడపవలసి వచ్చింది. ఆకలితో నకనకలాడుతూ బాధపడింది కానీ ఆ ఎండుగడ్డిని మాత్రం అది తినలేదట. కర్తవ్యనిర్వహణలో ఆ సింహానికి ఉన్నటువంటి పట్టుదల కావాలి.

## 47. ఆత్మనిగ్రహమే మనిషి పరిణామానికి కొలబద్ద

మనిషి స్థాయిలో ఎదుగుదల భౌతిక స్థాయినుంచి మానసిక స్థాయికి ఉండాలి. ధర్మానికి లోబడి అర్థకామాలను సంపాదించాలని ఇంతకు పూర్వమే చెప్పుకున్నాము. అగ్నికి ఆజ్యం తోడయినట్లు మనం కోరికలను తీర్చుకుంటున్నకొద్దీ అవి ఇంకాయింకా పెరుగుతూ ఉంటాయని తెలుసుకుని మనిషి ప్రవర్తించాలి.

ప్రకృతి వనరులను సుఖభోగాపేక్షతో అతిగా వినియోగించడం వలన భూగోళం మీద ఈనాడు కలుగుతున్న అనేక ప్రకృతివైపరీత్యాలను మనం చూస్తున్నాం. అంతేకాక సమాజంలోని అసమానతలకు, అశాంతికి, దారిద్ర్యానికి కూడా కారణం సమాజంలోని వ్యక్తులు తగినంత ఆత్మనిగ్రహాన్ని పాటించకపోవడమే. కాబట్టి మనిషి భౌతికమైన కోరికలను తీర్చుకోవడం కోసం అతిగా వెంపర్లాడక, కోరికలను తగ్గించుకోవడం కోసం ప్రయత్నించాలి. ఇలా ఆత్మనిగ్రహాన్ని సాధించిన వాడికి ప్రకృతి సైతం సాగిలపడుతుంది.

'అన్నం న నింద్యాత్, తద్ వ్రతం' అని తైత్తిరీయ ఉపనిషత్తులో చెప్పబడింది. దానికి అర్థం అన్నాన్ని వృథా చేయవద్దు అని. అయితే దీని గురించి మరికొంచెం లోతుగా ఆలోచిస్తే, అదే మాట ప్రకృతి యొక్క అన్ని వనరులకూ వర్తిస్తుందని మనం గమనించవచ్చు. కాబట్టి మనిషి కోరికల విషయంలో తనను తాను అదుపు చేసుకోవడం కూడా అతడి కర్తవ్యం అవుతుంది.

స్వామీజీ దీనిని గురించి ఇలా చెప్పారు. "ఎవరైతే తన మనస్సును స్వాధీనం

*చేసుకుంటాడో అతడికి పదార్థం (ప్రకృతి) కూడా స్వాధీనమవుతుంది. బాహ్యప్రకృతి కన్నా లోపల ఉన్న ఆంతరిక ప్రకృతి మరింత సూక్ష్మమైనది. అందువల్ల దాన్ని స్వాధీనంలోనికి తెచ్చుకోవడం మరింత కష్టం. కాబట్టి ఎవరైతే తన ఆంతరిక ప్రకృతిని జయించాడో, అతడు మొత్తం విశ్వాన్నే జయించగలుగుతాడు. ప్రకృతి అతడి సేవకురాలిగా మారుతుంది."* ఇంతకు ముందు చదివిన కథలో కౌశికుడు, గృహిణి, ధర్మవ్యాధుడు ఎలా మానవాతీతశక్తుల్ని సాధించారో మనం గమనించవచ్చు. ఆత్మనిగ్రహమే వారి మొదటి ఆయుధం. దాని ద్వారానే వారికి అటువంటి శక్తి కలిగింది. ఇలా ఆత్మనిగ్రహాన్ని సాధించడానికి ప్రయత్నించని మనిషి మనిషే కాదు.

*"లోబయళ్ళ ఉన్న ప్రకృతిని అధిగమించడానికి ఎంతవరకూ ఒక మనిషి ప్రయత్నిస్తాడో, అంతవరకే అతణ్ణి మనం మనిషిగా భావించవచ్చు. మనకు బాహ్యంగా ఉన్న పదార్థ నియమాలనే కాక, ఆంతరికంగా ఉన్న సూక్ష్మమైన (మానసిక) ప్రకృతిని కూడా మనం స్వాధీనం చేసుకోవాలి. నిజానికి మన ఆంతరిక ప్రకృతే (మనస్సే) బాహ్యమైన ప్రకృతిని నడిపే చోదకశక్తి. బాహ్యమైన ప్రకృతిని స్వాధీనంలోకి తెచ్చుకోవడం నిజంగా గొప్ప విషయమే. కానీ మనలోని ప్రకృతిని (అంటే మనస్సును, కోరికలను) స్వాధీనం చేసుకోవడం మరింత గొప్పవిషయం. ...అత్యున్నతమైన స్థితిని సాధించిన ప్రపంచంలో స్వార్థత్యాగమే నియమంగా ఉంటుంది కానీ, స్వార్థపరత్వం కాదు"* అని స్వామీజీ చెప్పారు. కాబట్టి ఆత్మనిగ్రహంలోని గొప్పతనాన్ని గ్రహించడం మనిషి యొక్క ముఖ్య కర్తవ్యం.

## 48. మన పూర్వీకులు మనకు నిర్దేశించిన ఆదర్శం

మానవ పరిణామ లక్ష్యమేమిటో స్వామీజీ ఈ క్రింది విధంగా వివరించారు.

*"మన పూర్వీకులు వర్ణించిన ఆదర్శమానవుడు బ్రాహ్మణుడు. (ఇంతకు ముందు*

చెప్పుకున్నట్టుగానే, బ్రాహ్మణుడు అనే మాటను వాడినప్పుడు మనం ఈనాడు సమాజంలో చూస్తున్న ఒక ప్రత్యేకమైన కులానికి చెందినవారిని గురించి ప్రస్తావించడం లేదని స్పష్టంగా అర్థం చేసుకోవాలి.) మన పుస్తకాలన్నింటిలో ఆ బ్రాహ్మణత్వమనే ఆదర్శం అని నొక్కిచెప్పబడింది. ...ఒక ఆదర్శవంతమైన బ్రాహ్మణుడి వ్యక్తిత్వం పారమార్థిక సంస్కృతితోనూ, వైరాగ్యంతోనూ నిండివుంటుంది. ఈ బ్రాహ్మణత్వమనే ఆదర్శాన్ని చెప్పడంలో నా ఉద్దేశ్యం ఏమిటనుకుంటున్నారు? ఏ మనిషిలో ప్రాపంచికత పూర్తిగా లేదో, సత్యపూరితమైన జ్ఞానం నిండుగా ఉంటుందో అతడే అసలైన బ్రాహ్మణుడని, అదే అసలైన బ్రాహ్మణత్వమని నా ఉద్దేశ్యం. హిందూజాతి యొక్క ఆదర్శం అదే. ...అటువంటి బ్రాహ్మణుడు తన అహంకారాన్ని పూర్తిగా నిర్మూలించినవాడై, జ్ఞానాన్ని సంపాదించడం కోసం, అందరికీ దాన్ని బోధించడం కోసం మాత్రమే జీవిస్తూ, ప్రేమమయుడైన వాడై ఉంటాడు. ...ఏదైనా ఒక దేశం అటువంటి బ్రాహ్మణ స్వభావంతో తొణికిసలాడే మనుష్యులతో నిండి ఉంటే అటువంటి దేశంలోని ప్రజ అన్ని చట్టాలకూ అతీతమైనదిగా ఉండగలదని చెప్పడంలో వింత ఏముంది? అటువంటి దేశాన్ని రక్షించడానికి ఎటువంటి రక్షకభటులు, ఎటువంటి సైన్యం అవసరమౌతాయి? వారిని మరొకరు పాలించవలసిన అవసరం ఏముంది? ఏ ప్రభుత్వం క్రిందనైనా వారు జీవించవలసిన అవసరం ఏముంది? అటువంటివారు సద్గుణసంపన్నులు, దేవుడి మనుష్యులు."

"...సత్యయుగంలో లోకం బ్రాహ్మణ స్వభావులైనవారితో నిండివుంది. మహాభారతంలో కూడా, ఆదిలో ఈ ప్రపంచం మొత్తం బ్రాహ్మణ స్వభావం గల మనుష్యులతో నిండి ఉందని చెప్పబడింది. వారు క్రమంగా దిగజారి రకరకాల స్వభావాలుగల మనుష్యులుగా ఏర్పడ్డారు. కాలచక్రం మళ్ళీ తిరుగుతోంది. తిరిగి మానవజాతి అటువంటి బ్రాహ్మణస్వభావానికి చేరుకుంటుంది!"

*"ఆ కాలచక్రం ఇప్పుడు చుట్టుతిరిగి ఆదికి చేరుతోందన్న సత్యాన్ని మీకు నేనిపుడు తెలియజెపుతున్నాను. ...మీ పూర్వీకులు మీమీద ఉంచిన గొప్ప కర్తవ్యం ఒకటుంది. ..అనంతంగా సాగిపోతూ ప్రతి ఒక్కరూ అత్యున్నతమైన పరిణామాన్ని సాధించాలన్నదే వారు ఇచ్చిన ఆదేశం. అత్యున్నతుడైన మనిషి నుంచి అతిహీనమైన మనిషి వరకూ, ఈ దేశంలోని ప్రతి ఒక్కరూ గొప్పగా ప్రయత్నించి ఆ బ్రాహ్మణత్వాన్ని అందుకోవాలన్నదే వారి శాసనం. వేదాంతం మనకిచ్చిన మహోన్నతమైన ఆదర్శం ఇది. మనదేశానికే కాక ప్రపంచం మొత్తానికీ ఇది వర్తిస్తుంది. ... మానవాళి మొత్తాన్ని నెమ్మదిగా, సుతిమెత్తగా పైకిలేవనెత్తి, బ్రాహ్మణత్వాన్ని సాధించిన పారమార్థికుడైన మనిషి స్థాయిని చేరుకోవడమనే ఆ అమోఘమైన ఆదర్శం దిశగా మన వర్ణవ్యవస్థ సాగాలి. అటువంటి ఆదర్శపురుషుడు ఎటువంటి పోరాటాలకు పాల్పడకుండా, శాంత స్వభావుడై, స్థిరమైన నడవడి కలవాడై, ఎల్లవేళలా ఆరాధనాభావంతో, పవిత్రమైన శీలంతో, నిరంతరం ధ్యానమగ్నుడై ఉంటాడు. ఈ ఆదర్శంలోనే దైవం ఉంది... ఎల్లప్పుడూ ఈ విషయాన్ని గుర్తుంచుకోండి. ఈ ప్రపంచంలో, మన దేశానికన్నా ఉన్నతమైన ఆదర్శాన్ని కలిగిన సామాజికవ్యవస్థ ఉన్న దేశం నిజంగా మరొకటి లేదు."*

పూజ్య రంగనాథానంద స్వామి నాలుగు పురుషార్థాలనూ, వర్ణవ్యవస్థలో వాటి మధ్య సమతూకం ఏర్పడినప్పుడు కలిగే అత్యున్నతమైన స్థితినీ వివరించారు.

"భారతదేశపు సనాతన ధర్మం దర్శించిన బ్రాహ్మణత్వమనే ఈ ఆదర్శం యొక్క దిశకు, గమ్యానికి వేదాంతం బోధించిన నాలుగు పురుషార్థాలు మరింత ఊతమిచ్చాయి. మనిషికి న్యాయంగా ఉండదగిన కోరికలూ, సంతృప్తులే ఆ పురుషార్థాలు. అవి ధర్మం (నైతికత), అర్థం (సంపద), కామం (ఇంద్రియసుఖాలు), మోక్షం (ముక్తి). ఏ సమాజంలో అయితే అందరు వ్యక్తులకూ అర్థకామాలను పొందడానికి సమానమైన అవకాశాలు లభిస్తాయో, అవి ఎల్లప్పుడూ ధర్మం (నైతికత) యొక్క అదుపాజ్ఞలలో

ఉంటాయో, అటువంటి సమాజంలో నాలుగవ పురుషార్థమైన మోక్షం కోసం ప్రయత్నించాలన్న ఉన్నతమైన ఆకాంక్ష దానంతట అదే ప్రజలలో మేలుకుంటుంది అని భారతీయ సామాజికశాస్త్రం బోధించింది. వీటిలో మొదటి మూడింటినీ త్రివర్గమని పిలుస్తారు. ఎందుకంటే శాంతిసౌఖ్యాలతో తులతూగే ఏ సమాజంలోనైనా సరే ఈ మూడూ కలిసి ముందుకు సాగవలసిందే. వీటినే ఆధునిక భాషలో 'మానవ పురోభివృద్ధికి సంబంధించిన భౌతిక అంశాలు' అని పేర్కొంటున్నారు. అయితే వేదాంతం వీటిని 'పారమార్థికతకే సంబంధించిన భౌతిక అంశాలు'గా పేర్కొంది. నాలుగవదైన మోక్షమనే పురుషార్థం ఆ పారమార్థికత యొక్క పరిపూర్ణతనూ, ప్రకాశాన్నీ తనలో పొందుపరచుకుంటుంది. ఈ నాలుగు పురుషార్థాల ప్రణాళిక సమాజంలో చక్కగా అమలయ్యేలా చూసినప్పుడు, ఆ సమాజం ఆ బ్రాహ్మణత్వమనే ఆదర్శం దిశగా మరలి, ఇంకా ఎక్కువగా ఆ విధమైన వ్యక్తిత్వాలను రూపుదిద్ది, వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ, ఆరోగ్యాన్నీ, సంక్షేమాన్నీ సాధించి తద్వారా అహింసతోనూ, మానవత్వంతోనూ నిండిన ఒక సమసమాజాన్ని నిర్మిస్తుంది."

పూజ్య రంగనాథానంద స్వామి జీవశాస్త్రపరంగా కూడా ఈ బ్రాహ్మణత్వమనే ఆదర్శానికి వివరణ ఇచ్చారు. "భారతీయ ఋషులు దర్శించిన మానవ పురోగతి, సామాజిక గమనం ఈ 20వ శతాబ్దంలో కొత్త మెరుగులు దిద్దుకున్న పరిణామ సిద్ధాంతంలో ప్రతిధ్వనిస్తున్నాయి. మానవ పరిణామం భౌతిక స్థాయిని, సేంద్రియ (ఆర్గానిక్) స్థాయిని దాటి మనస్తత్త్వ-సామాజిక స్థాయులకు ఎగబ్రాకిందని ఆధునిక జీవశాస్త్రం అంగీకరిస్తోంది. మనిషికి ప్రకృతి ఇప్పటికే అందించిన అతి చక్కని బహుమానం అతడి మెదడు. దాని ద్వారా మనిషి తనకు కావలసిన అన్ని రకాల కొత్త అవయవాలనూ యంత్రాల రూపంలో తయారు చేసుకోగలుగుతున్నాడు. కాబట్టి మనిషి స్థాయిలో జీవపరిణామాన్ని సేంద్రియ స్థాయిలో చూడకుండా మనస్తత్త్వ-సామాజిక

స్థాయులకు లేవనెత్తక తప్పదు. జంతుస్థాయిలో రాశి ముఖ్యం కావచ్చు కానీ మానవస్థాయిలో వాసి ముఖ్యం అని ఆధునిక జీవశాస్త్రం గ్రహించింది. కాబట్టి, మనిషిని కేవలం తన పరిమితమైన ఇంద్రియాలకు లొంగిపడివుండే బానిసలాగా ఉండే స్థితినుండి తనను తాను విడిపించుకొనేందుకు ఈ పరిణామసిద్ధాంతం సహాయపడగలగాలి. దానికి తోడు, మనిషి విశాలదృక్పథాన్ని ఏర్పరచుకుని, నైతికస్పృహతోనూ, సామాజిక దృక్పథంతోనూ మెలగుతూ, తోటి మానవుల పట్ల మాత్రమే కాక అన్ని జంతుజాలాల పట్ల కూడా దయాదృష్టినీ, కలివిడినీ, ప్రేమనూ, మానవత్వాన్నీ చూపగలగడానికి ఈ పరిణామ సిద్ధాంతం దోహదం చెయ్యాలి. ఆ విధంగా మానవజాతి బ్రాహ్మణత్వాన్ని చేరుకోగలగాలి.”

## 49. కర్తవ్యనిష్ఠతో పరిణతి సాధించిన కొందరు మహనీయుల జీవితకథలు

“ఒక జీవితం మరొక జీవితాన్ని వెలిగిస్తుంది!” గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవడం ద్వారా మనం కూడా అటువంటి వ్యక్తిత్వాలనూ, జీవితాలనూ నిర్మించుకోవడం సాధ్యమవుతుంది. వీరిలో ఎవ్వరూ ‘ఈ క్షణంలో నేను ఈ పనిచేస్తే మరుక్షణంలో నాకేమి వస్తుంది?’ అని లెక్కలు వేసినవాళ్ళు కాదు. వీరందరూ తమ కర్తవ్యమని భావించిన పనిని పట్టువదలకుండా చేసినవారే.

**సక్తుప్రస్థుడు**

మహాభారతంలో సక్తుప్రస్థుడనే బ్రాహ్మణుడి కథ ఉంది. పాండవులు రాజసూయయాగం చేసిన తర్వాత గొప్పగొప్ప సంపదలన్నింటినీ దానం చేశారు. అటువంటి దానాలను ఈ ప్రపంచంలోనే ఎవరూ చేయలేదని అందరూ వేనోళ్ళ పొగుడుతున్నారు. ఇంతలో ఒక ముంగిస వచ్చి ఆ ప్రదేశంలో మాటిమాటికీ పొర్లాడి,

తల వెనక్కు తిప్పి తన శరీరాన్ని చూసుకుంటోంది. ఈ ముంగిస అలా చేయడాన్ని పాండవులతో పాటు శ్రీకృష్ణుడు కూడా చూస్తున్నాడు. ఆ ముంగిస యొక్క శరీరంలో సగభాగం బంగారు రంగులో ఉండడాన్ని కూడా వారు గమనించారు. ఆ ముంగిస అలా ఎందుకు చేస్తోందని పాండవులు కృష్ణుణ్ణి ప్రశ్నించారు. దాని కథను కృష్ణుడు వివరించాడు.

"ఒక ఊరిలో సక్తుప్రస్థుడనే బ్రాహ్మణుడు ఉన్నాడు. అతడికి ఒక భార్య, కొడుకు, కోడలు ఉన్నారు. దేశంలో కరవు తాండవిస్తోంది. ఆ బ్రాహ్మణుడు అతికష్టంమీద కొంత పేలపిండి సంపాదించాడు. ఇంట్లో నలుగురూ దాన్ని నాలుగు భాగాలుగా చేసుకుని తినడానికి కూర్చున్నారు. సరిగ్గా అదే సమయానికి ఎవరో తలుపు తట్టారు. తీసిచూస్తే ఎవరో అతిథి నిలబడి ఉన్నాడు. ఆకలితో నకనకలాడుతున్నానని చెప్పాడు. అతిథికి మర్యాద చేయడం గృహస్థు యొక్క పరమధర్మం. 'అతిథి దేవోభవ' అన్నారు కదా! వెంటనే సక్తుప్రస్థుడు తన భాగాన్ని అతడికి ఇచ్చాడు. ఆ అతిథి దాన్ని ఆవురావురుమంటూ తిని, 'అయ్యా నేను ఇప్పుడు చనిపోయేలాగున్నాను. మీరు నాకు ఏమీ పెట్టకపోయినా బాగుండేది! మీరు పెట్టిన చాలీచాలని భోజనంతో నా ఆకలి మరింత పెరిగిపోయింది. ఇప్పుడు నా గతేమిటి?" అన్నాడు. అది విని ఆ బ్రాహ్మణుడి భార్య, ధర్మాచరణలో భర్తకు సహకరించడమే తన పరమధర్మమని భావించి తన వంతు భాగాన్ని కూడా ఆ అతిథికి ఇచ్చి వేసింది. అతడు దానిని కూడా తినివేసి ఇంకా కావాలన్నాడు. తండ్రి తన ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించేందుకు సహకరించడమే కొడుకు యొక్క పరమధర్మం అని భావించి ఆ బ్రాహ్మణుడి కొడుకు, అతనిని అనుసరించి అతడి భార్య, తమతమ భాగాలను కూడా ఆ అతిథికి సమర్పించారు. ఆ అతిథి దానిని అంతా పూర్తిగా ఆరగించి, వారిని ఆశీర్వదించి, వెళ్ళిపోయాడు. ఆకలి బాధతో ఆ నలుగురూ అదే రాత్రి ప్రాణాలు వదిలారు. ఆ అతిథి భోజనం చేసినచోట

నాలుగు పిండి రవ్వలు నేలమీద పడ్డాయి. ఈ ముంగిస అక్కడ ఆడుతూ ఆ నేలమీద తన వీపును రుద్దుకొని పొర్లాడింది. ఆ పిండి యొక్క మహిమ వల్ల దాని వీపులో సగభాగం బంగారు రంగులోనికి మారిపోయింది. అప్పటి నుంచీ ఆ ముంగిస ప్రపంచమంతా తిరుగుతూ గొప్పగొప్ప దానధర్మాలు జరిగిన ప్రదేశాలన్నీ సందర్శిస్తూ అక్కడ పొర్లి తన మిగిలిన శరీరం కూడా బంగారు రంగులోకి మారుతుందేమోనని చూస్తోంది. కానీ ఎక్కడా అలా జరగలేదు. చివరికి ఇక్కడ కూడా దాని మిగిలిన శరీరం బంగారంగా మారలేదు. కాబట్టి ఈ రాజసూయ యాగం కన్నా ఆ సక్తుప్రస్థుడు చేసిన దానమే గొప్పది!" అని కృష్ణుడు ముగించాడు. ఇది విని పాండవులు నిర్ఘాంతపోయారు.

సక్తువు అంటే పేలపిండి అనీ, ప్రస్థానం అంటే ప్రయాణం అనీ, అలా సక్తుప్రస్థుడు అంటే పేలపిండి దానం ద్వారా పరిపూర్ణతను సాధించాడని అర్థం. నిజానికి ఇతడి అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు. కేవలం అతడి మహత్కార్యం వలన అతడికి ఆ పేరు వ్యవహారంలోకి వచ్చింది. తమ పేరు ఎవరికీ తెలియనీయకుండా, కర్తవ్యనిష్ఠనే తమ జీవితాదర్శంగా చేసుకుని ధర్మబద్ధంగా జీవించినవారు భారత చరిత్రలో అనేకమంది కనిపిస్తారు. సక్తు అంటే కఠినమైన అని మరొక అర్థం కూడా ఉంది. దీనిని అనుసరించి, సక్తుప్రస్థుడు అంటే కఠినమైన మార్గంలో ప్రయాణం చేసినవాడనే అర్థం కూడా వస్తుంది. తన కర్తవ్యనిష్ఠలో ఎంత కఠినమైన పరిస్థితులు ఎదురైనా ఆ బ్రాహ్మణుడు వెనుకంజ వేయలేదు. ఒక బ్రాహ్మణుడిగా, గృహస్థుగా తన కర్తవ్యాన్ని ఆచరించి చూపాడు.

**శిబిచక్రవర్తి**

శిబిచక్రవర్తి కథ మనకు పురాణాలలో కనిపిస్తుంది. రాజు (క్షత్రియుడి) యొక్క కర్తవ్యం తన పౌరులకోసం అవసరమైతే తన ప్రాణాలనే పణంగా పెట్టడమని ఇంతకు ముందు చదివాము. ఆ కథలో ఒక పావురం తనను ఒక డేగ తరుముతూ ఉంటే పారిపోయి వచ్చి శిబిచక్రవర్తిని శరణు వేడుతుంది. ఆ పావురం శరీరం బరువుకు

సమానమైన మాంసాన్ని తన శరీరం నుండి కోసి ఇస్తే ఆ పావురాన్ని వదిలివేస్తానని ఆ డేగ మహారాజుతో చెపుతుంది. ఒక త్రాసును తీసుకువచ్చి దాని ఒక పళ్ళెంలో ఆ పావురాన్ని ఉంచి రెండవ పళ్ళెంలో ఆ రాజు తన మాంసాన్ని కోసి వేస్తాడు. కానీ అదేం విచిత్రమో ఎంత మాంసాన్ని కోసి ఆ పళ్ళెంలో వేసినా ఆ పావురం బరువుకు సరితూగదు. చివరకు ఆ మహారాజు తానే రెండవ పళ్ళెంలో కూర్చుంటాడు. ఎంత అత్యున్నతమైన త్యాగమో చూడండి! అప్పుడు ఆ పావురం, డేగ – అగ్ని, ఇంద్రుడు – తమ నిజరూపాలను చూపి, తాము శిబి చక్రవర్తిని పరీక్షించడానికి వచ్చామని చెప్పి, అతణ్ణి ఆశీర్వదించి వెళ్ళిపోతారు.

**చాణక్యుడు**

భారతదేశపు చరిత్రలో మగధ ఒక పెద్ద దేశంగా విలసిల్లింది. ఆ కాలంలో అలెగ్జాండర్ మన దేశాన్ని జయించడానికి దండయాత్రలు చేస్తూ చిన్నచిన్న రాజ్యాలను ఆక్రమించుకోసాగాడు. ఆ కాలంలో ఒక ఆచార్యుడిగా గురుకులాన్ని నడుపుతున్న చాణక్యుడు దేశంలో ఆర్షవిద్య దెబ్బతినడాన్ని గమనించాడు. మరొకవైపు మగధ రాజయిన మహాపద్మనందనుడి దుష్టపాలనతో ప్రజలు బాధపడసాగారు. నవనందనుల చేత అవమానానికి గురయిన చాణక్యుడు అతడి వంశాన్ని నాశనం చేస్తానని శపథం చేశాడు. సన్మార్గుడైన చంద్రగుప్తుడి చేత వారిని యుద్ధంలో ఓడించి, అతడిని దేశానికి రాజును చేశాడు. అంతేగాక యోగ్యుడైన నందుని మంత్రి రాక్షసుణ్ణి చంద్రగుప్తుడికి కూడా మంత్రిగా నియమింపజేశాడు. తానే మంత్రి కావాలని ఆశించలేదు. దేశ ప్రజలకు విద్యగరపటమే తన ధర్మమని చెప్పి తన ఆశ్రమానికి మరలిపోయాడు. ఆర్షవిద్యలోని గొప్పతనాన్ని రాబోయే తరాలకు అందించడమే తన కర్తవ్యమని భావించాడు. శత్రువుల ఆలోచనకు నాలుగడుగుల ముందే ఆలోచించడం ఈయన గొప్పతనం. ఈనాటికీ ఆర్థిక, రాజకీయ విషయాలమీద సాధికారికమైనదిగా చెప్పబడే

'కౌటిల్యుని అర్ధశాస్త్రం' అనే గొప్ప గ్రంథాన్ని రచించాడు.

**శివాజీ మహారాజు**

ఇటీవలి కాలంలోని చరిత్రలో కూడా గొప్పగొప్ప రాజుల కథలు మనకు అనేకం కనిపిస్తాయి. శివాజీ మహారాజు ఒక చక్కని ఉదాహరణ. ప్రజల రక్షణకోసం తన ప్రాణాలను పణంగా పెట్టడంలోనూ, వెన్ను చూపకుండా యుద్ధం చేయడంలోనూ, తన ప్రజల సంక్షేమాన్ని కోరడంలో అత్యున్నతమైన త్యాగనిరతిని చూపడంలోనూ ఆయనకు ఆయనే సాటి.

**మహారాణి అహిల్యాబాయి హోల్కర్**

మహారాణి అహిల్యాబాయి హోల్కర్ కథ మనకు కనువిప్పు కలిగించేదిగా ఉంటుంది. తన సొంత కొడుకే అయిన రాకుమారుడు రాజధానిలోని దేవాలయాన్ని సందర్శించడానికి వచ్చే భక్తుల చెప్పులలో తేలుపిల్లలను వదిలిపెడుతూ ఉండేవాడు. అది చాలా తప్పు అని ఆ మహారాణి తన కొడుకును హెచ్చరించింది. కానీ వాడు ఆ మాట చెవిని పెట్టలేదు. జనరంజకంగా పాలించవలసిన కాబోయే రాజు ప్రజాకంటకుడవుతున్నాడని భావించి ఆ మహారాణి తన పుత్రుడే అయినా లెక్కచెయ్యకుండా అతణ్ణి ఏనుగులచేత తొక్కించింది. కర్తవ్యనిష్ఠకు పరాకాష్టగా నిలిచింది.

**బ్రదర్ లారెన్స్**

కాయకష్టంతో నిండిన, అతి సాధారణమైన జీవితాన్ని గడుపుతూ, గొప్పతనాన్ని సాధించిన వారికి ఉదాహరణగా బ్రదర్ లారెన్స్‌ను చెప్పుకోవచ్చు. అతడు నిరుపేద కుటుంబంలో జన్మించాడు. పద్ధెనిమిది సంవత్సరాల వయసులో అతని మానసిక దృక్పథంలో పెనుమార్పు చోటుచేసుకుంది. శీతాకాలంలో ఒకనాడు ఆకులన్నీ రాలిపోయిన ఒక వృక్షాన్ని అతడు చూశాడు. ఆ వృక్షం చేత మళ్ళీ చిగురింపజేసే

అద్భుతమైన శక్తి ఏ విధంగా ఉంటుందో కదా అని ఆలోచించసాగాడు. ఈ ఆలోచనే ప్రాపంచిక జీవితం నుంచి అతణ్ణి ముక్తుణ్ణి చేసి, పారమార్థిక పథంలో ప్రవేశపెట్టింది.

అతడు కొంతకాలం సైన్యంలోనూ, కొంతకాలం ఒక కులీన కుటుంబీకులకు సేవకునిగానూ పనిచేసి, చివరకు ప్యారిస్ నగరంలో ఉన్న కార్మలైట్ మఠంలో వంటమనిషిగా చేరాడు. భగవంతుని దివ్యసన్నిధిని నిత్యం అనుభూతి చెందుతూ, అదే వంటశాలలో ముప్పై ఏళ్ళు పని చేశాడు. భగవచ్చైతన్యాన్ని అన్నివేళలా అనుభవించడం వలన, వంటపనులలో నిమగ్నమై ఉన్నా సరే, అత్యున్నతమైన ఆధ్యాత్మిక సాక్షాత్కారాన్ని అతడు పొందాడు. సామాజికంగా నిమ్నస్థాయిలో ఉన్నా, అతడు పవిత్రతకు మారుపేరయ్యాడు. రాజులు, చర్చి అత్యున్నతాధికారులు కూడా అతని సలహా తీసుకునేవారు. తన మానసికస్థితిని అతడు ఈ విధంగా వర్ణించాడు: “ప్రార్థన సమయానికీ, పనిచేసే సమయానికీ పెద్ద తేడా నాకు ఎప్పుడూ లేదు. వంటశాల కోలాహలంలో నేను ఉన్నప్పుడూ, లేదా అనేకమంది నన్ను ఒకేసారి రకరకాల వస్తువులను అడుగుతున్నప్పుడు కూడా నా మనస్సు నిరంతరం భగవత్సాన్నిధ్యంలోనే ఉన్న భావన నాకు కలిగేది. మోకరిల్లి దివ్యమైన భగవత్కృపకు పాత్రుణ్ణవుతున్నట్లు అనిపించేది.”

బ్రదర్ లారెన్స్ సంభాషణలు, లేఖలు కూర్చబడిన పుస్తకం “ది ప్రాక్టీస్ ఆఫ్ ప్రెసెన్స్ ఆఫ్ గాడ్”.

**కబీర్**

చేనేత పని చేస్తూ, జ్ఞానోదయాన్ని పొందిన మహాత్మునిగా కబీర్ గురించి చెప్పుకోవచ్చు. పదిహేనవ శతాబ్దపు ప్రజల మీద అతని ప్రభావం చాలా ఉంది. ఆ కాలంలోని ముస్లిమ్, హిందూ ప్రజల మధ్య పరస్పర అవగాహనకు అతడి కవిత్వం ఎంతగానో తోడ్పడింది. అతడు పాఠశాలకు ఎన్నడూ వెళ్ళలేదు, ఏ తత్త్వశాస్త్రమూ చదువలేదు. అతనికి వివాహం అయింది. ఒక కొడుకు, కూతురు ఉండేవారు. చేనేత

ద్వారానే అతడు తన జీవనభృతిని సంపాదించేవాడు. ఆ నేత పనిలో మునిగి ఉన్నప్పుడే తన కవితలను వ్రాశాడు.

మానసికంగా రామానంద స్వామిని తన గురువుగా స్వీకరించాడు. ఆయన గురించి ఎంతో విన్నాడు కానీ, తనను శిష్యుడిగా అంగీకరించడని అనుమానించి, ఆయన వద్దకు వెళ్ళడానికి జంకాడు. కానీ ఒకరోజు అతనికి ఒక మంచి ఉపాయం తట్టింది. ప్రతిరోజూ తెల్లవారు ఝామున రామానంద స్వామి స్నానం చెయ్యడానికి గంగానదికి వెళ్తాడని కబీర్‌కు తెలుసు. ఒకరోజు ఆ సమయానికి ముందే అక్కడకు చేరుకుని ఆ మెట్ల మీద అడ్డంగా పడుకున్నాడు. చీకట్లో కనిపించక, రామానంద స్వామి అతని శరీరాన్ని కాలితో తొక్కాడు. మరుక్షణం ఎవరో మనిషిని తొక్కానని గ్రహించి, విస్మయంతో 'రామ్, రామ్' అని ఉచ్చరించాడు. కబీర్ ఆ మాటనే గురువు తనకు ఇచ్చిన మంత్రంగా భావించి, లేచి నిలబడి, "గురుదేవా! మీరు నాకు మంత్రాన్ని ఇచ్చి, తమ శిష్యునిగా చేసుకున్నారు. నేను కేవలం ఒక ముస్లిం చేనేత పనివాణ్ణి" అని ఎంతో వినయంగా చెప్పుకున్నాడు. అతని భక్తిశ్రద్ధలకు, వినయవిధేయతలకు ముగ్ధుడైన రామానంద స్వామి అతణ్ణి తన శిష్యుడిగా చేసుకున్నాడు.

అప్పటి నుంచీ కబీర్ పారమార్థికతతో నిండిన జీవితాన్ని గడిపాడు. భగవంతుని నామాన్ని స్మరిస్తూ, కవితలను అల్లడానికి అతని రోజువారీ పనులు ఏమాత్రం అడ్డుపడలేదు. అతడు కూడా భగవత్సాక్షాత్కారాన్ని పొందాడు. చాలామంది ముస్లింలు, హిందువులు కూడా అతనికి అనుయాయులుగా ఉండేవారు. అప్పట్లో అమలులో ఉన్న సంప్రదాయాలను అతడు ధిక్కరించి, ప్రతివారికీ భగవంతుడి గురించి బోధిస్తూ, స్థానిక పురోహితులనూ, ముల్లాలనూ, వారివారి పద్ధతులనూ ఆక్షేపించేవాడు. దాంతో రెచ్చిపోయిన హిందూ, ముస్లిం పెద్దలు ఇద్దరూ అతనిపై కత్తికట్టి, కాశీ నగరం నుంచి అతణ్ణి బహిష్కరించారు. అతని అనుయాయులతో కలసి, అనేక ప్రదేశాలకు తిరుగుతూ

అతడు తన శేషజీవితాన్ని గడిపాడు. పండు ముదుసలి వయస్సు వరకూ జీవించాడు. ఒక కథ ప్రకారం, అతని మరణం తర్వాత శరీరాన్ని ఎలా ఖననం చేయాలన్న విషయం మీద అతడి ముస్లిం, హిందూ భక్తులు వాదించుకున్నారు. కొంతసేపు వాదించిన తర్వాత, కబీర్ శరీరం మీది గుడ్డను తొలగించి చూస్తే కేవలం ఒక పుష్పరాశి మాత్రం కనిపించిందట!

**త్యాగరాజు**

వాగ్గేయకారుడైన త్యాగరాజు జీవితకథను చదవండి. ఆయన ఉంఛవృత్తి చేస్తూ జీవించాడు. సంగీతాన్ని తన జీవిత పరమావధిగా ఎంచుకున్నాడు. కఠోరమైన పరిశ్రమతో దాన్ని అభ్యసించాడు. అతడి పరిశ్రమకు మెచ్చి నారదుడే వచ్చి ఆయనకు సంగీతంలో మెలకువలు బోధించాడని ప్రతీతి. జీవితంలో దారిద్ర్యంతో పాటు ఎన్ని కష్టాలు ఎదురైనా తన ఆదర్శాలను వీడలేదు. ఆ విధమైన పరిశ్రమవల్ల సాధించిన అఖండమైన మేధస్సుతో కర్ణాటక సంగీతానికే మూలపురుషుడయ్యాడు. వేలకొద్దీ కృతులు రచించాడు. అవి ఈనాటికీ గొప్పగా ఆదరించబడుతున్నాయి. రాజసత్కారాలను తిరస్కరించాడు. తన వద్దకు వచ్చిన అనేకమంది శిష్యులకు ఉదారంగా, వారినుంచి ఏమీ ఆశించకుండా విద్య నేర్పాడు. అలా కర్తవ్యనిష్ఠకు మహోన్నతమైన ఉదాహరణగా నిలిచాడు. ఆయన గతించి కొన్ని వందల సంవత్సరాలు గడచినా, ఆయన కృతులను జనం పాడుతూనే ఉన్నారు. వాటిలోని గొప్ప భక్తిభావం అందరికీ గొప్ప స్ఫూర్తిని ఈనాటికీ కలిగిస్తూనే ఉంది.

**బమ్మెర పోతన**

ఆంధ్ర మహాభాగవతాన్ని రచించిన పోతనను కర్తవ్యనిష్ఠకు మరొక చక్కని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఆయన సాధారణమైన రైతుగా జీవించాడు. కవిత్వాన్ని, దాని ద్వారా భక్తిని తన ఆదర్శంగా తీసుకున్నాడు. వేరే ఆలోచనలన్నింటినీ

విడిచిపెట్టాడు. అత్యద్భుతమైన ఆంధ్రమహాభాగవతాన్ని రచించాడు. ఆంధ్రభాషాచరిత్రలో చిరకాలం నిలిచిపోయాడు. త్యాగరాజుగారి లాగానే రాజసత్కారాలు కోరలేదు.

**శ్రీశారదాదేవి**

శ్రీరామకృష్ణుల సహధర్మచారిణి, పవిత్రతకు మారుపేరైన శ్రీశారదాదేవి (1853–1920) కూడా ప్రపంచపు గురువరేణ్యులలో ఒకరు. భారతదేశపు ఆధ్యాత్మిక చరిత్రలో ఆమె స్థానం ఎంతో ప్రత్యేకమైనది. సీత, సావిత్రి మొదలైన సాధ్వులు నెలకొల్పిన ఆదర్శాలు మనందరికీ తెలుసు. కానీ అద్వైత వేదాంతాన్ని బోధించిన గార్గి, మైత్రేయి వంటి స్త్రీమూర్తులు ఎంతో గొప్పవారైనా సామాన్య ప్రజలలో వారికి తగినంత గుర్తింపు రాలేదు. అయితే శ్రీశారదాదేవి వీరి కంటే కూడా ఎంతో ఉన్నతమైన కోవకు చెందినవారు. జీవితంలో ఆమె ఆదర్శవంతమైన పుత్రికగా, సోదరిగా, గృహిణిగా, పారమార్థిక సాధకురాలిగా, బ్రహ్మచారిణిగా – ఇవన్నీ కలగలిసిన ఆదర్శనారిలాగా జీవించారు. ఉపనిషత్తులలో, "భర్తను భర్తగా కాక, భర్తలో ఉన్న పరబ్రహ్మం కోసం ప్రేమించాలనీ, అలాగే భార్యను భార్యగా కాక, ఆమెలో ఉన్న పరబ్రహ్మం కోసం ప్రేమించాలనీ" చెప్పబడిన సూక్తిని అక్షరాలా జీవితంలో ఆచరించి చూపిన మహిళ శ్రీశారదాదేవి. శ్రీరామకృష్ణులతో అటువంటి ఆదర్శవంతమైన జీవితం గడిపిన ఆమె జ్ఞానోదయాన్ని పొంది, తర్వాత దివ్యజననిగా రూపొందారు. రక్షణ కోసం, ఓదార్పు కోసం, శాంతి కోసం, పవిత్రత కోసం, ఆధ్యాత్మికత కోసం ఆమెను వేడుకున్న వందలమంది సాధకులకు ఆమె ఆశ్రయమిచ్చి, ఉద్ధరించారు.

మామూలు గృహస్థవిధులను నెరవేరుస్తూనే ఆమె తన బాల్యజీవితాన్ని గడిపారు. తల్లిదండ్రుల, సోదరీసోదరుల ఆలనాపాలనా ఆమే చూసేవారు. దక్షిణేశ్వరంలో, దైవాంశసంభూతుడైన తన భర్తను ఏకనిష్ఠతో సేవించారు. ఆయన శిష్యులకు తానే

అమ్మగా వ్యవహరించారు. భర్త మరణానంతరం సాధారణమైన గ్రామీణస్త్రీలాగా జీవిస్తూనే, తన శిష్యుల ఆధ్యాత్మిక పురోభివృద్ధి కోసం, భక్తుల బాగు కోసం అలుపుసొలుపూ లేకుండా శ్రమించారు. ఒక ప్రక్క అశేషంగా తన వద్దకు వస్తున్న భక్తులకు ఆధ్మాత్మిక మార్గదర్శనం చేస్తూనే, ఎంత చిన్న పనినైనా, ఎంతో జాగ్రత్తగా చెయ్యాలని కేవలం బోధన ద్వారా మాత్రమే కాక స్వయంగా చేసిచూపేవారు. ఉదాహరణకు, ఒక చీపురును మూల పెట్టేటప్పుడు దాన్ని జాగ్రత్తగా నిలబెట్టాలనీ, విసిరి పారెయ్యకూడదనీ చెప్పేవారు. వస్తువులను ఎలా వృథా చేయకుండా ఉండాలో ఆచరణ ద్వారా చూపించారు. ఇటువంటి అనేక సంఘటనలను శారదాదేవి జీవితకథలో మనం చదువవచ్చు.

వివేకానంద స్వామి శ్రీశారదాదేవి గురించి చెపుతూ, "మీరు ఇప్పటికీ శ్రీశారదాదేవి గొప్పతనాన్ని అర్థం చేసుకోలేదు. క్రమేణా మీకు అవగతం అవుతుంది. శక్తి (స్త్రీ జనోద్ధరణ) లేకుండా ప్రపంచం పునరుజ్జీవనం కాజాలదు... భగవంతుని శక్తి రూపాన్ని ప్రదర్శించడానికే అమ్మ అవతరించారు. అమ్మను ఆదర్శంగా చేసుకుని మళ్ళీ మన దేశంలో ఎందరో గార్గి, మైత్రేయి వంటి బ్రహ్మవాదినులు ఉద్భవించి, స్త్రీజాతిని ఉద్ధరిస్తారు," అని తోటి శిష్యులకు తెలిపారు. ఈ విధమైన ఆదర్శవంతమైన మాతృత్వం చరిత్రలో ఎన్నడూ ప్రదర్శించబడలేదు. తరగని దయానిధిగా, ఎల్లప్పుడూ క్షమించే తల్లిగా, అందరినీ ప్రేమించి సేవించే అలుపెరుగని అమ్మగా, కర్తవ్యనిష్ఠకు ప్రతిరూపంగా నిలచిన శ్రీశారదాదేవి యావత్తు మానవజాతికీ ఆదర్శం.

## 50. ఉపసంహారం

ప్రకృతి సహజమైన భిన్నత్వం వలన వేర్వేరు మనుష్యులు తమకున్న శక్తిసామర్థ్యాలను బట్టి తమ జీవితంలో పరిపూర్ణతను సాధించడానికి సనాతన ధర్మం

అనేక మార్గాలను సూచించింది. వాటిలో కర్తవ్యనిష్ఠ ఒకటి. సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ మనిషి తన రోజువారీ పనులనే నిష్ఠతో, శ్రద్ధతో చేయడం ద్వారా పరిపూర్ణత సాధించవచ్చునన్నదే ఈ పద్ధతి. దీని ద్వారా మనిషి తన నిజస్వభావమైన పరమానంద స్థితిని చేరుకోగలుగుతాడు. కానీ అలా పనిచేయడానికి మనిషి తనలోని అహంకారాన్ని, మమకారాన్ని చంపుకోవాలి. దీనిని అభ్యాసం చెయ్యడం కోసం మనిషి తన నైపుణ్యాలను మరింత పెంచుకొనే దిశగా, తనతోటివారికి, సమాజానికి సేవ చేసే దిశగా శ్రమిస్తూ, తనలోని స్వార్థపు ఆలోచనలన్నింటినీ వద్దు వద్దు అని చంపుకుంటూ, పట్టువదలకుండా పనిచేసినప్పుడు పరిపూర్ణతను సాధిస్తాడు. వ్యక్తిస్థాయిలో కర్తవ్యనిష్ఠను అభ్యాసం చేయడానికి నాలుగు ఆశ్రమాలు ఏర్పరచబడ్డాయి. సామాజిక స్థాయిలో కర్తవ్యనిష్ఠను అభ్యాసం చేయడానికి నాలుగు వర్ణాలు ఏర్పరచబడ్డాయి. వీటిద్వారా పనిచేసేటప్పుడు మనిషిలోని దురభిమానం అతనిని పనిచెయ్యకుండా చేస్తుంది. ఇతరులతో పోటీపడి, వారిని అణచివెయ్యమనీ, వారిని దోచుకోమనీ చెపుతుంది. అయితే మనిషి ఈ దురభిమానాన్ని చంపుకోవాలి. ఎందుకంటే ప్రకృతిలో కనిపించే భిన్నత్వం వెనుక ఏకత్వం ఉంది. అందరిలోనూ అదే ఆత్మ నెలకొని ఉంది. అన్ని జీవులూ, అందరు మనుష్యులూ గొప్ప భిన్నత్వాన్ని చూపుతున్నా, క్రమంగా అందరూ ఒకే గమ్యం వైపు పయనిస్తున్నారు. దీనినే పరిణామంగా చెప్పుకోవచ్చు. అయితే జంతుప్రపంచంలో వర్తించే 'బలం గలవాడిదే రాజ్యం' మొదలైన నియమాలు మానవసామ్రాజ్యంలో వర్తించవు. జంతుస్థాయిలో పనిచేసే పోటీతత్వం మానవుని స్థాయిలో పనిచేయదు. మానవుని స్థాయిలో అహంకారమమకారాల్ని అణచివేసుకోవడం ద్వారా, తోటి జీవులపట్ల ప్రేమను చూపడం ద్వారానే మనిషి అభివృద్ధి సాధిస్తాడు. తనను తాను ద్వేషించుకోకుండా, తనలోని ఆత్మశక్తిని గుర్తుచేసుకుంటూ పనిచెయ్యాలి. ఒక యంత్రంలాగా పనిచేసే కర్తవ్యం సఫలీకృతం కాదు. సంకల్పశక్తిని వినియోగిస్తూ,

స్వతంత్రబుద్ధితో మనిషి పనిచెయ్యాలి. అందుకు తగిన విద్య అవసరం. ఆపైన మనిషి సరైన ఆహారాన్ని తీసుకుని సక్రమంగా వ్యాయామం చెయ్యడం ద్వారా శరీరాన్ని బలంగా ఉంచుకోవడం ఎంతైనా అవసరం. చివరిగా వేదాంతం బోధించిన దాని ప్రకారం మానవులందరూ బ్రాహ్మణత్వాన్ని చేరుకోవడానికి ప్రయత్నించాలి. ఈ బ్రాహ్మణత్వమనే ఆదర్శం పారమార్థిక సంస్కృతితోనూ, వైరాగ్యంతోనూ నిండివుంటుంది. ప్రాపంచికత లేశమంతైనా లేకుండా, సత్యపూరితమైన జ్ఞానం నిండుగా నెలకొని ఉన్నదే అసలైన బ్రాహ్మణత్వం. ఆ స్థితికి ఆ భూప్రపంచంలోని మానవులందరూ చేరుకోవాలన్నదే సనాతనులైన మన మహర్షులు మనకు ఇచ్చిన ఆదేశం.

**యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతం**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః (గీత 18.46)**

భగవంతుడిలోనుంచి ఈ సృష్టి మొత్తం పుట్టింది. ఆ భగవంతుడే ఈ సృష్టి అంతా ఆవరించి ఉన్నాడు. మనిషి తన స్వభావానికి తగిన పనిని నిష్ఠతో చేయడం ద్వారా ఆ భగవంతుణ్ణే ఆరాధిస్తున్నాడు. తద్వారా మనిషి పరమసిద్ధిని పొందుతాడు.